అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 22-4-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 62 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50



భువనగిరి రోడ్ షోలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రాష్ట్ర అవతరణను తప్పు పట్టిన
మోడీకి బుద్ధి చెప్పాలి

కమ్యూనిస్టులారా కలిసి పోరాడుదాం..

- కేసీఆర్.. ప్రభుత్వాన్ని కూలగొడతావా? నీవల్ల కాదు
- ప్రగతి భవన్‌ను జ్యోతిరావుపూలే భవన్‌గా మార్చాం
- ఎందరో అమరవీరుల పోరాటాల గడ్డ భువనగిరి ఖిల్లా
- ఆగస్టు 15కు తప్పకుండా రూ.2లక్షల రుణమాఫీ
- చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించండి : సీఎం రేవంత్‌రెడ్డి


నవతెలంగాణ-భువనగిరి

"ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఎందరో విద్యార్థుల బలిదానాన్ని చూసి సోనియాగాంధీ రాష్ట్ర అవతరణను చేస్తే మోడీ దాన్ని తప్పు పట్టారు. అలాంటి పార్టీకి, వ్యక్తికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. అలాగే, మేము చేసిన సేవలకు గుర్తింపుగా.. ప్రజలిచ్చిన తీర్పును కేసీఆర్ లెక్కచేయకుండా ప్రభుత్వాన్ని కూలగొడతానని మాట్లాడుతున్నారు. నల్లగొండ పోరాట వీరులైన.. కమ్యూనిస్టులారా కలిసి పోదాం.. మిమ్మల్ని అవమానించిన కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో మరోసారి బుద్ధి చెబుదాం." అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసీఆర్, మోడీలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం యాదాద్రి భువనగిరి పట్టణంలో కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలిపించాలని నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని అంబేద్కర్ చౌరస్తాలో కార్నర్ సభలో సీఎం ప్రసంగించారు. భువనగిరి, నల్లగొండ అంటేనే పౌరుషం.. విప్లవ చైతన్యవంతులైన ప్రజల అడ్డా అని తెలిపారు. ప్రజలు పడుతున్న బాధలను చూసి చెలించి కొమరం భీమ్ ప్రారంభించిన జల్-జంగల్-జమీన్ ఆసరాగా భువనగిరి జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ విప్లవ పోరాటానికి కమ్యునిస్టులు నాంది పలికారని గుర్తుచేశారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి, కొండా లక్ష్మణ్‌బాపూజీ లాంటివారు ...3లో

ఈసీ పరిమితులు
జాన్తానై..

పెరుగుతున్న పార్టీల ఎన్నికల వ్యయం

- నిర్దేశిత ఖర్చుకు మించి నోట్లు కురిపిస్తున్న అభ్యర్థులు, పార్టీలు
- ప్రపంచంలో అత్యంత ఖరీదైనవిగా 2019 ఎన్నికలు
- ఆ సమయంలోనే తెగిన కట్టల విలువ దాదాపు రూ.60 వేల కోట్లు
- ఈ సారి అంతకు మించే ఉంటుంది : రాజకీయ పరిశీలకులు, ఎన్నికల విశ్లేషకుల అంచనా
- ఈ విధానం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హెచ్చరిక




న్యూఢిల్లీ : భారత్‌లో ఎన్నికల పండుగ మొదలైంది. లోక్‌సభ ఎన్నికల్లో తొలి విడత పోలింగ్ జరిగింది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఇక మిగతా దశల్లో జరగబోయే ఎన్నికలకూ ప్రచారాలు, సభలు హోరాహోరీగానే జరుగుతున్నాయి. పార్టీలు, అభ్యర్థుల పోస్టర్‌లు, హోర్డింగ్‌లు, బ్యానర్‌లు, కరపత్రాలు, ఊరేగింపులు, వీధి నాటకాలు, కుటుంబ సమావేశాలు, నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఓపెన్ జీప్ టూర్‌లు, ఇంటింటి ప్రచారాలు.. ఇలా ఒక పార్టీ ప్రచారంలో అనేకం ఉంటాయి. దీంతో అభ్యర్థులు చేసే ఖర్చు తీవ్రంగా పెరిగిపోతున్నది. అభ్యర్థులతో పాటు రాజకీయ పార్టీలు కూడా విపరీతమైన డబ్బులను ఖర్చు చేస్తూ ఎన్నికల్లో తమ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నాయి. ప్రచార ఖర్చులు, అలాగే ఓటర్లకు నగదు, వస్తువుల రూపంలో అక్రమ ప్రోత్సాహకాలు విపరీతంగా పెరుగుతున్నాయని రాజకీయ పరిశీలకులు, ఎన్నికల విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఢిల్లీకి చెందిన థింక్ ...11లో

ఓటమి అంచుల్లో
కాషాయపార్టీ

ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

- బీజేపీ విధానాలతో జనం విసిగిపోయారు
- మరోసారి గద్దెనెక్కితే దేశానికే ప్రమాదకరం
- రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేస్తారు
- యథేచ్ఛగా మతకల్లోలాలు, మానవ హక్కుల ఉల్లంఘన : సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"భారతీయ జనతా పార్టీ ఓటమి అంచుల్లో కొట్టుమిట్టాడుతోంది. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి సంపూర్ణ మెజార్టీ రాదు. ఆ కూటమికి గరిష్టంగా 250 సీట్లు కూడా దాటవు. దేశ వ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. దాని విధానాలతో దేశం విసిగిపోయింది. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. మరోసారి మోడీ సర్కార్ గద్దెనెక్కితే దేశానికే ప్రమాదకరం. రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేస్తారు. మతకల్లోలాలు, మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతుంది. ఈ సారి ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ...11లో



జైల్లో పెడితే బెదరం

దేశాన్ని కాపాడుకుంటాం...

- రాజ్యాంగాన్ని రక్షించడం ముఖ్యం
- బీజేపీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయం
- మోడీ హామీ అవసరం లేదు.. రాజ్యాంగ హామీ కావాలి
- దేశంలో 90 శాతం నిరుద్యోగ యువత
- ఇండియాకు ఓటుతోనే దేశ రక్షణ
- ఆలోచించి ఓటు వేయండి : రాంచీలో ఇండియా ఫోరం నేతల పిలుపు
- సీపీఐ(ఎం) ప్రధాన కార్యాదర్శి సీతారాం ఏచూరి సంఘీభావం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీ ఓటమి ఖాయమైందని, ఆ పార్టీ తుడిచిపెట్టుకుపోతుందని ఇండియా బ్లాక్ నేతలు స్పష్టం చేశారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ అరెస్టుకు నిరసనగా ఆదివారం జార్ఖండ్ రాజధాని రాంచీలో ప్రభాత్ తారా గ్రౌండ్ వేదికగా ఇండియా ఫోరం న్యాయ తిరుగుబాటు మెగా ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీకి జార్ఖండ్‌లోని అధికార జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నాయకత్వం వహించింది. వేదికపై అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌లకు ప్రత్యేకంగా రెండు కుర్చీలను ఖాళీగా ఉంచారు. ఇందులో పాల్గొన్న జెఎంఎం కార్యకర్తలు సోరెన్ మాస్కులు ధరించి వచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "జైలు కా తాలా తూటేగా, హేమంత్ సోరెన్ చుటేగా" (జైలు తాళం పగలగొడతాం. హేమంత్ సోరెన్‌ను విడుదల అవుతారు), "జార్ఖండ్ ఝుకేగా నహీ" (జార్ఖండ్ తలవంచదు)" వంటి నినాదాలు చేశారు.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, జెఎంఎం అధినేత శిబు సోరెన్, కేజ్రీవాల్ భార్య సునీతతో పాటు హేమంత్ సోరెన్ భార్య కల్పన సోరెన్, పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్, ఆర్‌జేడీ నేత, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. అనారోగ్యం కారణంగా కాంగ్రెస్ నేత ...3లో



దాతృత్వ అవయవాలకు గుర్తింపు సంఖ్య

నొట్టో కింద నమోదు తప్పనిసరి : కేంద్రం

వివరాలు 11లో

వామపక్షాలు గెలిస్తేనే పార్లమెంటులో ప్రజావాణి

ప్రజాస్వామ్య రక్షణకు బీజేపీ కూటమిని ఓడించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్

నవతెలంగాణ-జనగామ

దేశంలో ప్రజాస్వామ్యం రక్షించబడాలంటే బీజేపీ కూటమిని ఓడించి, వామపక్ష, లౌకిక శక్తులను గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జనగామ జిల్లా సిద్దెంకి గ్రామంలో భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను ఆదరించాలని కోరుతూ నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భువనగిరి నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. సీపీఐ(ఎం) అభ్యర్థి గెలిస్తేనే పార్లమెంట్‌లో ప్రజావాణిని వినిపించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. పార్లమెంటులో వామపక్షాల బలం తగ్గడం వల్ల ప్రజా సమస్యలు పక్కకు పోయి కార్పొరేట్లకు ఉపయోగపడే విధానాలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. పదేండ్ల బీజేపీ పాలనలో కార్పొరేట్, మతోన్మాద



విధానాలు బలపడ్డాయని, వీటికి వ్యతిరేకంగా నికరంగా పోరాడింది దేశంలో వామపక్షాలే అని స్పష్టంచేశారు. వామపక్ష అభ్యర్థులు గెలిస్తే ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తేవడానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. నరేంద్ర మోడీ గుజరాత్ మోడల్ అని చెబుతున్న గుజరాత్‌లో కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 15 శాతానికిపైగా పేదరికం పెరిగిందని తెలిపారు. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం ...11లో



బస్సుయాత్ర షెడ్యూల్ మార్పు

24 నుంచి కేసీఆర్ రోడ్ షోలు, కార్నర్ మీటింగులు

- మిర్యాలగూడ నుంచి సిద్ధిపేట దాకా
- మే 10న ముగింపు
- బస్సు యాత్రలో ఆ మూడు అంశాలే ప్రధానం..
- బీజేపీని ఎండగట్టటం..కాంగ్రెస్‌ను నిలేయటం.. బీఆర్ఎస్సే రాష్ట్రానికి రక్ష అని చెప్పటం...

వివరాలు 2లో

ధాన్యానికి మద్దతు ధర ఇప్పిస్తా

రైతులు తొందరపడి తక్కువ ధరకు విక్రయించొద్దు : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

- కొనుగోలు కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-సిద్దిపేట

ధాన్యానికి రూ.2203 మద్దతు ధర ఇప్పిస్తానని.. రైతులెవరూ అధైర్యపడొద్దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం పెద్దకోడూర్ గ్రామ పరిధిలోని మెట్టు బండల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అధైర్య పడొద్దని.. తొందర పడి తక్కువ ధరకు విక్రయించొద్దని తెలిపారు. అధికారులతో మాట్లాడి.. రైతులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. వెంటనే అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో, డీఎం సివిల్ సప్లై ఐకేపీ అధికారులతో మాట్లాడి.. వెంటనే వడ్ల కొనుగోలు ప్రారంభించాలని కోరారు. కాగా గత 15 రోజుల నుంచి వడ్లు కొనుగోలు కేంద్రాల్లోనే ఉన్నాయంటూ రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చి వాపోయారు. పనులన్నీ విడిచిపెట్టుకుని ఈ వడ్ల దగ్గరే ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని నష్టాలకు తట్టుకున్నా.. ఇటీవలే కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయిందని వాపోయారు. కాగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి ఇన్ని రోజులవుతున్నా.. ఎందుకు



కొనడం లేదంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కరెంటు లేక పంటలు ఓ పక్క ఎండిపోతున్నాయని.. మరోపక్క చేతికందిన పంటలు నీటి పాలవుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఇలాంటి కష్టాలు లేవన్నారు. అనంతరం పలువురు రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా రగునవ్వ అనే రైతు మాట్లాడుతూ.. 15 రోజుల నుండి ఇక్కన్నే ఉంటున్నాం. కొనే నాథుడే లేడు.. కేసీఆర్ ఉన్నప్పుడు అన్ని ఇచ్చిండు.. ఇప్పుడు ఏం లేవు అంటూ వాపోయారు. మోహన్ రెడ్డి అనే రైతు మాట్లాడుతూ.. కరెంట్ తిప్పలతో రెండు సార్లు నా మోటార్ కాలింది. అందుకు అక్షరాలా రూ.22 వేలు అయింది. రైతు బంధు కూడా ఇవ్వలేదు. ఏది లేదు సార్.. మాకు తిప్పలు అవుతుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

మెదక్‌లో సీన్ మారేనా..!

25 ఏండ్లుగా కాంగ్రెసేతర పార్టీలదే హవా



- బోణీకొట్టేందుకు కాంగ్రెస్ వ్యూహ రచన
- 1980లో ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం 1999 నుంచి గెలవని కాంగ్రెస్
- బీజేపీ ఒక సారి, బీఆర్ఎస్ ఐదు సార్లు గెలుపు
- మెదక్‌లో సీఎం వర్సెస్ మాజీ సీఎం అన్నట్టు పోటీ
- స్వయంగా ప్రచారంలో పాల్గొంటున్న ఇద్దరు నేతలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో పాతికేండ్లుగా కాంగ్రెసేతర పార్టీల హవానే నడుస్తోంది. ఒక సారి బీజేపీ, ఐదు సార్లు బీఆర్ఎస్ గెలిచాయి. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీనే అధిక సార్లు గెలిచింది. 1980లో ఇందిరాగాంధీ మెదక్ నుంచి ఎంపీగా గెలిచి దేశ ప్రధాని అయ్యారు. ఆ తర్వాత మాజీ సీఎం కేసీఆర్, ఆలె నరేందర్, విజయశాంతి లాంటి ఉద్దండులు మెదక్ ఎంపీగా గెలిచారు. ఈ పాతికేండ్ల అపజయాల నుంచి బయటపడి గెలిచి తీరాలన్న కసితో ప్రస్తుతం కాంగ్రెస్ ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక వ్యూహ రచన చేస్తూ ప్రజాదరణ ఉన్న బీసీ అభ్యర్థిని పోటీకి దించారు. తానే ఎన్నికల ప్లాన్ రచిస్తూ నేరుగా ప్రచార రంగంలోకి దిగారు. బీఆర్ఎస్ సైతం డబుల్ హ్యాట్రిక్ కోసం కేసీఆర్, హరీశ్‌రావు స్వయంగా రంగంలోకి దిగారు. మెతుకు సీమ ఓటర్ల తీర్పు ఎటువైపో వేచి చూడాలి.

మెదక్ లోక్‌సభకు జరిగిన ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే.. పాతికేండ్లుగా ఇక్కడ కాంగ్రెస్ బోని కొట్టలేక పోయింది. అంతకు ముందు కాంగ్రెస్ గాలే వీచింది. గత నాలుగు సాధారణ ఎన్నికలతో పాటు ఒక ఉప ఎన్నిక జరుగగా వరుసగా బీఆర్ఎస్ గెలుస్తూ వచ్చింది. 2004లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి ఆలె నరేంద్ర, 2009లో ...2లో

మతోన్మాద బీజేపీ, ఎంఐఎంలను కలిసికట్టుగా ఓడిద్దాం

- కూనంనేనితో దిడ్డి సుధాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇండియా అలయెన్స్ లోని పార్టీలన్నీ కలిసికట్టుగా బీజేపీ, ఎంఐఎం పార్టీలను ఓడించాలని డాక్టర్ దిడ్డి సుధాకర్ కోరారు. ఆదివారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఆయన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో భేటీ అయ్యారు. ఇండియా అలయెన్స్‌లోని పార్టీలన్నింటినీ ఒక వేదికగా తీసుకొచ్చి ప్రజా సంఘాల సమావేశాలు, సదస్సులతో చైతన్యవంతులను చేయాలని సూచించారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అవినీతికి పాల్పడిన బీజేపీ విధానాలను ఎండగడతామని చెప్పారు. ఈ భేటీలో ఆప్ రాష్ట్ర మహిళా వింగ్ ప్రధాన కార్యదర్శి యమునా గౌడ్,యువజన విభాగం అధ్యక్షులు విజయ్ మల్లంగి, సోషల్ మీడియా భాద్యులు మహమ్మద్ సోహేల్ లు పాల్గొన్నారు.

మతతత్వ బీజేపీ, ఎన్డీయే కూటమిని ఓడించండి

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ సభలో కేజీ రాంచందర్ పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మెజార్టీ మతం పేరుతో బీజేపీ ఉన్మాదాన్ని పెంచి పోషిస్తున్నదనీ, అందువల్ల లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేజీ రాంచందర్ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో పార్టీ కార్యకర్తల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. గ్రేటర్ హైద్రాబాద్ కార్యదర్శి హన్మేశ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఒకవైపు మత విద్వేషాన్ని రెచ్చగొడుతూ...మరోవైపు ప్రభుత్వ సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. ముస్లింలను బూచిగా చూపుతూ హిందువుల్లో భయాందోళనలను కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పదేండ్లు చేసిందేమీ లేకపోగా, అయోధ్య రామాలయం పేరుతో ఈ సారి ఎన్నికల్లోకి వస్తున్నారని విమర్శించారు. మతాలకతీతంగా బీజేపీ పార్టీని బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

ఆర్‌పీఎస్ 2013 ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలి

- రేపు "డిమాండ్స్ డే"ని పాటించండి :ఎస్‌డబ్ల్యూఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీ కార్మికులకు ఆర్‌పీఎస్ 2013కు సంబంధించి ఇచ్చిన బాండ్ డబ్బులు రూ. 281 కోట్లను విడుదల చేస్తున్నామని ఫిబ్రవరి 10న స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ వేదిక నుండి ప్రకటించినప్పటికీ ఇప్పటికీ వారికి ఆ డబ్బులు చెల్లించకపోవటమేంటని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) ప్రశ్నించింది. ఆ మొత్తాన్ని తక్షణమే చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్‌పీఎస్ 2017 కు సంబంధించిన ఎరియర్స్ లెక్కలు చేసి కార్మికులకు ఒక కాపీ ఇవ్వాలని, అదే కాపీని కేసులో ఫైల్ చేయాలని వారు కోరారు. 2017 ఎరియర్స్‌ను కార్మికులు రిటైర్‌మెంట్ సమయంలో కాకుండా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం 'డిమాండ్స్ డే'ని పాటించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఆరోజు డిమాండ్ల బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ అనుబంధాలకు అతీతంగా కార్మికులు ఈ పిలుపును జయప్రదం చేయాలని ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 2013కు సంబందించిన బాండ్ డబ్బుల కోసం అనేక విజ్ఞప్తుల అనంతరం ఏప్రిల్ -2 న కేవలం డ్రైవర్లకు చెల్లించారనీ, మిగిలిన క్యాటగిరీల్లోని 28 వేల మందికి ఎందుకు చెల్లించలేదో ఇంత వరకు ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం ప్రకటించ లేదని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశంలో డిమాండ్స్ డేపై నిర్ణయాన్ని ప్రకటించారు. వీరాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు కె. గంగాధర్, కెఎస్ రెడ్డి, ఎవి రావు, కార్యదర్శి చంద్ర ప్రకాష్, ప్రచార కార్యదర్శి . రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజులు వానలు..

- ఆ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ..!

హైదరాబాద్: తెలంగాణలో రాగల నాలుగు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆదివారం నుంచి సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

సోమవారం నుంచి మంగళవారం వరకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు నిజామాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డిలో వానలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది.

భారత్‌ను మళ్లీ విశ్వగురువును చేయడమే...మోడీ గ్యారంటీ

- తెలుగు మ్యానిఫెస్టో ఆవిష్కరణలో కిషన్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ అధికారంలోకి రాగానే భారత్‌ను మళ్లీ విశ్వగురువును చేస్తామనీ, అదే మోడీ గ్యారంటీ అంటూ కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తెలుగులో రూపొందించిన బీజేపీ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న అన్యాయాలను, అక్రమాలను, అవినీతి, బంధుప్రీతిని సరిదిద్దుతున్నట్టు తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణానికి 'మోడీ గ్యారంటీ'తో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. అందరికీ నాణ్యమైన విద్య వైద్యం, ఇల్లు అందించేందుకు తమ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వివరించారు. పేదలకు ఇండ్లు, స్వచ్ఛమైన తాగునీటితోపాటుగా సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' కింద 'జీరో కరెంట్ బిల్' అందిస్తామన్నారు. ఆయుష్మాన్ భారత్, జన ఔషధి కేంద్రాలు, ఆరోగ్య మందిరాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. మూడుకోట్ల మంది గ్రామీణ మహిళలను లక్షాధికారులను చేస్తామని హామీ ఇచ్చారు. పేపర్ లీక్‌లను అరికట్టే విషయంలో కఠినమైన చట్టాలను తీసుకొస్తామన్నారు. వయోవద్ధులకు నాణ్యమైన వైద్యం కోసం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయించుకున్న ఆటో, టాక్సీ, ట్రక్ డ్రైవర్లు, ఓలా, ఊబర్ రైడర్లు వంటి వారికి లబ్ధి చేకూర్చడంతోపాటుగా అర్హత కలిగిన ప్రభుత్వ సంక్షేమ పథకాల అందజేస్తామని వివరించారు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల జీవన ప్రమాణాలను పెంచుతామన్నారు. రాజ్యాంగంలోని 44వ ఆర్టికల్ ప్రకారం దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతి (యునిఫామ్ సివిల్ కోడ్) అమలు చేస్తామన్నారు. జమిలీ ఎన్నికలను సాకారం చేసే దిశగా అడుగులేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఫాసిజం క్యాన్సర్ లాంటిది

- అన్యాయం స్థిర కాలం రాజ్యమేలదు
- మోడీ కూడా అంతే.. : కవి శివారెడ్డి
- జయప్రదంగా కవి గాయక సమూహగానం

అది భావానికి సంబంధించిన అంశం

- మూఢత్వంలోకి నడిపిస్తున్న శక్తుల్ని నిలవరించాలి : ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఫాసిజమనేది క్యాన్సర్‌లాంటిదనీ, అది క్రమంగా కొంచెం కొంచెంగా విస్తరిస్తుందని ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఒకటో దశ, రెండో దశ ఇలా దశలవారీగా ఉంటుందనీ, ఒక్కో సారి నాలుగో దశవరకు దాని ప్రభావం తెలీదని ఆయన చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత డాక్టర్ పసునూరి రవీందర్ అధ్యతన 'ప్రజాస్వామిక, లౌకిక, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కలం, గళం ఎత్తుదాం' అనే అంశంపై కవి గాయక సమూహగానం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వంద మందికిపైగా కవులు, రచయితలు, గాయకులు హాజరయ్యారు. ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు 12 సెషన్లుగా కార్యక్రమం నడిచింది. 'ప్రమాదంలో పడ్డ ప్రజాస్వామ్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ, విజృంభించే అవకాశమున్న మనువాదం, దానికి అత్యంత బాధితులుగా ఉన్న దళితులు, స్త్రీలు, మైనారిటీలు, ఆదివాసీలు, బీసీలు, సెక్యులరిజం-రాజ్యాంగ రక్షణ, మత సామరస్యం వంటి ఎన్నో అంశాలమీద కవితా గానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాస్వామిక, లౌకిక, రాజ్యాంగ విలువలను పరిరక్షించుకోవాలని ఆలోచించటమే ప్రస్తుత పరిస్థితుల్లో ఒక ప్రత్యేకతన్నారు. వాస్తవంగా రాజ్యాంగం, లౌకిక విలువలు, మనువాదం, ఫాసిజం తదితర మాటలు సృజనాత్మక సాహిత్యంలో అంతగా ఇమిడేవి కావన్నారు. కవిత్వం తన స్వభావం కాని అనేక విషయాల గురించి ఇప్పుడు మాట్లాడాల్సొస్తుందనీ, సృజించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఇప్పుడు ఫాసిజం, నియంతృత్వం గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని తెలిపారు.

ఫాసిజమనేది ఎక్కడో బయట ఉండదన్నారు. 'దాన్ని రాకుండా చేయాలి. దాన్ని ఖండించాలి. దాన్ని చంపాలి. తరిమేయాలి' అనే నినాదాలిస్తాం. కానీ..అదో దుర్మార్గమైన చట్టం కాదు, ఒక సంఘటన కాదని చెప్పారు. ఇది ఒక దుర్మార్గపు భావాజాలమనే విషయాన్ని అందరూ గుర్తించాలని సూచించారు.

దాన్ని ఎదుర్కోవటమెలా? అని ఆలోసించాలని కోరారు. అది డౌన్ డౌన్ అంటే పోయేది కాదని చెప్పారు. అదోక ప్రక్రియ అన్నారు. కొంచెం కొంచెంగా క్రమంగా వస్తుందన్నారు.

దీన్ని భావాజాల పరంగానే ఎదుర్కోవాలని సూచించారు. ప్రముఖ కవి శివారెడ్డి మాట్లాడుతూ అన్యాయం స్థిర కాలం రాజ్యమేలదన్నారు. అదే తరహాలో మోడీ కూడా ఎల్ల కాలం ఉండలేడన్నారు. పసునూరి రవీంద్ర మాట్లాడుతూ 'దేశం ఇప్పుడు చెరబడ్డ పక్షి' అనే శీర్షికతో కూడిన కవిత ద్వారా కవిగాయక సమూహగానాన్ని ప్రారంభించారు.అంటూ దేశంలో కొనసాగుతున్న దుర్మార్గాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. 400 సీట్లిస్తే..రాజ్యాంగాన్ని మారుస్తామంటే..మేం పాలకులనే మారుస్తామంటూ బాధితుల పక్షాన నిలబడాల్సిన సందర్భం వచ్చిందన్నారు. మనువాదం భరత మాత బట్టలిప్పేందుకు జాగ్రత్తగా కుట్ర చేస్తున్నదని హెచ్చరించారు. మూఢత్వం, మూర్ఖత్వంతో దేశాన్ని నడిపిస్తూ వెనక్కి తీసుకుపోతున్న నేటి తరుణంలో కవులు, రచయితలు సమూహ శక్తులుగా మారాల్సిన అవసర ముందని నొక్కి చెప్పారు.

> 'అహంకారం తలకెత్తుకున్నాక
> ఈ దేశం
> మా సొత్తు అనే పొగరు
> ఎవరి కాలును నేల మీద
> నిలవనీయడం లేదు
> చూస్తుండగానే దేశం
> మధ్యయుగం బాట పట్టింది'

ఎట్టకేలకు మెట్రో మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్!

- ఆరేండ్ల తర్వాత నాంపల్లిలో 'ఎంఎల్‌పీ' అందుబాటులోకి
- 2వేల గజాల్లో రూ.80కోట్లతో పీపీపీ విధానంలో ప్రాజెక్టు నిర్మాణం
- సుమారు 250 కార్లు, 20 టూవీలర్ పార్కింగ్‌కు అవకాశం
- కోవిడ్, ఇతర కారణాలతో నిర్మాణంలో జాప్యం.. పెరిగిన వ్యయం
- నెలరోజుల్లో ట్రయల్ రన్ నిర్వహించేలా అధికారుల కసరత్తు
- ఎంఎల్‌పీ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మెట్రో ఎండీ పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆటోమేటెడ్, కంప్యూటరైజ్డ్ మల్టీ లెవల్ కార్ పార్కింగ్ (ఎంఎల్‌పీ) పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. మెట్రో రైలు తొలినాళ్లలో అంటే దాదాపు ఆరేండ్ల క్రితం ఎంతో ప్రతిష్టాత్మకమైన మల్టీ లెవల్‌కార్ పార్కింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి సంబంధించిన భూమి పూజను అప్పటి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో కలిసి నిర్వహించిన విషయం తెలిసిందే.

హైదరాబాద్ నాంపల్లిలో సుమారు అర ఎకరం స్థలంలో పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో రూ.80 కోట్లతో ఎంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ 15 అంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తిచేశారు. మిగిలిన పనులను త్వరతగతిన పూర్తిచేసి.. నెల రోజుల్లో ట్రయల్ రన్ నిర్వహించేలా మెట్రో అధికారులు కసరత్తు చేస్తున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఎంఎల్‌పీకి సంబంధించిన పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మెట్రో ఎండీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఆధునిక పార్కింగ్ కాంప్లెక్స్ మన నగర కీర్తికిరీటంలో మరో కలికితురాయి కాగలదని అన్నారు. దేశంలో నూతన పార్కింగ్ విప్లవానికి ఈ ప్రాజెక్టు నాంది పలికిందని తెలిపారు. పీపీపీ విధానంలో రూ.80కోట్ల ప్రాజెక్టు నిర్మాణంతో దేశంలోనే ప్రప్రథమంగా జర్మన్ పాలిస్ పార్కింగ్ విధా నంలో.. తక్కువ స్థలంలో ఎక్కువ వాహనాలు పార్కింగ్ చేసేలా ఈ ప్రాజెక్టును చేపట్టినట్టు చెప్పారు. ఈ మల్టీ లెవల్ కార్ పార్కింగ్ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయని, ఒక నెలలోగా ట్రయల్ రన్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

హత్య చేసి.. ఆపై భయంతో..

- సెల్ టవర్ ఎక్కి యువకుని ఆత్మహత్య
- ఓ స్క్రాప్ దుకాణంలో ఇద్దరు కలిసి దొంగతనం..
- పంచుకునే దగ్గర మనస్పర్థలు.. గొంతు నులిమి హత్య..
- జోగిపేట పట్టణంలో ఘటన

నవతెలంగాణ-జోగిపేట

పట్టణంలో జులాయిగా తిరుగుతున్న ఓ యువకుడు 13 ఏండ్ల బాలుడితో కలిసి దొంగతనానికి పాల్పడ్డాడు. దోచుకున్న వస్తువులు పంచుకునే విషయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో బాలుడి గొంతు నులిమి హత్య చేశాడు. ఈ హత్యోదంతం బయటపడుతుందన్న భయంతో సెల్‌టవర్ ఎక్కి.. ఓ వైరుతో ఉరేసుకుని ఆ యువకుడు కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో ఆదివారం జరిగింది. జోగిపేట సీఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన వడ్డే నాగరాజు (24) జులాయిగా తిరుగుతుండేవాడు. పట్టణంలోని ఓ స్క్రాప్ దుకాణంలో శేఖర్(13) అనే బాలుడు పని చేస్తుండేవాడు. అయితే నాగరాజు, శేఖర్ కలిసి రెండ్రోజుల క్రితం శేఖర్ పనిచేస్తున్న స్క్రాప్ దుకాణంలోనే కేబుల్ వైర్‌ను దొంగతనం చేశారు. అయితే ఆ వైర్‌ను పంచుకునే విషయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దాంతో దుకాణంలో దొంగతనం జరిగినట్టు శేఖర్ తన యజమానికి చెప్పడంతో అతను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దొంగతనం విషయం బయటకు రావడంతో కోపోద్రిక్తుడైన నాగరాజు.. శేఖర్‌ను గొంతు నులిమి హత్య చేసి బావిలో పడేశాడు. అయితే ఈ హత్య విషయం కూడా బయటకు వస్తుందేమోనన్న భయంతో సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. కిందికి దింపేందుకు మరో ఇద్దరు యువకులు టవర్ ఎక్కువగా వారి పైన కూడా కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న జోగిపేట పోలీసులు అక్కడికి చేరుకొని కిందికి దింపే ప్రయత్నం చేశారు. కానీ ఆదివారం ఉదయం వరకు సెల్ టవర్ పైనే యువకుడు ఉన్నాడు. ఎంత ప్రయత్నించినా కిందికి దిగలేదు. 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు కుమారుడు బబ్లు వద్ద ఉన్న డ్రోన్ కెమెరాను సెల్ టవర్ పైకి పంపించారు. అక్కడి దృశ్యాలను పరిశీలించగా అతడు సెల్ టవర్ పైన ఆత్మహత్య చేసుకున్నట్టు కనిపించింది. సెల్ టవర్ పైన ఉన్న మృతదేహాన్ని తాడు సహాయంతో కిందకు దించారు. అలాగే, బావిలోని మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సహాయంతో సీఐ అనిల్ కుమార్ బయటకు తీయించారు. శేఖర్ తల్లి మొగులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా గతంలోనూ పట్టణంలోని ఓ చిరు వ్యాపారిని నాగరాజు డబ్బులు డిమాండ్ చేయగా ఇవ్వకపోవడంతో.. తలపై ఇనుపరాడుతో కొట్టి గాయపరిచినట్టు తెలిసింది.

మెదక్‌లో సీన్ మారేనా..!

(మొదటిపేజీ తరువాయి)

విజయశాంతి గెలిచారు. 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కేసీఆర్ మెదక్ పార్లమెంట్‌కు పోటీ చేసి గెలిచారు. కేసీఆర్ ఎంపీ పదవికి రాజీనామా చేయడంతో జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఎంపీగా కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలిచారు. 2019 ఎన్నికల్లోనూ కొత్త ప్రభాకర్‌రెడ్డి రెండో సారి ఎంపీ అయ్యారు. బీఆర్ఎస్ డబుల్ హ్యాట్రిక్ కోసం మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డిని పోటీకి దించింది. ఆయన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బాగా పరిచయాలున్న వ్యక్తి కావడం, ఆర్థిక వనరులు పుష్కలంగా ఉండటంతో ప్రచారంలో ముందున్నారు. కేసీఆర్, హరీశ్‌రావు స్వయంగా రంగంలోకి దిగి ప్రచారం చేస్తున్నారు. కానీ ఈ సారి కాంగ్రెస్ మెదక్‌లో ఖాతా తెరవాలని చూస్తోంది. మెదక్ పరిధిలో ఉన్న సంగారెడ్డి, పటాన్‌చెరు, మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కరే ఎమ్మెల్యే ఉన్నప్పటికీ అమలు చేసిన పథకాలపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ సామాజికత కూడా కలిసొస్తుందని భావిస్తోంది. రెండున్నర దశాబ్దాల నుంచి గెలవలేకపోయిన కాంగ్రెస్ ఈ సారి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కచ్చితంగా గెలిచి తీరాలన్నట్టు పనిచేస్తోంది. రేవంత్‌రెడ్డి తనదైన వ్యూహాలతో బీఆర్ఎస్, బీజేపీలను పక్కకు నెట్టి గెల్చుకుంటామని ధీమాలో ఉన్నారు. బీజేపీ కూడా పోటీ చేస్తున్నప్పటికీ బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ మధ్యే పోటీ జరగనుంది.

సీఎం వర్సెస్ మాజీ సీఎం

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభ్యర్థుల మధ్య పోటీ కంటే సీఎం రేవంత్‌రెడ్డి వర్సెస్ మాజీ సీఎం కేసీఆర్ అన్నట్టుగా కనిపిస్తోంది. వ్యూహ ప్రతివ్యూహాలతో రాటుదేలిన ఆ ఇద్దరూ మెదక్ సీటును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కేసీఆర్ సొంత ఇలాకైన మెదక్ పార్లమెంట్ స్థానాన్ని గెల్చుకునేందుకు గులాబీ దళపతి రంగంలోకి దిగారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఎన్నికల బాధ్యతలు అప్పజెప్పడమే కాకుండా తాను సైతం ఎన్నికల ప్రచారంలోకి వస్తున్నారు. ఈ నెల 16న అందరి కంటే ముందే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. అంచనాలకు మించి జనాలు సభకు హాజరుకావడంతో క్యాడర్‌లో జోష్‌ను పెంచేలా కేసీఆర్ ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శనాస్త్రాలు సంధించారు. లిల్లీపుట్‌గాళ్లంటూ హేళన చేశారు. కరెంట్ కోతలు, ఎండిన పంటలు, వడ్ల కొనుగోలు వంటి అంశాలను ఎన్నికల ఎజెండా చేయగలిగారు. మరో పక్క కేసీఆర్‌ను ఢీ కొనేలా సీఎం రేవంత్‌రెడ్డి సైతం మెదక్‌లో దూకుడు పెంచారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ కార్యక్రమానికి ఈ నెల 20న రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ర్యాలీ, సభలో పాల్గొని కేసీఆర్, హరీశ్‌రావు వైఫల్యాన్ని ఎండగట్టారు. మంత్రి కొండా సురేఖను నియోజకవర్గ ఇన్‌చార్జిగా పెట్టి మైనంపల్లి హనుమంతరావుకు సిద్దిపేట బాధ్యతలు అప్పజెప్పారు. కేసీఆర్, హరీశ్‌రావు ఎత్తులను చిత్తు చేసేలా పావులు కదుపుతున్నారు. మెదక్‌లో రేవంత్‌రెడ్డి కేసీఆర్ ఇద్దరూ అభ్యర్థుల కంటే ఎక్కువగా పట్టించుకోవడం విశేషం.

ఆరుగురు ఎమ్మెల్యేలు.. ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు

మెదక్ పరిధిలో ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుండటంతో బీఆర్ఎస్‌లో ధీమా కనిపిస్తోంది. ఎమ్మెల్యేల బలంతో పాటు ట్రబుల్ షూటర్‌గా పేరొందిన హరీశ్‌రావు, రాజకీయ చతురత కల్గిన కేసీఆర్ ఇద్దరిదీ మెదక్ పార్లమెంట్ సొంత ఇలాకా కావడంతో క్యాడర్‌లో జోష్ పెరిగింది.పైగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల కంటే బీఆర్ఎస్ అభ్యర్థులకే రెండు లక్షల ఓట్లు అధికంగా వచ్చాయి. అంటే రెండు లక్షల ఓట్ల అదనపు బలంగా బీఆర్ఎస్ భావిస్తుంది.

ఆరు గ్యారంటీలే కాంగ్రెస్ బలం

సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాటజీ, మంత్రుల ప్లానింగ్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఆరు గ్యారంటీలే కాంగ్రెస్‌కు బలంగా కనిపిస్తున్నాయి. ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, ఆరోగ్య శ్రీని రూ.10 లక్షలకు పెంచడం వంటి పథకాల ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ ఆశిస్తోంది. ఆగస్టు 15 లోపు రూ. రెండు లక్షల రుణమాఫీ, ఖరీఫ్ నుంచి బోనస్ అమలు చేస్తామన్న రేవంత్‌రెడ్డి ప్రకటన కూడా రైతాంగంలో సానుకూలత తెస్తుందని అనుకుంటున్నారు. కాగా, ముదిరాజ్ ఓట్లు అధికంగా ఉన్న మెదక్‌లో నీలం మధుకు కలిసొస్తుందో లేదో చూడాలి.

బస్సుయాత్ర షెడ్యూల్ మార్పు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల ప్రచార నిమిత్తం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించ తలపెట్టిన బస్సు యాత్ర షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ముందుగా అనుకున్న దానికంటే రెండు రోజులు ఆలస్యంగా ఈనెల 24 నుంచి యాత్ర ప్రారంభం కానుంది. మే 10 వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో భాగంగా కేసీఆర్ పలు జిల్లాల్లో రోడ్ షోలు, కార్నర్ మీటింగులు కూడా నిర్వహించనున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో 24న సాయంత్రం 5.30 గంటలకు ఆరంభమయ్యే ఈ యాత్ర... వచ్చేనెల 10న సాయంత్రం 6.30 గంటలకు సిద్దిపేటలో జరిగే బహిరంగ సభతో ముగియనుంది.

ఈ సందర్భంగా ముఖ్యంగా మూడు అంశాలపై బీఆర్ఎస్ అధినేత ఫోకస్ చేయనున్నారు. కేంద్రంలోని బీజేపీ పదేండ్లలో తెలంగాణకు చేసిందేమిటి..? ఇచ్చిందేమిటి..? అని ఆ పార్టీని ఎండగట్టటం, అసెంబ్లీ ఎన్నికల్లో హామీనిచ్చిన ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌ను నిలేయటం, తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామరక్ష అనే విషయాలను ఆయన విడమరిచి చెప్పనున్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఢిల్లీ నేతలు బాస్‌లు, కానీ బీఆర్ఎస్‌కు మాత్రం తెలంగాణ ప్రజలే నిజమైన బాస్‌లనే నినాదాన్ని ఆయన ఎత్తుకోనున్నారు. వీటితోపాటు రైతు బంధు, రైతు రుణమాఫీ, ఇటీవల కురిసిన అకాల వర్షాలు, పంట నష్టం, ప్రభుత్వం పరిహారం ఇవ్వకపోవటం, ప్రాజెక్టుల్లో నీళ్లున్నా వదలకపోవటం, కరువు పరిస్థితుల్లో ప్రభుత్వ ఉదాశీనత తదితర సమస్యలను ఆయన రోడ్ షోల ద్వారా ప్రజలకు ఏకరువు పెట్టనున్నారు. లోక్‌సభలో తెలంగాణ వాణి వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించాలంటూ కేసీఆర్ పిలుపునివ్వనున్నారు.

కేసీఆర్ రోడ్‌షోల వివరాలు...(24.04.24 నుంచి)

ఈనెల 24- సాయంత్రం 5.30 గంటలకు మిర్యాలగూడ

రాత్రి 7 గంటలకు సూర్యాపేటలో రోడ్ షో (రాత్రి బస)

25 -సాయంత్రం 6 గంటలకు భువనగిరి (రాత్రి బస ఎర్రవల్లిలో)

26-సాయంత్రం 6 గంటలకు మహబూబ్ నగర్ (రాత్రి బస)

27-సాయంత్రం 6 గంటలకు నాగర్ కర్నూల్ (హైదరాబాద్‌లో రాత్రి బస)

28-సాయంత్రం 6 గంటలకు వరంగల్ (రాత్రి బస)

29-సాయంత్రం 6 గంటలకు ఖమ్మం (రాత్రి బస)

30-సాయంత్రం 5.30 గంటలకు తల్లాడ

30-సాయంత్రం 6.30 గంటలకు కొత్తగూడెంలో రోడ్ షో (రాత్రి బస కొత్తగూడెంలో)

మే నెలలో

01.05.24-సాయంత్రం6 గంటలకు మహబూబాబాద్‌లో రోడ్ షో (వరంగల్‌లో రాత్రి బస)

02.05.24-సాయంత్రం 6 గంటలకు జమ్మికుంట (వీణవంకలో రాత్రి బస)

03.05.24-సాయంత్రం 6 గంటలకు రామగుండం (రామగుండంలో రాత్రి బస)

04.05.24-సాయంత్రం 6 గంటలకు మంచిర్యాల (కరీంనగర్‌లో రాత్రి బస)

05.05.24-సాయంత్రం 6 గంటలకు జగిత్యాల (జగిత్యాలలో రాత్రి బస)

06.05.24-సాయంత్రం 6 గంటలకు నిజామాబాద్ (నిజామాబాద్‌లో రాత్రి బస)

07.05.24-సాయంత్రం 5.30 గంటలకు కామారెడ్డి

07.05.24-రాత్రి 7 గంటలకు మెదక్ (మెదక్‌లో రాత్రి బస)

08.05.24-సాయంత్రం 5.30 గంటలకు నర్సాపూర్

08.05.24-రాత్రి 7 గంటలకు పటాన్ చెరువు (ఎర్రవెల్లిలో రాత్రి బస)

09.05.24-సాయంత్రం 6 గంటలకు కరీంనగర్ (కరీంనగర్‌లో రాత్రి బస)

10.05.24-సాయంత్రం 5 గంటలకు సిరిసిల్లలో రోడ్ షో

10.05.24-సాయంత్రం 6.30 గంటలకు సిద్దిపేటలో బహిరంగ సభ (హైదరాబాద్‌లో రాత్రి బస)

అసోంలో సిట్టింగ్ ఎంపీకి షాక్

- కోక్రాజార్ లోక్‌సభ అభ్యర్థి నబా సరానియా నామినేషన్ రద్దు

కోక్రాఝార్: అసోంలో ఒక సిట్టింగ్ ఎంపీకి ఎన్నికల అధికారుల నుంచి షాక్ తగిలింది. ఇప్పటికే రెండు సార్లు ఎంపీగా గెలిచి, హ్యాట్రిక్ విజయాన్ని లక్ష్యంగా పెట్టుకున్న కోక్రాఝర్ ఎంపీ నబ కుమార్ సరానియా నామినేషన్ పత్రాలను రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. సరనియా నామినేషన్ పత్రాలు చెల్లవని తేలిందని, అందుకే రద్దు చేశామని రిటర్నింగ్ అధికారి ప్రదీప్ కుమార్ ద్వివేది తెలిపారు. చివరి రోజైన ఏప్రిల్ 19వ తేదీ వరకు దాఖలైన 16 నామినేషన్లలో 15 చెల్లుబాటు అయినట్టు తేలిందనీ, తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు సిద్ధంగా ఉన్న అభ్యర్థులు సోమవారం మధ్యాహ్నం 3 గంటలలోపు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

షెడ్యూల్డ్ తెగకు రిజర్వ్ చేయబడిన కోక్రాజార్ నియోజకవర్గానికి మే 7న మూడో దశలో పోలింగ్ జరగనున్నది. ఈ సీటుకు సంబంధించి శనివారం జరగాల్సిన పరిశీలనను అధికార యంత్రాంగం వాయిదా వేసింది. కోక్రాఝర్‌తో పాటు గౌహతి, బార్‌పేట, ధుబ్రీలలోకు మే 7న పోలింగ్ జరగనున్నది. మిగిలిన మూడు స్థానాలకు శనివారం స్క్రూటినీ నిర్వహించగా, మొత్తం 37 నామినేషన్లు చెల్లుబాటైనట్టు తేలింది.2014 నుంచి ఇండిపెండెంట్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న గణ సురక్ష పార్టీ(జీఎస్పీ) అధినేత సరానియా.. తన ఎస్టీ (ప్లెయిన్స్) హోదాను స్టేట్ స్క్రూటినీ కమిటీ కొట్టివేయటాన్ని సవాలు చేస్తూ గౌహతి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, కోర్టు దానిని గురువారం కొట్టివేసింది. నవంబర్ 18, 1986న జారీ చేయబడిన ఆల్ అస్సాం గిరిజన సంఘం నుంచి సర్టిఫికెట్ సమర్పించటం ద్వారా ఎంపీ రావ కమ్యూనిటీ సభ్యునిగా నామినేషన్ దాఖలు చేశారు. "కమ్యూనిటీ ఫీల్డ్ 'బోరో' కొట్టివేయబడింది. 'రావ' ను జారీ చేసే అథారిటీ సంతకం లేకుండానే నమోదు చేయబడింది" అని ఒక అధికారి చెప్పారు. ఒక వ్యక్తి రెండు వేర్వేరు కమ్యూనిటీలకు చెందినవాడు కాడనీ, వేర్వేరు కమ్యూనిటీలకు చెందిన రెండు ఎస్టీ సర్టిఫికెట్లను కలిగి ఉండకూడదని తెలిపారు.

ఛత్తీస్‌గఢ్ మాజీ ఐఏఎస్ అధికారి అరెస్ట్

మనీలాండరింగ్ కేసులో..

రాయ్‌పూర్ : రూ. 200 కోట్ల లిక్కర్‌స్కామ్‌కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఛత్తీస్‌గఢ్‌కి చెందిన మాజీ ఐఏఎస్‌అధికారిని అరెస్ట్ చేసింది. మాజీ ఐఏఎస్ అధికారి అనిల్ తుతేజా, ఆయన కుమారుడు యష్ తుతేజాలను ఈడీ అదుపులోకి తీసుకున్నట్టు ఆదివారం సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫెడరల్ ఏజెన్సీ 2003 బ్యాచ్ అధికారిని శనివారం రాయ్‌పూర్‌లోని ఆర్థిక నేరాల విభాగం (ఈడబ్ల్యూఎస్) అవినీతి నిరోధక బ్యూరో కార్యాలయం (ఏసీబీ) నుంచి అదుపులోకి తీసుకుంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎమ్ఎల్ఏ) నిబంధనల ప్రకారం ఐఏఎస్ అధికారిని అదుపులోకి తీసుకున్నారని.. అతనిని రిమాండ్ కోరుతూ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలని భావిస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. ఆ అధికారి గతేడాది సర్వీసు నుంచి రిటైరయ్యారు. ఆయన చివరగా ఛత్తీస్‌గఢ్ పరిశ్రమలు, వాణిజ్య శాఖలో జాయింట్ సెక్రెటరీగా నియమించబడ్డారు. ఆదాయ పన్ను శాఖ ఫిర్యాదు ఆధారంగా గతంలో దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను సుప్రీంకోర్టు ఇటీవల రద్దు చేసిన సంగతి తెలిసిందే.

ఆకలి రాజ్యం

- 2015 నుంచీ ధరల మంట
- పేద, సామాన్య ప్రజల బాధలు వర్ణానాతీతం
- ఈ ఎన్నికల్లో బీజేపీ 3.0 కు ఎదురు దెబ్బే : సామాజికవేత్తలు, విశ్లేషకులు

న్యూఢిల్లీ : మోడీ పాలనలో ఆహార ద్రవ్యోల్బణం ఒక సమస్యగా మారింది. 2015 నుంచి ఇది మోడీ సర్కాను వేధిస్తున్నది. అంతేకాదు.. నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇటు సామాన్య ప్రజలూ కష్టాలను అనుభవిస్తూ వస్తున్నారు. ఈ ధరల పెరుగుదల ప్రభావం ఈ ఎన్నికల్లో కనబడుతుందనీ, మోడీ సర్కారుకు ఓటర్ల నుంచి ప్రతిఘటన ఎదురు కాక తప్పదని విశ్లేషకులు చెప్తున్నారు.

ఎన్నికలోస్తేనే గుమ్మం ముందు నేతలు వాలుతారు. అలాగే కడుపునిండిన వాడికి పేదవాడి కన్నా.. పెద్దోడి బాగోగులు.. అధికారం కోసమే పాకులాడటం కామన్‌గా మారిపోయింది. పదేండ్ల కాలంలో ధరలు మండు తుంటే.. ఇక్కడి జనం తినకపోయినా.. విదేశాల మెహర్బానీ కోసం ఇక్కడి ఆహార పదార్థాలను మోడీ సర్కార్ ఎగుమతి చేస్తోంది. పేద, సామాన్య ప్రజల బాధలు కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతాయన్నట్టుగా కేంద్రం వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ 3.0కు చుక్కలు చూపించడటం ఖాయమని ప్రజా సంఘాలు, సామాజిక వేత్తలు విశ్లేషిస్తున్నారు.

ఆదాయం అంతతైనా.. జేబులకు చిల్లులే..

దేశంలో ఆహార ద్రవ్యోల్బణం తగ్గినట్టు కనిపించటంలేదని అంటున్నారు. ధరల పెరుగుదల ప్రభావం కోట్లాది మంది భారతీయులకు కష్టమవుతున్నదని చెప్తున్నారు. ఆహార ద్రవ్యోల్బణం సామాన్య, మధ్యతరగతి ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నదని అంటున్నారు.

2014 ఎన్నికల తర్వాత మోడీ సర్కారు కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాతి ఏడాది నుంచే ఆహార ద్రవ్యోల్బణం మోడీ సర్కారుకు అతి పెద్ద సమస్యగా పరిణమించిది. బీజేపీ సర్కారు మొదటి సంవత్సరం దాల్ స్కామ్‌తో దెబ్బతిన్నది. దీని ఫలితంగా పప్పుధాన్యాల ధరలు కిలో రూ.200కి చేరుకున్నాయి. ప్రస్తుతం, ఈ ఏడాది ఫిబ్రవరిలో కూరగాయల ధరలు ప్రియం కావటంతో ఆహార ద్రవ్యోల్బణం 8.66 శాతానికి చేరుకున్నది. జనవరిలో కూరగాయలపై 30.25 శాతం ద్రవ్యోల్బణం నమోదైంది. ధరలు 27.03 శాతం పెరిగాయి. టమాటాలు కిలోకు రూ. 200, ఉల్లిపాయలు, గోధుమలు, పంచదార, ఇతర ఆహార పదార్థాలకు విపరీతమైన ధరలు చెల్లించి కొనాల్సిన దుస్థితి భారతీయులకు ఏర్పడిందని సామాన్య జనం మోడీ సర్కారుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనలేక..

భారతదేశంలో 2024 ఎన్నికలు సమీపించిన తరుణంలో.. 2022 చివరి నాటికి జాతీయ ఆహార భద్రతా చట్టం నుంచి అదనపు ఆహార రేషన్‌లను తొలగించిన తర్వాత, ప్రభుత్వం ఉచిత రేషన్ కార్యక్రమాన్ని బలవంతంగా నిర్వహించవలసి వచ్చిందనీ, 80 కోట్ల మంది భారతీయులకు ఆహారం అందించడం కొనసాగించిందని విశ్లేషకులు చెప్తున్నారు. నిటి ఆయోగ్ తన 2023 నివేదికలో 74.1 శాతం మంది భారతీయులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయటానికి కష్టపడుతున్నారని పేర్కొన్నది. ఈ గణాంకాలతో ఐక్యరాజ్యసమితి సైతం ఏకీభవించటం గమనార్హం.

2013 జులైలో గోధుమల ధరలు కిలోకు రూ. 16.10 ఉండగా, ఈ ఏడాది ఏప్రిల్ నాటికి రూ. 23.65కి ఎగబాకింది. గత రెండేండ్లుగా గోధుమల ధరలు ఎప్పుడూ లేనంతగా పెరిగాయి. అధిక ఎరువుల ధరలు, అస్థిర వాతావరణం, విధాన నిర్ణయాల లోపం కారణంగా ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని నిపుణులు అంటున్నారు.

పాలు.. వంట గది అవసరాలూ భారమే..

పాలు వంటి ఇతర వంటగది అవసరాలు కూడా గత సంవత్సరం రిటైల్ ధరలో 15 శాతం పెరుగుదలను నివేదించాయి. ఆ తర్వాత ఎడిబుల్ ఆయిల్ ద్రవ్యోల్బణం కూడా కనిపించింది. 2021లో ధరలు రూ. 80 నుంచి రూ.180కి పెరిగాయి. కూరగాయలు, ముఖ్యంగా టమాటాలు, పెట్రోలు కంటే ఖరీదైనవిగా మారటం సాధారణ భారతీయుల బాధలను మరింత తీవ్రం చేసిందని విశ్లేషకులు అంటున్నారు. వాతావరణ పరిస్థితులకు తోడు మోడీ సర్కారు తప్పుడు విధాన నిర్ణయాల కారణంగా ఉల్లి ధరలు కూడా చాలా అస్థిరంగా ఉన్నాయి. 2014 ఫిబ్రవరిలో నాసిక్ మండిలో కిలో ఉల్లి రూ. 45గా ఉండగా.. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి రూ.13.8కి పెరిగింది.

అధిక ఆహార ద్రవ్యోల్బణంతో పోషకాహార లోపం

అధిక ఆహార ద్రవ్యోల్బణం కారణంగా ఆకలి, మరింత పోషకాహార లోపం సమస్యలు తలెత్తుతాయని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. అధిక ద్రవ్యోల్బణం వచ్చే చిక్కులు ఇప్పటికే పేద, సాధారణ మధ్య తరగతి ప్రజలను పౌష్టికాహారానికి ఏమో కానీ.. కనీస ఆహారానికి కూడా దూరం చేస్తున్నదని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. ఇటు సరైన ధరలు లేకపోవటంతో రైతులు కూడా సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ధరల పెరుగుదల ప్రధానంగా పెద్ద వ్యాపారులు, స్టాకర్లు, అగ్రి-ప్రాసెసర్‌లకు ప్రయోజనం చేకూరుస్తాయనీ, ద్రవ్యోల్బణం దెబ్బకు వినియోగదారులు, పన్ను చెల్లింపుదారులు, రైతులు, చిన్న వ్యాపారులందరూ నష్టాన్ని, ఇబ్బందులను ఎదుర్కొంటారని నిపుణులు చెప్తున్నారు. భారత్‌లో ఆహార ద్రవ్యోల్బణం జాతీయ, ప్రపంచ సగటు కంటే మళ్లీ పెరుగుతున్నదనీ, దశాబ్దం పాటు అధికారంలో ఉన్న మోడీ సర్కారు మాత్రం దానిని నియంత్రించడంలో విఫలమైందని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ ఎన్నికల్లోనూ ఆహార ద్రవ్యోల్బణం సమస్య ఓట్ల రూపంలో ప్రతిబింబిస్తుందని సామాజికవేత్తలు అంటున్నారు.



వేసవిలో భారతీయులందరికీ నచ్చే పండు మామిడిపండ్లు. ఒక నివేదిక ప్రకారం, 2012 బేస్ ఇయర్ నుంచి 2023 వరకు మామిడి ధర సూచిక విలువ దాదాపు 116 శాతం పెరిగింది. నివేదిక 2013 ఆర్థిక సంవత్సరానికి గానూ ధర రూ.96గా ఉండగా..2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 216.1కి ఎగబాకింది. యాపిల్స్ ధరలు కూడా పెరిగాయి. యాపిల్ మార్కెట్లపై కార్పొరేట్ నియంత్రణకు వ్యతిరేకంగా రైతుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. యాపిల్ రైతులు హిమాచల్ ప్రదేశ్‌లో అదానీ స్టోర్‌లకు వ్యతిరేకంగా, రాష్ట్ర ప్రభుత్వ భవనాల వెలుపల కూడా నిరసనలు నిర్వహించారు.



నాడు పోరాడారు.. నేడు బరిలో నిలిచారు..

- కేరళలో మహమ్మారులపై శైలజా టీచర్ నిర్విరామ సేవలు
- లోక్‌సభ ఎన్నికల్లో ప్రత్యర్థులను మట్టికరిపించేందుకు సిద్ధం

– జె.జగదీష్, నవతెలంగాణ

కేరళను ఒక్కటిగా నిలబెట్టిన తన పరిపాలనా దక్షతతో నిపా, కరోనా వంటి మహమ్మారులను మట్టి కరిపించిన శైలజా టీచర్, వడకర లోక్‌సభ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. కరోనా చీకటి కాలంలో కేరళ మనుగడకు మార్గనిర్దేశం చేసినందుకు దేశం హృదయంలో నిలిచిన పేర్లలో కెకె శైలజ ఒకటి. పరిచయం అవసరం లేని మహిళా నాయకురాలు ఆమె. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన తొలి పినరయి విజయన్ ప్రభుత్వంలో ఆరోగ్య, సామాజిక న్యాయం, మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి కెకె శైలజ. మంత్రిగా ఉన్నప్పుడు నిపా, కొవిడ్ మహమ్మారిపై పోరాటంలో సైన్స్ ఉపాధ్యాయురాలిగా నైపుణ్యంతో ముందుకు సాగడం ఆమెను దేశానికే ప్రియమైన వ్యక్తిగా నిలిపింది. 2020లో వోగ్ మ్యాగజైన్ లీడర్ ఆఫ్ ది ఇయర్‌గా శైలజ గౌరవించబడింది. అదే ఏడాది రేడియో ఆసియాకు న్యూస్ యాంకర్‌గా మారారు. మెడికల్ యూనివర్శిటీ ఆఫ్ మోల్డోవా నుండి విజిటింగ్ ప్రొఫెసర్ హోదాతో సత్కారం పొందారు. దీనితో పాటు, ఐక్యరాజ్యసమితి సహా అనేక సంస్థల నుంచి ప్రతిష్టాత్మక గుర్తింపులు, అవార్డులను అందుకుంది. కోవిడ్ నివారణలో ఐక్యరాజ్యసమితి అవార్డ్, నిపా వైరస్ నివారణకు అంతర్జాతీయ గుర్తింపు, కొవిడ్ నివారణకు నీతి ఆయోగ్ ప్రశంసలు అందుకున్నారు. ఆమె నేతృత్వంలో ఆరోగ్య సూచీలో మొదటి స్థానం, వికలాంగుల సాధికారత కోసం జాతీయ అవార్డు కేరళ సాధించింది.

2021లో కేరళ అసెంబ్లీ చరిత్రలోనే అత్యధిక మెజారిటీని ఆమెకు ప్రజలు అందించారు. మట్టనూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 60,963 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రస్తుతం మట్టనూరు ఎమ్మెల్యేగా, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలుగా, ఐద్వా అఖిల భారత ఉపాధ్యక్షురాలుగా ఉన్నారు. విద్యార్థి, యువజన ఉద్యమాలతో ప్రజాక్షేత్రంలో క్రియాశీలకంగా మారారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా, మహిళా సంఘం కన్నూర్ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా, అఖిల భారత సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. స్త్రీశబ్దం పత్రికకు సంపాదకురాలిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. మట్టనూర్‌లోని పజాస్సిరాజా కళాశాల నుండి గ్రాడ్యుయేషన్, విశ్వేశ్వరయ్య కళాశాల నుండి బీఈడీ చేశారు. ఆమె శివపురం హైస్కూల్‌లో సైన్స్ టీచర్‌గా పనిచేసి, పూర్తికాలం రాజకీయాల్లో పని చేసేందుకు ఉద్యోగ విరమణ చేశారు.

1996లో తొలిసారిగా కూతుపరం నుంచి భారీ మెజారిటీతో శాసనసభలో విజయం సాధించారు. 2006లో పెరవూరు నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. 2016లో యూడీఎఫ్ నుంచి కూతుపరం నియోజకవర్గాన్ని తిరిగి కైవసం చేసుకున్నారు. ఆరోగ్యం - సామాజిక న్యాయం - మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రిగా పని చేశారు.

ఆమె 1956 నవంబర్ 20న ఇరిట్టి మటంకి చెందిన కె కుందన్, కెకె శాంత దంపతులకు జన్మించారు. మట్టనూర్ పజాస్సీలో నివాసం ఉంటారు. ఆమె భర్త కె భాస్కరన్, మట్టనూరు మున్సిపల్ కౌన్సిల్ మాజీ ఛైర్మెన్, సీపీఐ(ఎం) ఏరియా కమిటీ సభ్యుడు. ఇద్దరు పిల్లలు శోభిత్, లసిత్ ఉన్నారు.





రాష్ట్ర అవతరణను తప్పు పట్టిన
మోడీకి బుద్ధి చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

బానిసత్వానికి అడ్డంగా నిలబడి బాంచన్ దొర అనే నినాదానికి చరమగీతం పలికి, ఈ ప్రాంత ప్రజల విముక్తి కోసం పోరాటాలు నిర్వహించిన త్యాగమూర్తుల గడ్డ అని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలను బంధ విముక్తి చేసిన యోధులను స్మరించకుండా ఉండలేమన్నారు. కష్టాలు వచ్చినా నష్టాలు వచ్చినా పేదలకు అండగా ఉండి సొంత నిధులను ఖర్చు చేసిన కోమటిరెడ్డి బ్రదర్స్ మీకు అండగా ఉన్నారని తెలిపారు. ఒకవైపు నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో గుత్తా సుఖేందర్‌రెడ్డి, జానారెడ్డి ఉన్నారని, మరో వైపు భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డి ఉన్నారని, వారి మధ్య మెజార్టీ కోసం పోటీ ఉందన్నారు.

ఆగస్టు 15కి తప్పకుండా రుణమాఫీ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సాక్షిగా చెబుతున్నా.. ఆగస్టు 15 నాటికి రైతులకు రుణమాఫీ చేసి తీరుతామని సీఎం రేవంత్ భరోసా ఇచ్చారు. రైతులకు వచ్చే సీజన్‌లో ధాన్యానికి రూ.500ల బోనస్ ఇస్తానని హామీ ఇచ్చారు. యాదాద్రిని యాదగిరి గుట్టగా మారుస్తామని తెలిపారు. బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలు పూర్తి చేస్తామన్నారు. ఎస్ఎల్బీసీ, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తామని తెలిపారు.కడుపు చేత పట్టుకొని ఆటోలు నడిపిస్తున్న యువత గుట్ట పైకి రాకుండా ఆపేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. తాను స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కోరిక మేరకు వెంటనే ఆటోలు నడిపించేందుకు అనుమతులు ఇచ్చినట్టు చెప్పారు.

కమ్యూనిస్టులారా.. కలిసి మోడీని ఓడిద్దాం

ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం), సీపీఐతో కలిసి పోదామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెళ్లి కలిశారని, తమ మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ మోడీని గద్దె దించడానికి కలిసి కృషి చేయాలని కోరారు. తాను కమ్యూనిస్టులను ఏనాడూ అవమానించలేదని, అలాంటి సంఘటనలు లేవన్నారు. కమ్యూనిస్టులను తన అవసరాల మేరకు కడుపులో తలకాయ పెట్టి, వారి సహాయం తీసుకొని కరివేపాకు లాగా తీసిపారేసిన కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. తనతోపాటు ముఖ్యమంత్రి పదవికి అన్ని అర్హతలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఉన్నాయన్నారు. కేంద్ర కమిటీ తనకు ముఖ్యమంత్రి పదవి ప్రత్యేక పరిస్థితుల్లో కేటాయించిందన్నారు. సీఎం పదవిని తాను ఏనాడు గర్వంగా భావించలేదని, బాధ్యతతో నిర్వర్తిస్తున్నానని తెలిపారు. 18 గంటలు పని చేస్తూ పేదలకు అండగా ఉంటున్నానని తెలిపారు. ప్రగతి భవన్‌ను జ్యోతిరావు ఫూలే భవనంగా మార్చామన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను చెరబట్టి ఈ దేశంలో మోడీ విధ్వంసం సృష్టిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడాలంటే అందరమూ కలిసి పోరాడాలని కోరారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి ఓటు వేసినట్లేనని తెలిపారు. నోట్ల రద్దు, రైతులపై నల్ల చట్టాల వంటి అంశాల్లో.. కేసీఆర్ మోడీ దగ్గర ఈ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, సామెల్, మలిరెడ్డి రంగారెడ్డి, కొమ్మిడి ప్రతాపరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జైల్లో పెడితే బెదరం






(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ గైర్హాజరయ్యారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కేరళలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనాల్సి ఉందని, అందుకే ఈ ర్యాలీకి హాజరుకాలేకపోతున్నానని, తమ పార్టీ సంఘీభావం, పూర్తి మద్దతు ఉంటుందని హేమంత్ సోరెన్ భార్య కల్పన సోరెన్‌కు లేఖ రాశారు. దాన్ని ఆమె సభలో చదివి వినిపించారు.

బీజేపీ తుడిచిపెట్టుకుపోతుంది : ఖర్గే



వచ్చే ఎన్నికల్లో బీజేపీ తుడిచిపెట్టుకుపోతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. "మేము ప్రజలకు భయపడుతాము. ప్రధాని మోడీ లాంటి నాయకులకు కాదు. ఇద్దరు ముఖ్యమంత్రులను జైలులో పెట్టడం వల్ల మేం భయపడం. ఇండియా బ్లాక్‌తో విడిపోవడానికి నిరాకరించనందుకు హేమంత్ సోరెన్‌ను జైలుకు పంపించారు. వారు మమ్మల్ని ఇసుక కింద పాతిపెట్టినా, మేము పైకి వస్తూనే ఉంటాం. రామ మందిర శంకుస్థాపన, పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ముర్మును ఆహ్వానించకుండా ప్రధాని అవమానించారు. గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తే బీజేపీ తుడిచిపెట్టుకుపోతుంది. ఉపాధి, రైతుల ఆదాయంపై ప్రధాని మోడీ అబద్ధాలు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో మహాఘట్‌బంధన్‌కు ఓటు వేయండి. ఎవరికీ భయపడవద్దు. మోడీని ఎన్నికల్లో ఓడిపోనివ్వండి" అని అన్నారు.

నియంత పాలనకు చరమగీతం: జార్ఖండ్ సీఎం చంపై సోరెన్



నియంత పాలనకు చరమగీతం పాడాలని జార్ఖండ్ సీఎం చంపై సోరెన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఢిల్లీ, జార్ఖండ్‌లో ఏం జరిగిందో ప్రతి ఒక్కరికీ తెలిసిందేనన్నారు. ఈ ర్యాలీ ద్వారా కేంద్రంలోని నియంత వైఖరిని బహిర్గతం చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వాన్ని తొలి నుంచి అస్థిర పరిచేందుకు కేంద్రం ప్రయత్నించిందని ఆరోపించారు. ఆ క్రమంలో తుదకు హేమంత్‌ను జైలుకు పంపారన్నారు. ఢిల్లీ ప్రజలకు సైతం ఇదే తరహా అనుభవం ఎదురైందన్నారు.

ఇండియా బ్లాక్‌కు ఓటేసి దేశాన్ని రక్షించండి: ఫరూక్ అబ్దుల్లా




నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ర్యాలీలో మాట్లాడుతూ "ప్రతి రాష్ట్రానికి దాని స్వంత భాష ఉంటుంది. మనమందరం కలిసినప్పుడే భారతదేశం అవుతుంది. ఈ దేశ సౌందర్యం రంగులతో నిండి ఉంది. ఈ రంగులన్నింటినీ ఏకం చేసేందుకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారు. నేను ముస్లింని, అయినా గాంధీ, నెహ్రూ వంటి ఇండియా నాయకులను అంగీకరిస్తున్నాను. మీరు దేశాన్ని గౌరవించాలను కుంటే, ఎన్నికల సమయంలో ఇండియా ఫోరానికి ఓటు వేయండి. దీని ద్వారానే మనం దేశాన్ని రక్షించగలం" అని అన్నారు.

రాజ్యాంగాన్ని ఎవరూ మార్చలేరు: తేజస్వి



బీహార్ మాజీ డిప్యూటీ సీఎం, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ "బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని పదే పదే మార్చాలని మాట్లాడుతున్నారు. ఇది బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం, ఎవరో యాదృచ్ఛిక బాబా కాదు. దాన్ని మార్చే శక్తి ఎవరికీ లేదు. బీహార్‌లో కూడా రాజ్యాంగాన్ని మార్చుతామని వారి మంత్రులు, అభ్యర్థులు నిరంతరం చెబుతున్నారు. దేశ ప్రజలు వీరిని అంతమొందిస్తారు" అని విమర్శించారు.

బీజేపీ నిష్క్రమణ ఖాయం: అఖిలేశ్ యాదవ్




యూపీ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ ప్రధాని మోడీ హామీపై టార్గెట్ చేశారు. ఇంతకు ముందు ఇలాంటి వ్యక్తులు ఎన్నో ప్రకటనలు చేశారని అన్నారు. ఇప్పుడు గ్యారంటీతో వస్తున్నారు. అయితే దేశ ప్రజలు రాజ్యాంగం హామీని కోరుకుంటున్నారే తప్ప బీజేపీ హామీని కాదని అన్నారు. ఇక్కడ ప్రజలే నిర్ణయం తీసుకుంటే బీజేపీ నిష్క్రమణ ఖాయమని అన్నారు. "ఇది లార్డ్ బిర్సా ముండా భూమి. ఇక్కడి ప్రజలు ఎప్పుడూ భయపడలేదు. తలవంచలేదు. ఓటు వేయడానికి వెళ్లినప్పుడు మీ చరిత్రను గుర్తుంచుకోవాలి. వారు మీకు ఏమి చేశారో కూడా గుర్తుంచుకోవాలి. ఈసారి ఓటు వేయడానికి వెళ్లినప్పుడు 'జాగ్రత్తగా ఓటు వేయండి" అని పిలుపునిచ్చారు. ఎలక్టోరల్ బాండ్స్ బాగోతం అయిపోయిన బీజేపీ బండారం బయటపడిందని అన్నారు. అత్యధిక విరాళాలు సేకరించిన ప్రభుత్వం ఇదేనని, అందువల్ల నేడు దేశ రాజ్యాంగాన్ని రక్షించడం ముఖ్యమైనదని అన్నారు. మీరు సరైన నిర్ణయం తీసుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. 2014లో వచ్చిన వారు 2024లో వెళ్లిపోతారని అఖిలేష్ యాదవ్ అన్నారు. మన దేశాన్ని పదేండ్లలో వెనక్కి నెట్టడానికి కృషి చేసిన వారి వీడ్కోలు కూడా అంతే సందడిగా ఉండేలా అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

అధిక స్థాయిలో ద్రవ్యోల్బణం: ప్రియాంక చతుర్వేది



శివసేన నాయకురాలు ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ బీజేపీ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో అధిక స్థాయిలో ద్రవ్యోల్బణం ఉందని, అలాగే నిరుద్యోగం తాండవిస్తోందని చెప్పారు. మహిళలకు రక్షణ కల్పించే వాతావరణమే లేదన్నారు. దేశంలో చాలా మంది ఓటర్లు.. తొలి దశ పోలింగ్‌కు దూరంగా ఉన్నారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఓటర్లంతా బయటకు వచ్చి ఓట్లు వేస్తేనే.. కేంద్రంలోని అధికారాన్ని మార్చగలమన్నారు.

తప్పు చేశారని తేలకుండానే వారిని జైల్లో పెట్టారు: సునీతా కేజ్రీవాల్



ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌లను తప్పు చేశారని తేల్చకుండానే జైల్లో పెట్టడం నియంతృత్వాన్ని తలపిస్తోందని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ విమర్శించారు. మెరుగైన విద్య, వైద్య సౌకర్యాలు సమకూర్చడమే ఆయన చేసిన తప్పా అని ఆమె ప్రశ్నించారు. ఢిల్లీ ప్రజల కోసం కేజ్రీవాల్ తన జీవితాన్ని పణంగా పెట్టారని, ఐఐటీ గ్రాడ్యుయేటైన కేజ్రీవాల్ తలుచుకుంటే విదేశాలకు వెళ్లేవారని, కానీ ఆయన దేశభక్తికే మొగ్గుచూపారని చెప్పారు. తన భర్తను తీహార్ జైలులో అంతమొందించేందుకు కాషాయ పాలకులు కుట్ర పన్నారని విమర్శించారు. మధుమేహంతో బాధపడుతూ 12 ఏండ్ల నుంచి రోజూ ఇన్సులిన్ తీసుకుంటున్న కేజ్రీవాల్‌కు జైల్‌లో ఇన్సులిన్‌ను నిరాకరిస్తున్నారని ఆరోపించారు.

నేడు సీఎం పర్యటన

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మూడు పార్లమెంట్ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఉదయం11 గంటలకు ఆదిలాబాద్, మధ్యాహ్నం 1గంటలకు నిజామాబాద్, సాయంత్రం 4.15 గంటలకు మల్కాజిగిరి నియోజకవర్గ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగిస్తారు.

మాల్దీవ్‌లో కౌన్ బనేగా ప్రెసిడెంట్

- కొనసాగుతున్న పార్లమెంటు ఎన్నికలు
- మొయిజ్జుకు మద్దతు లభిస్తుందా.. లేదా..

హాట్ టాపిక్

మాలె : మాల్దీవుల్లో పార్లమెంటు ఎన్నికలు కొనసాగుతున్నాయి. మాల్దీవుల పార్లమెంట్ (మజ్లీస్)లో ఐదేండ్ల కాలానికి 93 మంది సభ్యులను ఎన్నుకునేందుకు సుమారు 2.8 లక్షల మంది ప్రజలు తమ ఓటు హక్కుని వినియోగించుకోనున్నారు. అయితే ఈ ఎన్నికలు అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు కాదు.. గతేడాది అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన మొయిజ్జు.. తన విధానాలను ముందుకు తీసుకువెళ్లేందుకు పార్లమెంట్ మద్దతు లభిస్తుందా లేదా అనేది తేలనుంది. మొయిజ్జు భారత వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారంటూ ప్రతిపక్షం ఆయనపై విరుచుకుపడుతోన్న సంగతి తెలిసిందే.

గతేడాది అత్యున్నత పదవికి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడు మొయిజ్జు అధికారంలోకి వచ్చారు. అయితే కూటమిలో భాగమైన ఆయన పార్టీ పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ 93 మందిసభ్యులు కలిగిన పార్లమెంటులో మైనారిటీగా ఉంది.అధ్యక్షుడు ఇబ్రహీం మొహమ్మద్ సోలీహ్ నేతృత్వంలోని మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ పార్లమెంటులో 41 మంది సభ్యులతో మెజారిటీలో కొనసాగుతోంది.

ఈ ఎన్నికల్లో భౌగోళిక రాజకీయాలు చాలా కీలక పాత్ర పోషిస్తున్నాయని మొయిజ్జు సీనియర్ సహాయకులు ఒకరు మీడియాతో పేర్కొన్నారు. భారత సైన్యాన్ని వెనక్కి పంపుతానని హామీ ఇచ్చి మొయిజ్జు అధికారంలోకి వచ్చారని, ఆయన ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అయితే పార్లమెంట్ సభ్యులు ఆయనకు సహకరించడం లేదని అన్నారు.

మాల్దీవుల ప్రజల తీర్పు మిశ్రమంగా ఉండవచ్చని జర్నలిస్ట్ అహ్మద్ ఐద్ పేర్కొన్నారు. ఏ పార్టీకి మెజారిటీ వచ్చే అవకాశం లేదని, గట్టి పోటీ ఉందని అన్నారు. బహుశా 50-50 ఉండే అవకాశం ఉందని అన్నారు. మొయిజ్జు పార్టీ పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ సహా అన్ని ప్రధాన రాజకీయ పార్టీల్లోనూ చీలికలు ఉండటంతో స్పష్టమైన మెజారిటీ పొందే అవకాశం లేదని అంచనావేశారు.

ఆగని ఇజ్రాయిల్ దాడులు ..

- ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో 14 మంది మృతి

వెస్ట్ బ్యాంక్ : ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ దళాలు విరుచుకుపడ్డాయి. శనివారం జరిపిన దాడిలో 14 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు పాలస్తీనా అధికారులు తెలిపారు. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఇజ్రాయిల్ దళాల దాడిలో గాయపడిన పాలస్తీనియన్లను తరలించేందుకు వెళ్లిన ఓ అంబులెన్స్ డ్రైవర్ కూడా మరణించినట్లు పేర్కొన్నారు. పాలస్తీనా నగరమైన తుల్కర్మ్‌కు సమీపంలో ఉన్న నూర్ షామ్స్ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ దళాలు దాడిని ప్రారంభించాయని, శనివారం వరకు కాల్పులు జరుపుతూనే ఉన్నాయని అన్నారు.

నేను మళ్ళీ రాయాలి

అవును, నేను మళ్ళీ రాయాలి
భ్రమయుగాలు బద్దలయ్యేలా రాయాలి
అవినీతిమయమైన వ్యవస్థపై ఉమ్మేస్తూ రాయాలి
నాలోని మనిషిని కాపాడుకోవడం కోసం రాయాలి
ఆశల అలలలో కొట్టుకుపోతున్న వాడిని
అక్షరాల తీరం చేర్చడానికైనా రాయాలి
మనుషుల్లో మనుషులను వెతుక్కోవడం కోసం రాయాలి
దేశభక్తి, దైవ భక్తుల వికట్ట ప్రదర్శనలపై రాయాలి
విశ్వవిఖ్యాత రాజకీయ నటసార్వభౌముల
ప్రతిభాపాటవాలను
నలుగురికి తెలపడం కోసమైనా రాయాలి.
పనులెన్ని ఉన్నా రాత్రికి కొంచెం మెలకువ ఇచ్చి తీరాలి
యుగాల చీకటిని తరిమేసేందుకైనా మళ్ళీ రాయాలి.
నేర్చుకుంటూ రాయాలి
రాస్తూనే నేర్చుకోవాలి నేను మళ్ళీ రాయాలి
చెమట చుక్కల కోసం రాయాలి
రక్తమోడుతున్న అన్నం మెతుకుల కోసం రాయాలి
దిక్కులేకుండా పోతున్న హక్కుల కోసం రాయాలి
ప్రభుత్వ కార్యాలయాల్లో జలగల గురించి రాయాలి
ప్రజాస్వామ్య గుర్రాన్ని గడీల్లో కట్టేసుకుంటున్న దొరల
చరిత్ర రాయాలి.
ఇంకా మిగిలి ఉన్న మానవత్వం గురించి రాయాలి
నిస్వార్థంగా నినదిస్తున్న గొంతుల గురించి రాయాలి!
ముగింపు లేని వాక్యాన్ని కొనసాగించాలి
గడ్డ కట్టిన నదిని పెకిలించాలి
ఇక ఒకటే కల రాస్తూనే బతకాలి రాస్తూనే చావాలి!

- కాసుల రవికుమార్, 9908311580

తర్జుమా తరంగిణి

బాగ్దాద్ నగరాన్ని ఎలా పోల్చుకుంటారు?



బాగ్దాద్ నగరాన్ని ఎలా పోల్చుకుంటారు ఎవరైనా?
అక్కడి ఎత్తైన గంభీరమైన తమాల వృక్షాల ద్వారా.
దర్జీ పారేసే పేలికలలాగా నా శరీరం, ఆత్మ
చిరిగిపోయి అటూయిటూ పడిపోయాయి
ఆ చింపిరి గుడ్డల్ని తొడుక్కుని తిరుగుతాన్నేను,
పర్యటించే ఫకీర్ల మధ్య కలిసిపోయి.
అత్యున్నతుడవైన ఓ నా ఆధ్యాత్మిక బోధకుడా, అని పాడుతూ
యాచిస్తాను బాగ్దాద్‌లోని ఇరుకు వీధుల్లో

పంజాబీ మూలం: సుల్తాన్ బహు
ఆంగ్లానువాదం: తసీర్ గుజ్రాల్, సకూన్ సింగ్
తెలుగు సేత: ఎలనాగ

దీపశిఖరాగ్రహం

తప్పుడు ఆధ్యాత్మికత బూడిదవుతున్నపుడు
కాలిపోయినవన్నీ
వెచ్చని కన్నీళ్ళలా ఉప్పగానే ఉంటాయి
వసంత వాత్సల్యంలో రుతువు అద్దిన
సౌందర్యమే పూల కలాపి చిమ్ముతుంది
కలమీది ప్రేమతో నిదుర తీసిన దొంగ కునుకే
పలవరింతకు పాఠం చెపుతుంది



కరిగిన భక్తి గుండె రోదన
అర్ఘ్యం వదిలిన మంత్రంలానే
నీటి కొలిమై సలుపుతుంది
కరకు ధ్యానపు మాట స్పర్శకు
శాపమై మండినపుడు కూడా
దీపశిఖమాటు చీకటిని
తెలుసుకోలేం కదా
ధూమ విలాసం
హోమ సలాపం
మమ సమర్పణే కదా
గాయమయేంతదాకా లావా ద్రవం
మేఘ పర్వతమేనని గ్రహించలేం కదా
ఎంత గరుకుగా ఉన్నా
సహజీవనం తప్పని జీవితం
ఎంత మెతకగా ఉన్నా
ఎడబాటు తప్పని సాంగత్యం
గంధకంతో ఘర్షించే జలతర్పణ
వత్తినై ధ్యానించే దైవం విగ్రహం
విదిల్చిన శిలాశకలాలు
భయమై బాధై మూఢమై విశ్వాసమై
దీవించే బూది విభూది చిటికెడు చిటికెలో!

- ప్రసేన్

అనల్పశిల్ప సౌరభం 'అనల్పం'

మంచి కవి పాఠకుల కోసం వెంపర్లాడడు. పాఠకులే మంచి కవిత్వాన్ని వెతుక్కొంటూ వెళతారు. రాయడం ఒక అలవాటుగా ఉన్న కవికి తన గురించి తనకొక అంచనా ఉండటమే కాదు తన పాఠకులు ఎవరో కూడా బాగా తెలిసిన వాడై ఉంటాడు. రఘు శేషభట్టార్ మనకాలపు మంచి కవి. "పలుచటి నీటి అలల కింద ఈదుతున్న చేపల్ని చూసినట్లు లోకాన్ని" చూస్తాడు

ఈపాటికే తన మాట చేత, మన్నన చేత, ప్రతిభావంతమైన కవిత్వరీతి చేత, అనల్పశిల్పకల్పనారీతి చేత తనదైన స్వీయముద్ర వేసుకొన్న శుద్ధకవి రఘు శేషభట్టార్. సప్త కవితాసంకలనాల తరువాత అష్టమకలిగా 'అనల్పం' తీసుకొని వచ్చాడు.

కవి తన గురించి తాను చెప్పుకోవడం ప్రాచీన కాలం నుండి చూస్తున్నాం. సంప్రదాయ కవిత్వ వాతావరణం నుండి వచ్చిన పాఠకులు కావ్యావతారికలలో, ఆశ్వాసాంత పద్యగద్యాలలో కవి హృదయావిష్కరణ జరిగిన తీరుతెన్నులు గమనించిన వారే. రఘు "వస్తువొక నెపం మాత్రమే" అంటూ అవతారికలాంటి మనోగతం తొలిపుటల్లోనే అనూదితం చేశాడు. నెపం వెనుక దాగిన కవి శిల్పాభిరుచి అర్థం చేసుకోలేకపోయిన కొంతమంది తొందరపడి రఘుది వస్తురహిత కవిత్వంగా తాము భ్రమసి, అనవసరంగా పాఠకుల్ని కూడా భ్రమింపజేయడం ఒక వైచిత్రి. నిస్సందేహంగా రఘుశేషభట్టార్ శిల్పవ్యామోహి. టెక్నిక్ లేని కవిత్వాన్ని తాను ఊహించలేను అన్నాడు ఆరుద్ర. జీవితాంతం శిల్పరహస్య అన్వేషణలో సాగిన శేషేంద్ర రఘు సిరల్లో అలలెత్తే జీవాత్మ ఆ తోవలోని వాడే కాదు ఆ కోవలోని వాడు కవి రఘు. కవిత్వం వస్తుసంవిధానాల సమ్మిశ్రభావాభివ్యక్తి. రఘు సహజంగా సంవిధానం వైపు ఎక్కువ మొగ్గు చూపుతాడు. అంటే దానర్థం వస్తువును త్రోసిరాజని కవిత్వం రాస్తాడని కాదు. 'అనల్పం'తో సహా రఘు ప్రతి సంపుటిలో వస్తువు అనేక వన్నెలుపోయింది.

"అనుకొంటాం-/ లోకంలో చిలుకలకు లేదా పావురాళ్లకు మాత్రమే/ పెంపుడు పక్షులయ్యే యోగ్యత ఉందని/ వాటికి మాత్రమే/ మనిషి భుజం మీద హక్కపత్రాలేవో ఉన్నాయని/ ఒక పండుముక్కో/ మక్కిన బియ్యం దొప్పో దర్పంగా విసిరి/ తలిమ్మా పక్షుల్ని వాకిలి నుండి తరిమేస్తాం"


'అనల్పం' సంకలనంలోని తొలి కవిత ఇది. "ఒక కోకిలను పెంచాలని ఉంది" అనే ఆత్మీయ శీర్షికతో కవి మనుషులు పక్షుల పట్ల చూపే వివక్ష గురించి రాసాడని వాచ్యంగా అనిపిస్తుంది. కాని పక్షలు మీద నెపం మోపి తరతరాలుగా సమాజంలో జాతిపేరిట, మతం పేరిట సాగుతున్న దుర్మార్గవివక్షతను రఘు సూచ్యంగా ఇందులో అభివర్ణించాడు.

"గోడెక్కి ఆశగా తొంగిచూసే కాకులు, పిట్టలు/ ఒట్టి బడుగు పక్షులు/ ఎవరో ఒకరు కనికరించక పోరని ఎదురుచూస్తాయ్" అంటూ బడుగుజీవన నేపథ్యాన్ని గుర్తుకుతెచ్చాడు. పహరి గోడ సరిహద్దు దాటి లోనికి ప్రవేశం నిషిద్ధం. అక్కడే నిల్చొని తొంగిచూసే కాకులు, పిట్టల సాకుతో సామాజిక వివక్షను కవిత్వవంతంగా చెప్పడం రఘు ప్రత్యేకత.

"నా బారసాలకు యాభై ఏళ్ళొచ్చాయని/ మా పండుముసలి మేనత్త నవ్వులా మెరుస్తున్న/ ఆ వెండిగ్లాసు చెప్పింది"

తామరకొలను వంటి వంటింటిలో అనుకోకుండా కంటబడిన వెండిగ్లాసు మెరుపులో అర్ధశతాబ్దం నాటి తన బారసాల ఆత్మీయదృశ్యాన్ని ఊహించాడు రఘు. ఇక్కడ వెండిగ్లాసు ఒక నెపం మాత్రం ఆ మెరుపుల్లోని ప్రతిఫలనం తన మేనత్త నవ్వు. వస్తువు నెపం కావడం అంటే దాని చుట్టు అగోచరంగా తిరిగే ప్రతిఫలనాలను వైపు దృష్టి సారించడమే గానీ వస్తువుని అర్థాంతరపు అడవిలో వదిలివేయడం కాదు. మానవసంబంధాల పట్ల రఘుకు మమకారం ఎక్కువ. చివరికి పిల్లనిచ్చిన ఊరును సైతం ఈ బంధగంధంగానే తన ఆలోచనలకు అలుముకొంటాడు రఘు శేషభట్టార్.

వస్తువుతో కవికి ఆత్మీయభావం లేకపోతే అతని కవిత్వం పఠితహృదయస్పందనగా రూపొందదు. కవిత్వరచనలో వస్తువు శిల్పం వేరు వేరు కావు. ఒకే నాణానికి బొమ్మాబొరుసు. కవిత్వంలో వస్తువు ఒక నెపంగా కవి దాని ప్రతిఫలనాలను కవితలో ఎలా మలిచాడో మచ్చుకు పై కవితలు ఒక అచ్చుతునకలు.



- షుకూర్
9491088529


సమాజాన్ని చూసే దృక్కోణం ఒక్కొక్క కవికి ఒక్కొక్క రకంగా ఉంటుంది. మన కళ్ళతోనే ప్రపంచాన్ని చూడాలనుకోవడం కవి స్వేచ్ఛను హరించడమే. ఏ విమర్శకుడైనా కవి రచనోద్దేశ్యాన్ని తెలుసుకోవాలంటే మునుముందు ఆ కవి దృక్పథాన్ని పరిశీలించక తప్పదు. అన్ని రచనలకు ఒకే తూనిక పనికి రాదు, విమర్శకునికి కొంత పూనిక కూడా అవసరం. ప్రయాణంలో ఉబుసుపోక చదివే వ్యాపారాత్మక ఊకరచనల్లా కాదు రఘు కవిత్వం. రఘును కాస్త తీరిగ్గా, నింపాదిగా సమయం తీసుకొని చదవాల్సి అవసరం ఉంటుంది.

"రవిబింబంబుపమింప బాత్తమగుఛత్రంబై..." పద్యంలో సూర్యుడు వివిధ దశల్లో ఎలా కనిపించాడో వర్ణించాడు పోతన. వస్తువు ఒకటే అయినా చూసే చూపును బట్టి భిన్నంగా కనిపిస్తుంది. 'అనల్పం'లోని వస్తువైవిధ్యం కూడా భిన్నంగా కనిపించడానికి రఘు వస్తువును చూసే దర్శనంలోని దృక్కోణమే కారణం. రఘుని మిగతా కవుల నుంచే వేరుగ చూపించేది కూడా ఇదే. అనల్పంలో మిగతా కవితల కంటే విడిగా కనిపించేది 'యుద్ధనౌక' అనే కవిత. ఇది కవి ఇజ్రాయిల్ సమర్థిస్తూ రాసిన రాజకీయ కవిత. లోకమంతా పాలస్తీనా వైపు నుండి నినదిస్తుంటే ఈ కవి మాత్రం

"మీరు బోస్నియాలు, చెచన్యాలు/ గాజాల గురించి మాట్లాడతారు/ నేను ఐసెస్లైలు, అల్ ఖైదాలు/ పందుల గురించి మాట్లాడతాను..." అని నిర్మొహమాటంగా ప్రకటించాడు. ఇజ్రాయేల్ విషయంలో పత్రికలలో వచ్చిన ప్రధాని ప్రకటనకు స్పందనగా రఘు ఈ కవిత రాసినట్లుంది. ప్రధాని అంతర్జాతీయ విషయాలలో ఆచితూచి మాట్లాడటం విన్నాం. రఘుది లిఖితాభిప్రాయం మాటలాగా మార్చుకోవడం కుదరని పని. రఘు రాజకీయాల జోలికి సహజంగా పోడు అలాగని రఘు రాజకీయాతీడు కాడు. అతనికి తనవైనా రాజకీయాలు ఉన్నాయని కొన్ని కవితలు చెప్పకనే చెబుతాయి. అందులో ఈ కవిత ఒకటి. దశాబ్దాల పాలస్తీనా సమస్యను చరిత్ర లోతులలోకి వెళ్ళి చూస్తే గానీ అసలు వాస్తవాలు తెలియవు. ఈ విషయంలో దోషి 'శ్వేతభవనం' దాని ఆయుధవ్యాపారంలో భాగంగా అనేక యుద్ధోన్మాద నాటకాలకు అది తెర లేపిన విషయం ప్రపంచానికి తెలుసు. ఇజ్రాయిల్ దాని కీలుబొమ్మ అంతే. ఏమైనా పానకంలో పుడకలాంటి ఈ కవితను కాలానికి వదిలేయడమే మంచిది. ఎప్పటికైనా నిజాలు నిగ్గుదేలక మానవు కదా. రసామృతసముద్రం లాంటి రఘు కవిత్వంలో ఓలలాడుతూ ఒడ్డుకు కొటుకువచ్చిన మతశేషాల వైపు దృష్టి సారించడం అనవసరం. ఇది సహృదయ లక్షణం కూడా కాదు.

మంచి కవిత్వం కోసం ఎదురుతెన్నులు కాచే సహృదయపాఠకులు ఎప్పుడూ ఉన్నారు. 'అనల్పం' అలాంటి చాతక హృదయాల దాహార్తి తీర్చే వెన్నెల జలపాతం.

"రవిబింబంబుపమింప బాత్తమగుఛత్రంబై..." పద్యంలో సూర్యుడు వివిధ దశల్లో ఎలా కనిపించాడో వర్ణించాడు పోతన. వస్తువు ఒకటే అయినా చూసే చూపును బట్టి భిన్నంగా కనిపిస్తుంది. 'అనల్పం'లోని వస్తువైవిధ్యం కూడా భిన్నంగా కనిపించడానికి రఘు వస్తువును చూసే దర్శనంలోని దృక్కోణమే కారణం. రఘుని మిగతా కవుల నుంచే వేరుగ చూపించేది కూడా ఇదే. అనల్పంలో మిగతా కవితల కంటే విడిగా కనిపించేది 'యుద్ధనౌక' అనే కవిత.



అచ్చంగా ఐదు పుస్తకాల ఆవిష్కరణ

అచ్చంగా ఐదు పుస్తకాల ఆవిష్కరణ సభ ఈ నెల 27వ తేదీ హైదరాబాద్ కొత్తపేటలోని స్పైసీహబ్ హోటల్లో జరుగుతుంది. నాలుగు సెషన్లుగా జరిగే ఈ సభలో 'చిత్రకళా తపస్వి డా॥కొండపల్లి శేషగిరిరావుకి జీవన్ గాథా' హిందీ అనువాద గ్రంథం ఆవిష్కరణ, డా॥కొండపల్లి నీహారిణి 'అనివార్యం' పుస్తకావిష్కరణ, మయూఖ అంతర్జాల పత్రిక కథా సంకలనాలు 'కథా మయూఖం, బాలకథా మయూఖం' ఆవిష్కరణ, 'ధూళిపాల అరుణ కథా సంపుటి 'మిగిలేవి గురుతులే' ఆవిష్కరణ వుంటుంది.

డా॥కొండపల్లి నీహారిణి

రాష్ట్ర స్థాయి సదస్సు - సమూహ

ఈ నెల 28న వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం సెనేట్ హాల్లో లౌకిక విలువలు - సాహిత్యం అన్న అంశంపై తెలంగాణ రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుంది. ఈ సభలో యాకుబ్, లోచన్, నందిని సిధారెడ్డి, రూపారుక్మిణి, మెట్టు రవీందర్, గుంటూరు లక్ష్మీ నరసయ్య, జిలుకర శ్రీనివాస్, యస్. మల్లారెడ్డి, పసునూరి రవీందర్, సౌదారుణ, కాత్యాయనీ విద్మహే, సిద్దంకి యాదగిరి, నరేష్ కుమార్ సూఫీ, మెర్సీ మార్గరెట్... తదితరులు పాల్గొంటారు.

'కరోనా' సాహిత్యం

'తెలుగు సాహిత్యంలో కరోనా కల్లోలం' అనే అంశంపై పరిశోధన చేస్తున్నాను. 'కరోనా' విషమ కాలాన్ని రికార్డు పరిచి భవిష్యత్ తరాలకు అందించేందుకు కరోనాపై వివిధ పత్రికలలో వచ్చిన కథ/ కవిత/ నవల/ వ్యాసం, ప్రత్యేక సంపుటాలు, సంకలనాలు తదితర వివరాలను 9247475975 వాట్సాప్ నెంబరుకు తెలియ చేయవలసిందిగా సాహితీ వేత్తలనందర్నీ కోరుతున్నాను. - చలపాక ప్రకాష్

బాల సాహిత్య సమ్మేళనం 2024

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మే 29,30 తేదీల్లో హైదరాబాద్లో బాల సాహిత్య సమ్మేళనం జరుగుతుంది. ఇందులో పాఠశాలస్థాయిలో తెలుగు భాషా వికాసం, బడి పిల్లల్లో రచనాభిరుచి పెంపొందించడం, పత్రికల్లో బాలల రచనలకు ప్రచురణావకాశాలు, కథలు చెప్పడంలో మెలకువలు, సంగీతం, నత్యం, నాటకం, చిత్రలేఖనం, శిల్పం వంటి లలితకళల పైన ప్రాథమిక అవగాహన మొదలైన సదస్సులు, గోష్ఠులు జరుగుతాయి. ఇందులో పాల్గొన దలచిన రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పాఠశాల విద్యార్థులు, తెలుగు ఉపాధ్యాయులు, బాల సాహితీవేత్తలు పాల్గొనదలిచేవారు ఈ నెల 30 వ తేదీలోగా 9603727234 వాట్సాప్ నెంబర్‌కు వివరాలు పంపి పేర్లు నమోదు చేసుకోవాలి.

కవిత్వ విమర్శకు ఊహల వేదిక



తాటికొండాల నర్సింహారావు
9885787250

ప్రస్తుతం సాహిత్యం మూడు రచనలు, ఆరు ఆవిష్కరణలతో దినదిన ప్రవర్ధమానమవుతూ రాశుల కొద్దీ సృష్టించబడుతున్నది. అందువలన నాణ్యమైన సాహిత్యాన్ని సమాజానికి అందించవలసిన అవసరం వున్నది. కవిత్వాన్ని లేదా మరో ప్రక్రియను విమర్శించే, సమీక్షించే వ్యక్తి సహృదయుడై, నిష్పక్షపాతిగా, రాగద్వేషాలకు అతీతుడయి వుండాలి. అలాంటి సహృదయ సమీక్షకులలో విమర్శకులలో డా॥ ఏనుగు నరసింహారెడ్డి అగ్రాసనాధి పత్యం స్వీకరించగలిగిన వ్యక్తి.

కవిత్వాన్ని కథను కాకపోతే మరో ప్రక్రియను సమీక్షించే విమర్శించే వ్యక్తి తాము ఒక్కొక్కరు ఒక్కో దృక్పథం కలిగి వుంటారు. వారు ఒక్క రకంగా వస్తువు, శిల్పం, ప్రయోగం మొదలైన వాటికి అనుగుణమైన దృక్కోణంతో ఆవిష్కరిస్తారు.

డా॥ ఏనుగు నరసింహారెడ్డి స్వతహాగా కవులు, విమర్శకులు, రచయిత కూడా కావడం వల్ల వారి విమర్శ/ కవిత్వం సమాజానికి ఒక దిశానిర్దేశం చేయగలదు.

ఎవరయినా ఒక విషయాన్ని చెప్పడానికి ఒక వేదిక కావాలి. ఏనుగు నరసింహారెడ్డి తన అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి 'ఊహలనే' వేదికగా చేసుకున్నారు. అది ఊహల వేదిక పుస్తకంగా వెలువడింది.

ఊహల వేదికలో గత రెండు దశాబ్దాలలో వచ్చిన వివిధ వ్యాస సంకలనాలలోని కవి దృక్కోణంలో నుంచి చూసి అరవై రెండు మంది కవుల కవిత్వ బాగోగులను తనదైన శైలిలో పాఠకుల ముందుంచారు. వానిలో వివిధ ప్రక్రియలకు సంబంధించిన వ్యాసాలున్నాయి.

మయూఖ అంతర్జాల ద్వైమాసిక, కెనడా వేదిక సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ కవితల పోటీలలో ఎంపిక చేయబడిన కవితా సంకలనాన్ని సమీక్షిస్తూ నరసింహారెడ్డి ఒక మాట చెప్పారు... "కవిత్వమంటే దేన్నీ ధిక్కరించడం కాదు, దేన్నీ ఆలింగనం చేసుకోవడం కాదు. బాధ్యతాయుతమైన జీవనం. హేతువు ఆధారమైన జీవనం. సత్యాన్వేషణం కూడా. ఈ సమాజపు గమనానికి ఇరుసేమిటని కవి ఆలోచిస్తాడు. దాని గమనంలోని అసంబద్ధతకు మూలం ఏమిటని శోధిస్తాడు. దాని ఫలితాలను తనదైన పద్ధతిలో ప్రకటిస్తాడు".



ఆయన చెప్పిన ఈ మాటలను గమనిస్తే కవిత్వం అంటే ఏమిటి? కవిత్వం ఎందుకు రాయాలి? కవిత్వం ప్రయోజనం ఏమిటి? కవి రాసిన కవిత్వాన్ని పాఠకుడు ఎలా అర్థం చేసుకోవాలి? అనే దృక్కోణంతో ఆ కవితా సంకలనంలోని కవితలను చదివారు.

"గొప్ప ప్రయోజనమున్న కవిత గొప్ప శిల్పంతో అలరారితే బంగారమునకు తావి అబ్బినట్లే" అన్న పింగళి లక్ష్మీకాంతం గారి అభిప్రాయానికి కూడా ఈ కవితలను ఉదాహరించారు. ఒక దగ్ధజీవితాన్ని **"సిగరెట్ కాల్చి రెండు వేళ్లమధ్యలో బతుకును ఇరికించి నోట్లో పెట్టి నిప్పంటించుకునే వాడు/ కాలిన బ్రతుకును కాలి కిందేసి నలిపి కాలరెగరేసి/ కదిలిపోతుందేవాడు"** ఈ మాటలలో ఒక జీవితాన్ని అపరూపంగా చిత్రీకరించారు అన్న వ్యాఖ్యానం చాలా బావుంది.

ఈ పుస్తకంలో శతక కవుల సాహిత్యాన్ని కూడా పరిశీలించారు. ఈ నాటి కవులలో శతకాలు రాస్తున్న కవులు తక్కువమందే వుంటారు. సమాజ గమనాన్ని నిరసిస్తూ, వ్యాఖ్యానిస్తూ చాలామంది శతకాలు రాశారు. కానీ రెడ్డి గారు వ్యాఖ్యానించిన శతకం కుంతీపుత్రుడైన కర్ణుని జీవిత చరిత్రను. శతకంగా రాయడం గొప్ప విషయం. శతక రచయిత ఎండెల నరసింహులు. అందులోని ఒక పద్యం కర్ణుని గురించి కృష్ణుడు చెప్పిన విషయం చాలా అందమైనదని రెడ్డిగారు అన్నారు కానీ అది వాస్తవ జీవిత చిత్రణ అని నేనంటాను. కర్ణుడి జీవితం మొత్తం ఈ కంద పద్యపాదాలలో నిక్షిప్తం చేశారు శతకకర్త నరసింహులు.

సురపతిచే విప్రునిచే/ ధరచే పృథచేత మద్రధరణీపతిచే/ నరుచేతను, హరుచేతను/ గరుచేతను, వంచితడవు కుంతీపుత్రా!

దీనికి మూలమైన పద్యంలో కర్ణుని చావుకు కారణాలుగా కృష్ణుడు, అర్జునుడు, కుంతి, పరశు రాముడు, భూమి, శల్యుడు, ఇంద్రుడు... ఈ ఆరుగురు చెప్పబడ్డారు. కాని ఈ పద్యంలో 'హరుచేతను' అని ఇంకో వ్యక్తిని కూడా చేర్చారు. పైగా వారిచేత వంచించబడ్డారు అన్నారు. కాని భారతంలో ఈ ఆరుగురూ స్పష్టంగా నీవు మరణిస్తావు అన్నారు. కాని ఏ విధంగానూ మోసం చేయలేదనుకుంటా. ఇది కొంచెం ఆలోచించవలసిన విషయం.

ప్రస్తుతం వస్తున్న లఘు ప్రక్రియలలో నూతన ప్రక్రియ 'ముక్తకం'ను సమగ్ర స్వతంత్ర భావ వ్యక్తీకరణకు లోటు లేకుండా సృష్టించిన కవి నూతక్కి రాఘవేంద్రరావు. ఈ ముక్తకం పదహారక్షరాల పద్యం. మొదటి రెండు పాదాలలో పదహారక్షరాలుంటే చివరన ఒక మకుటం లాంటిది ముక్తాయింపు చేస్తారు. **"ప్లాస్టిక్ చైర్ల కూర్చుండ బోతి/ కుర్చీ వెనక్కి జరిగె/ గంతనే మూడు చక్రాల బండి/"** ఒకటి రెండు లైన్లలో తను కుర్చీలో కూర్చోవడానికి ఉద్యుక్తుడైతే రెండవ వాటిలో కుర్చీ వెనక్కు జరుగుతుంటుంది. ఫలితమేమిటి? తను కిందపడిపోయి మూడు చక్రాల బండి పాలుకావడం. ఇంత చిన్న కవిత్వంలో ఒక సంఘటన పూర్తిగా వ్యక్తీకరించబడింది. అదే దీని ప్రత్యేకత.

నక్క హరికృష్ణ కవిత్వం 'అవిరామం' అందులోని ఒక కవిత చాలా హృద్యంగా వుంటుంది. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులలో హరికృష్ణగారొకరు. రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఆనందంతో రాసిన ఒక కవితలో కింది పంక్తులు...

ఇది పాల్కురికి పాదపీఠిక/ పోతన సేద్య భూమిక/ విశ్వంభరుడి నాట్యవేదిక/ ఇది తెలివాహ సొబగుల/ వైతాళికుల భూమి

ఈ పద్యం చదివిన తర్వాత హరికృష్ణ కవిత్వం మరీమరీ చదవాలనిపిస్తుంది.

సాధారణంగా ఒక రచయిత ఒక కథ రాస్తే తక్కువలో తక్కువ నిడివి ఒక పేజీ. ఒక కార్డు పట్టేంత వుంటుంది. వీటిని మినీ కథలు అంటున్నారు. ఒకప్పుడు కుందుర్తి వచనంలో కావ్యం, నాటకం మొదలైన అన్నిటినీ రాసి ఖ్యాతి గడించినవారు. ఆయన ప్రేరణతో ఒక అవార్డు కూడా ఇస్తున్నారు. ప్రస్తుతం కె.ప్రభాకర్ కూడా అలాంటి ఒరవడి సాగిస్తూ కేవలం పదహారు లైన్లలో కథ చెప్పారు. వీటిని కథాకవితలు అనవచ్చు అంటారు నరసింహారెడ్డి.

ఒక కథ 'అతడిపేరు ధర్మయ్య'. ధర్మయ్య బిచ్చగాడు. శోషవచ్చి ఒక చెట్టు పక్కన పడిపోవడంతో అతని చేతిలోని డొక్కు డబ్బాలోని గుక్కెడు నీళ్ల అతడు మరణించాక దొర్లి చెట్టుపై పడతాయి. ఎండి చనిపోయిన చెట్టు ఆ నీళ్లతో జీవం పోసుకుంటుంది. మరసటి రోజు ఆ మొక్క కొసన వికసించిన పువ్వు చిరునవ్వుతో అందంట 'అతని పేరు ధర్మయ్య' అని. ఎంత చక్కగా భావ వ్యక్తీకరించేడు ప్రభాకర్.

శ్రీశ్రీలోని లయాత్మక శబ్దాన్ని అందుకున్న కవి. ఆ బాటలో రాసిన కవిత. శ్రీశ్రీ కన్నా చక్కగా రాశాడనిపిస్తుంది.

"కష్టాల కడలిని/ ఇష్టాల కూడలిని/ కన్నీటి కడవను/ పన్నీటి పడవను/ చెరగని నవ్వును/ చెదరని మువ్వను/ తలపులమైనాను/ వలపులసోనాను/ పచ్చని చానను/ వెచ్చని దానను" - సంసార నౌక.

ఇంకా ఈ వ్యాస పరంపరలో రెబ్బ మల్లికార్జున్, మువ్వా శ్రీనివాసరావు మొదలైన వారి కవిత్వాన్ని గురించి విస్తృతమైన విశ్లేషణ వున్నది. వీరే కాక లబ్ధ ప్రతిష్ఠులయిన సినారె, జాషువా, ఆత్రేయ మొదలైన వారి కవితలపైనా వ్యాఖ్యానం కూడా వున్నది. ప్రస్తుతం నూతనంగా కవిత్వ వ్యవసాయం చేస్తున్న వారి రచనల మీద కూడా సాధికారికమయిన విశ్లేషణలు వున్నాయి. అవన్నీ చదివి అవగాహన చేసుకోవాలి, ఈ షణ్మాత్రంగా చెప్పడం కుదరదు.

కవి విమర్శకుడు, వ్యాఖ్యాత, సమర్వయకర్త ఈ అన్ని భూమికలు నిర్వహిస్తున్న నరసింహారెడ్డిగారు మరిన్ని విమర్శనా గ్రంథాలు వెలువరించాలని ఆశిద్దాం.

ఏడుపు ఓ దిగదుడుపు

విసురు గాలికి కిటికీ రెక్కలు
టపటపా కొట్టుకున్నట్టు
దూషణా దుమారానికి రెండు సూర్య గోళాలను
అల్లార్చుకుంటున్న రెప్పలు
నీళ్ళు నిండిన కళ్ళు తేట పడేది ఎప్పుడో...
దృశ్యపు మసకలు ఎంతటి వ్యథో కదా



సంద్రంలో కెరటాలు రయ్యినవచ్చి వెనక్కు వెళ్లినట్టు
దుఃఖం కట్టలు తెంచుకొని తగ్గుతూ పెరుగుతూ ఓ తచ్చాట

శోకపు కొలను లోంచి ఎర్రటి కలువ రెక్కలేవో
రాలిపడుతున్నాయి చూస్తున్నావా
బాధప్త మనస్సాంగత్యంలో
ఎన్ని కన్నీటి సాగర మథనాలో
గరళం దాచుకున్న హృదయ తలపులు
నిజంగా ఓ త్రినేత్ర క్షేత్రం

మది చుట్టూ నాఖాగ్రాలతో నిరంతర గాట్లు
అప్రతిగత పోరాటంలో ఎన్నో గాయాల సమాహారపు
విజయకేతన దుందుభి

వేల వేల నిట్టూర్పుల మధ్య అనంత తత్వగీతాల ప్రతిధ్వనులు
దేహమంతా సమస్యల వలయంలో
సుఖ దుఃఖాల ఉత్కంఠ ఎంతకూ వీడదు
కానీ... కానీ జీర గొంతుతో సుదీర్ఘ ఏడుపు
నిలువెత్తు బాధా బ్రతుక్కు ఓ దిగదుడుపే..!

- డా॥కటుకోఝ్వల రమేష్, 9949083327

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
సోమవారం | ఏప్రిల్ 22, 2024 | www.navatelangana.com

ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం



మొక్కజొన్న, వరి పంటలకు నష్టం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది.ఉదయం నుంచి ఎండతీవ్రంగా అధికంగా ఉండి సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఈదురు గాలులు, వడగళ్ల వర్షం కురిసింది. అక్కడక్కడా చెట్లు విరిగి విద్యుత్తు తీగలపై పడ్డాయి, కొన్ని గ్రామాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. ఇప్పటికే వ్యవసాయ పంటలు చాలా వరకు చేతికొచ్చాయి. అక్కడక్కడా కల్లాల్లో మొక్కజొన్న పంట ఉంది. ఈ ఏడాది మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వ్యాపారులు సమయానికి రాకపోవడంతో కల్లాల్లోనే మొక్కజొన్న అరబెట్టారు. వరిపంట కూడా చాలా వరకు చేతికొచ్చింది. చేతికొచ్చిన పంట అకాల వర్షానికి దెబ్బతిన్నడంతో రైతన్నలు తీవ్ర వేదనకు గురవుతున్నారు.



ప్రవేశ పరీక్షకు 73 మంది గైర్హాజర్

నవతెలంగాణ-కల్లూరు

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 73 మంది గైరాజరయ్యారు అయ్యారని ప్రిన్సిపాల్ కె.శ్రీలత తెలిపారు. ఆదివారం స్థానిక గురుకుల పాఠశాలలో నిర్వహించిన పరీక్షకు 481మంది దరఖాస్తు చేసుకోగా 408 మంది ప్రేక్షకు హాజరయ్యారు.

'కాటమయ్య'గుడి సాక్షిగా ఇరువర్గాల బాహాబాహీ



నవతెలంగాణ - బోనకల్

శ్రీ కంఠమహేశ్వర దేవాలయంలో నిర్మాణంలో భాగంగా కులస్తులతో పాటు పనిచేస్తున్న సిపిఐ నాయకులపై పాత కక్షలను అదునుగా భావించి ఆధిపత్యం కోసం కాంగ్రెస్ మాజీ సర్పంచ్ భర్త మంద వెంకటేశ్వర్లు (చిన్నబ్బాయి)లతోపాటు అదే గ్రామానికి చెందిన కొంతమంది చిన్నబ్బాయి అరాచకవాదులు ఆదివారం ఒక్కసారిగా దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం జరిగింది. ఈ ఘర్షణలో సిపిఐ నాయకులు బుర్రి నాగేశ్వరరావు, గుడిద నాగేశ్వర రావు, వంగాల నరేంద్రలకు గాయాల య్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

మండల పరిధిలోని మోటమర్రి గ్రామంలో గౌడ సామాజిక కుల దైవం (కాటమయ్య గుడి) శ్రీ కంఠమహేశ్వర దేవాలయం నిర్మాణ పనులు ఆగిపోయాయి. గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు మంద కృష్ణయ్య ఆధ్వర్యంలో కొద్దిరోజుల క్రితం గ్రామానికి చెందిన గౌడ సంఘం యువత దేవాలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కుల పెద్దలను సంప్రదించారు. దీంతో ఈ నెల 15వ తేదీన మంద కృష్ణయ్య ఆధ్వర్యంలో మూడుసార్లు గ్రామంలో చాటింపు వేయించాడు. ఈ సమావేశానికి గ్రామంలోని సుమారు 250 కుటుంబాలు ఉండగా కాంగ్రెస్ నాయకుడు మంద వెంకటేశ్వర్ల వర్గానికి చెందిన సుమారు 20 కుటుంబాలు హాజరు కాలేదు. మెజార్టీ కుటుంబాలు హాజరు కావడంతో గత కొంతకాలంగా గౌడ యువత ఆధ్వర్యంలో వేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నెల 28వ తేదీన గుడి ప్రారంభించాలని కుల పెద్దలు నిర్ణయించారు. అందులో భాగంగానే ఆదివారం కూడా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంద వెంకటేశ్వర్లు తన వర్గానికి చెందిన వారిని తీసుకొని గుడి వద్దకు వెళ్లాడు. తనను తన ఇంటికి వచ్చి వ్యక్తిగతంగా పిలవకుండా, నాకు తెలియకుండా గుడి నిర్మాణ పనులు జరగటానికి వీలు లేదంటూ అక్కడే పనులు చేస్తున్న వారితో ఘర్షణకు దిగారు. గుడి వద్ద రెండు వర్గాలు కుర్చీలతో బాహాబాహికి దిగి కొట్టుకున్నారు. ఈ ఘర్షణలో గుడిది నాగేశ్వరరావు, వంగాల నరేంద్ర, బుర్రి నాగేశ్వరరావు తదితరులకు స్వల్ప గాయాలయ్యాయి. అయితే గతంలో సిపిఐ నాయకులతో ఉన్న రాజకీయ కక్షల నేపథ్యంలో కాంగ్రెస్‌కు చెందిన మంద వెంకటేశ్వర్లు పథకం ప్రకారమే తన అనుచర వర్గంతో అక్కడకు వెళ్లాడని సిపిఐ నాయకులు చెబుతున్నారు. ఈ విషయం తెలిసి కుల పెద్దలు పెద్ద ఎత్తున గుడి వద్దకు చేరుకొని ఇరువర్గాలను నిలువరించారు. రెండు వర్గాలు పెద్ద ఎత్తున దాడులకు దిగాయని గ్రామస్తుల సమాచారంతో బోనకల్ ఎస్సై కడగండ్ల మధుబాబు హుటాహుటిన మోటమర్రి వెళ్లారు. రెండు వర్గాలను అక్కడ నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. తాత్కాలికంగా నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆదేశించారు. రెండు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. రెండు వర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. గాయాలపాలై బోనకల్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతున్న గుడిది నాగేశ్వరరావు, వంగాల నరేంద్ర, బుర్రి నాగేశ్వరరావులను సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, తూము రోషన్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు తదితరులు పరామర్శించారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

- ఉపాధ్యాయ రంగ సమస్యలపై ముఖ్యమంత్రి తక్షణం స్పందించాలి
- ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి
- టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య



నవతెలంగాణ - బోనకల్

అక్టోబర్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను ఈ విద్యా సంవత్సరం పాఠశాల చివరి పని దినం ఏప్రిల్ 23వ తేదీన రిలీవ్ చేయాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే.జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బదిలీలు నిర్వహించి రిలీవ్ చేయకపోవడం వల్ల బదిలీలు చేసి ఉపయోగం ఏముందని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వద్దనే ఉన్నందువలన ఉపాధ్యాయ సమస్యలను తక్షణం పరిష్కారం చేయాలని కోరారు. మధ్యంతరంగా నిలిచిపోయిన పదోన్నతుల, బదిలీల కౌన్సిలింగ్‌ను వెంటనే ప్రారంభించి వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని, టెట్ ఉత్తీర్ణత కావడానికి ఐదు సంవత్సరాల కాల పరిమితి విధించి పదోన్నతులు పూర్తి చేయాలని తద్వారా హైస్కూల్లలో సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించవచ్చని ప్రభుత్వానికి సూచించారు. టెట్ ఉత్తీర్ణత మార్కులను 35 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పండిట్స్, పీఈటీల అప్ గ్రేడ్ పోస్టులను పాఠశాలల వారీగా విభజించి పదోన్నతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లుల న్నింటినీ వెంటనే క్లియర్ చేయాలని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం పెండింగ్ డిఏలను విడుదల చేయాలని, మెరుగైన ఫిట్మెంట్‌తో పిఆర్సి అమలు చేయాలని, అన్ని ఆసుపత్రులలో చెల్లుబాటు అయ్యే విధంగా ఆరోగ్య కార్డులను అమలు చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో కుటుంబ సంక్షేమ నిధి పథకం కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు రంజాన్, సుధాకర్, ఉద్దండ్, శ్రీనివాసరెడ్డి, గుగులోతు రామకృష్ణ, వినోదరావు, వీరయ్య, సీనియర్ నాయకులు ఆంజనేయులు, కెసి వెంకటేశ్వర్లు, మీరాఖాన్, హనుమంతరావు, సర్వర్ బాబు, లక్ష్మి, జరీనా, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైరా రిజర్వాయర్‌కు సాగర్ జలాలు విడుదల చేయాలి



సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న మంచి నీరు కలర్ మారి దుర్వాసనతో కూడి వస్తున్నాయని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో కలుషితమైన నీరు మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ గత పది రోజులుగా వైరా మున్సిపాలిటీ, మండల పరిధిలో కలర్ మారి దుర్వాసనతో కూడిన మంచి నీరు సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. వైరా రిజర్వాయర్ నుంచి 12 మండలాల ప్రజలకు మంచి నీరు సరఫరా అవుతున్నదని, వైరా రిజర్వాయర్ నీటి మట్టం 7 అడుగులకు పడిపోయినా ప్రభుత్వం సాగర్ జలాలు విడుదల చేయలేదని అన్నారు. మే నెలకు మరింతగా నీటి మట్టం తక్కువ అయి మిషన్ భగీరథ మంచినీరు సరఫరా జరగడం సాధ్యం కాదని, ప్రజల ఆరోగ్యాన్ని రక్షించేందుకు పరిశుభ్రమైన మంచి నీరు సరఫరా చేయాలంటే వైరా రిజర్వాయర్‌కు సాగర్ జలాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, నాయకులు తూము సుధాకర్, సంక్రాంతి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ డైవర్షన్ రాజకీయాలు

- సమస్యల నుంచి ప్రజలను పక్కదోవ పట్టించే చర్యలు
- గడికొక అంశం ముందుకు.. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్
- 24న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నామినేషన్
- బీఆర్ఎస్ నేత శ్రీను నాయక్ హత్యను ఖండిస్తున్నాం
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ, మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రజలను సమస్యల నుంచి పక్కదోవ పట్టించే చర్యల్లో భాగంగా కాంగ్రెస్ డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. 24వ తేదీ ఉదయం 10:30 గంటలకు నామ నాగేశ్వరరావు బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తారని తెలిపారు. రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్‌తో కలిసి ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో హత్యారాజకీయాలు జరిగివుంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదా? అంటూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు శ్రీనునాయక్ హత్యను ఖండించారు. ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు ప్రచారానికి అనూహ్య స్పందన వస్తోందన్నారు. 24వ తేదీ ఉదయం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నానని నామ తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక గడువు పెంచుకుంటూ పోతోందన్నారు. కుంగిందనే పేరుతో మేడిగడ్డ నీరునంతా బయటకు పంపి...ముందుచూపు లేకుండా చేసిన పనులవల్లే ఈ రోజు నీటి కరువు వచ్చిందన్నారు. ఇదీ కాంగ్రెస్ చేతగాని తనం వల్ల వచ్చిన కరువుగా పేర్కొన్నారు. 17వ లోక్‌సభలో కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ఏడుగురి కన్నా పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు తెలంగాణ సమస్యలపై ఎక్కువగా పోరాడారని అన్నారు. మరోమారు అవకాశం కల్పిస్తే తెలంగాణ గొంతుకనవుతానని నామ స్పష్టం చేశారు. ఎకరానికి రూ.25వేల పంటనష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 29, 30 తేదీల్లో మాజీ సీఎం కేసీఆర్ ఖమ్మం, కొత్తగూడెం జిల్లా కేంద్రాల్లో రోడ్ షోలకు హాజరవుతారని నామ తెలిపారు.

వ్యక్తిత్వ హననం సరికాదు: మాజీ మంత్రి పువ్వాడ

ఫోన్ ట్యాపింగ్, హత్యారాజకీయాలు పేరుతో వ్యక్తిత్వ హననం సరికాదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ఓట్లు అడగడానికి మొఖం లేక డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. ముగ్గురు మంత్రులకు వాళ్లలో వాళ్లకు ఏమైనా సమస్యలు ఉన్నాయేమో..! అందుకే హత్య కుట్ర అంశాన్ని ముందుకు తెస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో సుఫారీ ఇచ్చే సంస్కృతి ఉందా? అని ప్రశ్నించారు. తనపై చేస్తున్న ఆరోపణలు నిరూపించాలని చాలెంజ్ చేశారు. నీళ్లు, కరెంట్, రైతుబంధు, రుణమాఫీ, కౌలురైతులకు సహాయం, ధాన్యం కొనుగోళ్లపై బోనస్, నిరుద్యోగ భృతి ఇవేవీ ఇవ్వలేక, పథకాల అమలు, అభివృద్ధిపై వస్తున్న ప్రజా వ్యతిరేకతను డైవర్షన్ చేసేందుకే కాంగ్రెస్ హత్యా వ్యవహారాలను ముందుకు తెస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితులు తిరగబడి... నామకు ఆదరణ వస్తుండటంతోనే ఇలాంటి డైవర్షన్ రాజకీయాలను తెరమీదకు తెస్తున్నారన్నారు.

సంక్షేమ రాష్ట్రం సంక్షోభంలోకి..: ఎంపీ రవిచంద్ర

బీఆర్ఎస్ పాలనలో సంక్షేమంగా ఉన్న రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టారని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. నామ కృషి ఫలితంగానే గిరిజన యూనివర్శిటీ, జాతీయ రహదారులు, రైల్వేలైన్‌ల వంటివి ఉమ్మడి జిల్లాకు వచ్చాయన్నారు. కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఇచ్చిన అలిగాని హామీలను నమ్మి ప్రజలు మోసపోయారన్నారు.

కేసీఆర్ పాలనలో శాంతిభద్రతల పరిరక్షణ: ఎమ్మెల్సీ తాతా మధు

కేసీఆర్ పాలనలో శాంతిభద్రతలకు ఏనాడూ విఘాతం కలగలేదని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ అన్నారు. ముగ్గురు మంత్రులున్న కాంగ్రెస్ ఈ మూడు నెలల్లో చేసిందేమిటంటే బీసీ బిడ్డ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంను దించడం, పాలేరును ఎండబెట్టడం, నగరానికి తాగునీరిచ్చే దాన్వాయిగూడెం ఫిల్టర్ బెడ్‌లో నీరు లేకుండా చేయడం, భక్త రామదాసు ప్రాజెక్టు పరిధిలోని చెరువులను అడుగంటించడం..వంటి పనులు చేసిందన్నారు. ప్రజా సమస్యల నుంచి డైవర్షన్ చేసేందుకే మేడిగడ్డ, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలను ముందుకు తెచ్చిందన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే సీఎం తిట్ల దండకం అందుకుంటారని ఎద్దేవా చేశారు. నామ ప్రచారానికి అనూహ్య స్పందన వస్తుంటే...కాంగ్రెస్ అభ్యర్థిని తేల్చుకోలేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోందని వ్యాఖ్యానించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల పార్టీ అధ్యక్షులు వీరయ్య, బోడ వీరన్న, నాయకులు డోకుపర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తదాతలే ప్రాణదాతలు

- రక్తదాన శిబిరంలో ప్రముఖ వైద్యులు గిరిసింహారావు
- వ్యాధిపై అవగాహనకు నెల రోజుల పాటు కార్యక్రమాలు
- సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి పి.రవిచంద్ర



నవతెలంగాణ- ఖమ్మం

వేసవిలో రక్తం లేక తలసేమియా చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ తరుణంలో రక్తదాతలు వారికి ప్రాణదాతలుగా మారుతున్నారని ప్రముఖ వైద్యులు గిరిసింహారావు అన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మంలోని తలసేమియా డేకేర్ సెంటర్(రితన్య ఆసుపత్రి)లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వైద్యులు గిరిసింహారావు, డి.నారాయణమూర్తిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసేమియా చిన్నారులను రక్షించేందుకు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు చేస్తున్న కృషి ఎనలేనిదని అన్నారు. ప్రతి రోజు పది మందికి పైగా చిన్నారులకు అవసరమైన రక్త సేకరణ కోసం సంస్థ బాధ్యులు పడుతున్న ఇబ్బందులను చూస్తున్నామని, దాతలు స్పందిస్తే ఈ వేసవిలో చిన్నారులను కాపాడినవారవుతారని అన్నారు. సంస్థ కోశాధికారి పి.రవిచందర్ మాట్లాడుతూ మే 8 ప్రపంచ తలసేమియా దినోత్సవంను పురస్కరించుకొని తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నెల రోజుల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా రక్తదాన శిబిరాలు, ఉచిత మందుల పంపిణీ, తలసేమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి తలసేమియా చిన్నారులందరికీ ఐరన్, హెచ్ఎల్‌పి పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. వ్యాధిని నిర్మూలించేందుకు అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు చిన్నారులకు సేవా కార్యక్రమాలను ఈ ఏడాది మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. ఎండల వలన చిన్నారులకు రక్తం దొరకడం లేదని, కోరిన వెంటనే ముందుకువచ్చి రక్తదానం చేస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, బాధ్యులు పి.ఉదయ్ భాస్కర్, పి.అనిత, ఎన్.ఉపేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బోర్ వేశారు..కనెక్షన్ మరిచారు

- మంచినీళ్ల కోసం రోడ్డెక్కిన మహిళలు



నవతెలంగాణ-కల్లూరు

వేసవికాలం వస్తుంది మంచినీటి కొరత లేకుండా చూడాలి అంటూ జిల్లా అధికారుల నుండి మండల అధికారుల వరకు ప్రకటనలు చేస్తున్నారు తప్ప అవసరం ఉన్న చోట మంచినీటి సౌకర్యం కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని చెప్పటానికి యజ్ఞ నారాయణపురం ఉదాహరణగా చెప్పక తప్పట్లేదు. మండల పరిధిలోని యజ్ఞ నారాయణపురం గ్రామంలో మంచినీటి కొరతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మంచినీటి సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు పట్టినట్టుగా వివరిస్తున్నారని అందుకు నిరసనగా ఆదివారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ ఖరీఫ్, రబీ సీజన్లో వర్షాలు లేకపోవడం, సాగర్ నీటి సరఫరా లేకపోవడంతో చుట్టుపక్కల ఉన్న చెరువులు ఎండిపోయి నెలలు కావొస్తుంది. దీంతో ఆ గ్రామంలో మంచినీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన బోరు ఎండిపోయింది. అప్పట్నుంచి సుమారు రెండు నెలల నుండి మంచినీటి కోసం ఊరికి దూరంగా ఉన్న వ్యవసాయ బావినే దిక్కైంది. ఈ బావి నుండి కూడా నీళ్లు తోడుకొని ఇంటి వరకు మోసుకొని పోవాల్సిన పరిస్థితి. సుమారు దళితవాడకు అర కిలోమీటర్ దూరంలో ఉండటం మహిళలు ఇబ్బందులు పడుతూ ఉన్నారు. దీంతో వారంతా నిరసనకు దిగారు.

బోర్ వేశారు... మోటర్ బిగించారు... కనెక్షన్ మరిచారు

తమ గ్రామంలో మంచినీటి సరఫరా లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలంటూ గ్రామస్తులు గ్రామాల్లోని పెద్దలు, మండల స్థాయి అధికారులు దృష్టికి తీసుకుపోయారు. దీంతో జువాలజిస్ట్ వచ్చి బోర్ పాయింట్ పెట్టాడు. బోర్ బండి వచ్చి బోర్ వేయడం జరిగింది. వెంటనే మోటర్ తీసుకొచ్చారు. బోర్లు దించారు. కానీ బోరు దగ్గర నుండి మంచినీటి ట్యాంక్ వరకు సుమారు 400 మీటర్లు పైప్ లైన్ వేసి మంచినీటి ట్యాంకు కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. కానీ అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బంది ఈ విషయాన్ని మరిచారు. దీంతో గత నెల రోజులు దాటినా పైపు కనెక్షన్ ఇవ్వలేదు. అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో మహిళలు ఖాళీ బిందెలు తీసుకొని రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామ మొత్తానికి ఉన్న ఒకే మంచినీటి సరఫరా ట్యాంక్ ఉన్నప్పటికీ రైతులు స్తోమత ఉన్నవారు ఇళ్లల్లో బోర్లు వేయించుకోవడం వల్ల ఇబ్బందులు నుండి తప్పుకున్నారు. కానీ దళితవాడల్లో ఇళ్లల్లో బోర్లు వేంచుకునే ఆర్థిక స్తోమత లేక ప్రభుత్వం సరఫరా చేసే నీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. దీంతో వారే మంచినీటి సరఫరా లేక ఆందోళన దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మిషన్ భగీరథ మంచినీటి సరఫరా ఆ గ్రామానికి బహుదూరం

గత రాష్ట్ర ప్రభుత్వం మంచినీటి సరఫరా చేయాలని లక్ష్యంతో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నీటి సరఫరా ఆ గ్రామానికి బహుదూరంగా మారింది. ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేసి సుమారు ఐదు సంవత్సరాలు దాటినా నేటి వరకు కూడా మిషన్ భగీరథ నీరు ఆ గ్రామాన్ని చేరటం లేదు. దళితవాడలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా కోసం ట్యాంక్ నిర్మించడం జరిగింది. నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో అప్పట్లోనే ట్రయల్ కోసం నీటిని వదలడంతో ట్యాంక్ మొత్తం లీక్ కావటంతో నీటి సరఫరా నిలిపివేశారు. ఆ తర్వాత ట్యాంకు తాత్కాలిక మరమ్మత్తులు చేశారు. కానీ నేటి వరకు నీటి సరఫరా ఇవ్వలేదు. దీంతో లక్షలు పెట్టి ట్యాంక్ నిర్మించినప్పటికీ అలంకారప్రాయంగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలో గ్రామ చివరిది కావడం వల్ల మంచినీటి సరఫరా కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరుకి వెంటనే కనెక్షన్ ఇచ్చి మంచినీటి బాధలు తప్పించాలని ఆ గ్రామంలోని మహిళలు జిల్లా అధికారులను వేడుకుంటున్నారు.

సాయి అలేఖ్య దేశానికే గర్వకారణం

సాయి అలేఖ్యకు గ్రామస్తుల సన్మానం



నవతెలంగాణ - బోనకల్

రావూరి సాయి అలేఖ్య ఆల్ ఇండియా స్థాయిలో ఐపీఎస్‌లో 938 వ ర్యాంకు సాధించి గోవిందాపురం ఎల్ గ్రామానికే కాక దేశానికి, యువతకు ఆదర్శంగా నిలిచిందని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ విభాగం డీఐజీ చౌటూరి వెంకటేశ్వరరావు, గోవిందాపురం ఎల్ మాజీ సర్పంచ్ మాదినేని నారాయణలతో పాటు పలువురు వక్తలు అన్నారు. గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన రావూరి సాయి అలేఖ్య ఐపీఎస్ సాధించిన సంగతి విదితమే. తండ్రి రావూరి ప్రకాష్‌రావు మధిర పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సాయి అలేఖ్య ఐపీఎస్ సాధించటం పట్ల గోవిందాపురం గ్రామస్తులు ఆదివారం ఘన సన్మానం చేశారు. గోవిందాపురం ఎల్ గ్రామ శివారులో రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులందరూ ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఊరేగింపుగా ఉన్నత పాఠశాల వరకు తీసుకెళ్లారు. అక్కడ గ్రామస్తులందరూ పెద్ద ఎత్తున శాలువాలతో సన్మానించారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ మాదినేని నారాయణ, లక్ష్మీపురం ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని నారాయణ, సిపిఎం నాయకులు ఏడు నూతల లక్ష్మణరావు సాయి అలేఖ్యను శాలువాలతో సన్మానించారు.

మా గ్రామస్తులందరికి గర్వ కారణం: సీపీఐ(ఎం) తమ గ్రామం నుంచి సాయి అలేఖ్య ఐపీఎస్ సాధించటం తమకు ఎంతో గర్వంగా ఉందని మాదినేని నారాయణ, జొన్నలగడ్డ సునీత, మాదినేని వీరభద్రరావు, ఏడు నూతల లక్ష్మణరావు అన్నారు. సాయి అలేఖ్య తాతయ్య రావూరి వెంకట్రామయ్య వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడని, పోరాటంలో పేద ప్రజల కోసం తన పోరాటం కొనసాగించాడని ఆయన స్ఫూర్తితో మనవరాలు కూడా పేద ప్రజలకు అండగా ఉంటూ సేవ చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రావూరి ప్రకాశరావు కుటుంబ సభ్యులు రావూరి రాజు, రావూరి అశోక్ సాయి అలేఖ్య మేనత్త సిపిఎం నాయకురాలు సొసైటీ డైరెక్టర్ తిరువీధుల కాశమ్మ సిపిఎం నాయకులు తమ్మారపు లక్ష్మణ్, కారంగుల చంద్రయ్య, కారంగుల లక్ష్మణ, ఏడునూతల లక్ష్మణరావు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు సిపిఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్, టిడిపి నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ సాధించడం పట్ల తనకెంతో ఆనందంగా ఉంది : సాయి అలేఖ్య



నా కుటుంబం ప్రోత్సాహంతోనే ఐపీఎస్ సాధించాను. ప్రతిభావంతుల విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తాను. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని నేను నిరూపించాను. యువతీ యువకులు కూడా అదే పట్టుదలతో ముందుకు సాగాలి. తన పట్ల గ్రామస్తులు చూపించిన ప్రేమ, అభిమానం, గౌరవం, మర్యాదను తాను దేశంలో తాను ఎక్కడ ఉద్యోగం చేస్తున్న తన జీవితాంతం ఈ జ్ఞాపకాలను గుర్తుపెట్టుకుంటాను.

అకాల వర్షంతో తడిసి ముద్దయిన మక్కలు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



మండల పరిధిలో ఎర్రగడ్డ గోపాలపురం కొక్కిరేణి గ్రామాలలో అకాలవర్షం రైతుల్ని మరోసారి ముంచింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట వానకు నేలపాలైంది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం కళ్లముందే తడిసిముద్దవుతుంటే ఏం చేయాలో తెలియక అన్నదాతలు తల్లడిల్లిపోయారు. రైతులు ఆరుగాలం కష్టించి అప్పులు తెచ్చి పంటలు సాగుచేసి పండించి ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యంపై కప్పిన టార్పాలిన్ కవర్లు ఎగిరి పోవడం, తర్వాత కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. అకాల వర్షంతో అన్నదాత అతలాకుతలం కాగా, రైతుల కళ్ళల్లో దైన్యం కనిపిస్తుంది. మండల పరిధిలోని ఎర్రగడ్డ గోపాలపురం గ్రామాల్లో ఈ క్రమంలో సాయంత్రం వీచిన గాలి దుమారానికి, భారీ వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులు గత్యంతరం లేక ధాన్యం సంచుల చుట్టూ నీరు జాలు వారకుండా మట్టితో కట్టలు కట్టి, నీటిని ఎత్తి పారబోశారు. చేతికి వచ్చిన పంట అంతా నష్టపోయాం. అప్పుల సమస్య ఎక్కువైంది. సమస్యలు పెరిగిపోయాయి. ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పగడాల భరత్ మృతికి సంతాపం

నవతెలంగాణ-ఖమ్మం



సీపీఐ నాయకుడు పగడాల మల్లేష్ కుమారుడు పగడాల భరత్ మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఖమ్మంలోని కొత్తగూడెంలోని వారి నివాసంకు వెళ్లి పగడాల మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం భరత్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భరత్ మృతి బాధాకరమని, చిన్న వయసులో ఇలా జరగడం విచారకరమన్నారు. భరత్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.

పాలన చేతకాక ఇబ్బందులు పెడుతుండ్రు

- హామీల అమలుకు ప్రశ్నిస్తాం, పనిపడతాం
- ప్రజల ఆశలు అడియాశాలు చేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్ పాలనలో ఎండుతున్న పోలాలు
- బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో ఎంపీలు

నామ, వద్దిరాజు

నవతెలంగాణ-కారేపల్లి



ప్రజా సంక్షేమాన్ని రెండింతలు చేస్తామని అధికారంలోకి వచ్చి పాలన చేతకాక ప్రజలను ఇబ్బందులు పెడుతుండ్రు అని ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్రలు విమర్శించారు. బీఆర్ఎస్ ఎన్నికల సన్నహాక సమావేశం ఆదివారం కారేపల్లిలోని వైఎస్ఎన్ గార్డెన్‌లో జడ్పీటీసీ వాంకుడోత్ జగన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ఎంపీలు మాట్లాడుతూ కేసీఆర్ ఇస్తున్న సంక్షేమ ఫలాలను డబల్ ఇస్తామని ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజల ఆశలను అడియాశలు చేస్తుందని విమర్శించారు. ప్రజలకు నేరుగా లబ్దిచేకూర్చే ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రైతు బంధుకు ఎగనాం పెట్టారని, కళ్యాణ లక్ష్మి అమలు జాడలేదని, దళితబంధు విషయమే తేల్చటం లేదన్నారు. చిన్నచిన్న ఆశలకు మోసపోవటంతో స్కీమ్‌లు పాయే, నీళ్ల లేక ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 4.50లక్షల మందికి పోడుపట్టాలిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే 1.50 లక్షల మందికి పట్టాలిచ్చారన్నారు. ధాన్యగారంగా ఉన్న తెలంగాణను నీళ్ల లేక ఎండుతున్న పోలాలను దర్శనం ఇచ్చేలా చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను ఖమ్మం జిల్లా నుండి తరమివేసే అవకాశం వచ్చిందని పార్లమెంట్ ఎన్నికలలో నామాను గెలిపించి ఇచ్చిన హామీల అమలుకు ప్రశ్నిద్దాం, ప్రభుత్వ పని పడదామన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతు రుణమాఫీని డిసెంబర్ 2023లోనే చేస్తామని ప్రగాల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి దాని అమలు చేతకాక ఎన్నికల కోడ్ అంటూ వాయిదాలతో సాగదీస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను డైవర్ట్ చేయటానికి ఖమ్మంలో నాటకాలు మొదలు పెట్టారని, దాని ద్వారా లబ్దిపొందాలని చూస్తున్నారని ఆరోపించారు. కోవిడ్ సమయంలో సైతం మేము దగ్గరుండి రైతుల ధాన్యం కొనుగోలు చేయించామని, నేడు రైతులు కొనుగోలు కేంద్రాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఇచ్చిన హామీల అమలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం, నిలదిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైరా నియోకవర్గ ఇంచార్జీ బానోత్ మదన్‌లాల్, మాజీ జడ్పీటీసీ ఉన్నం వీరేందర్, ఎంపీటీసీలు మూడు జ్యోతిమోహన్, ధర్మసోత్ శంకర్, నాయకులు హన్మకొండ రమేష్, జడల వెంకటేశ్వర్లు, నర్సింగ్ శ్రీనివాసరావు, ఎస్‌కె.గౌసుద్దీన్, బత్తుల శ్రీనివాసరావు, డొంకెన రవీందర్, గుగులోత్ సక్రు, ఇస్లావత్ బన్సీలాల్, ఖలీలుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి ముఖ్యనాయకులు దూరం

పార్లమెంట్ ఎన్నికల సమావేశానికి ఇద్దరు ఎంపీలు, మాజీ మంత్రి వచ్చినా మండలానికి చెందిన ముఖ్యనాయకులు దీనికి దూరంగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌కు అనుచరులుగా ఉన్నా ఎంపీపీ మాలోత్ శకుంతల, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సోసైటీ వైస్ చైర్మెన్ దారావత్ మంగీలాల్, చీమలపాడు సర్పంచ్ మాలోత్ కిషోర్, ఆత్మకమిటీ మాజీ చైర్మెన్ ముత్యాల సత్యనారాయణ, బీఆర్ఎస్ మాజీ ప్రధానకార్యదర్శి అజ్మీర వీరన్న, తొడితలగూడెం సర్పంచ్ బానోత్ కుమార్‌లు సమావేశంకు హాజరుకాలేదు. దీనిపై నామ మాట్లాడుతూ సమావేశానికి రాని నాయకులతో మాట్లాడతానంటూ చెప్పుకొచ్చారు.

వాకర్స్‌ను కలిసి ఎన్నికల ప్రచారం చేసిన నామ

ఖమ్మం : రైతు బిడ్డను నన్ను ఆశీర్వదించి గెలిపించండి, ఎన్టీఆర్ స్ఫూర్తితో మరింత వేగంగా పని చేస్తానని బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నామ నాగేశ్వరరావు ఆదివారం ఉదయం ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్‌లో వాకర్స్‌ను కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నామ వాకింగ్ చేస్తున్న ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా కలిసి మాట్లాడి, తనకు ఓటు వేసి మంచి మెజారిటీతో గెలిపించి, పార్లమెంట్‌కు పంపించాలని వారిని కోరారు. వివిధ ప్రాంతాల నుంచి వాకింగ్‌కు వచ్చిన ప్రతి ఒక్కరిని కలిసి ఎన్నికల్లో తనకు సహకరించా ల్సిందిగా కోరారు. మీ అందరి ఆశీర్వాదం వల్లనే గతంలో మంచి మెజారిటీతో గెలిచి, పార్లమెంట్‌కు వెళ్లి జిల్లా ప్రజా గొంతుకై, సమస్యలపై గళం వినిపించడం జరిగిందన్నారు. తన గెలుపు ద్వారా కేసీఆర్ కు మద్దతుగా నిలవాలన్నారు. తనను గెలిపించడం అంటే తెలంగాణా అభివృద్ధిని బలపర్చడమేనని అన్నారు. బీఆర్ఎస్ ఎంపీలు గెలిస్తేనే తెలంగాణా ప్రయోజనాలు, హక్కులు కాపాడబడతాయని తెలిపారు. మోసపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కేవలం నాలుగు నెలల కాలంలో ఏమీ చేయలేక అన్ని వర్గాల ప్రజల్ని మోసం చేసిందన్నారు. ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్‌కు ఓటేసి పొరపాటు చేశామని, అన్ని వర్గాల ప్రజలు చెబుతూ ఆవేదన చెందుతున్నారని తెలిపారు. రైతులు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తన ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని చెప్పారు. ఈసారి ఆ పార్టీకి ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు వేయమని, తనకే ఓటు వేసి మంచి మెజార్టీతో గెలిపిస్తామని భరోసా ఇస్తున్నారని చెప్పారు. ఖమ్మం నగరాన్ని ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని, ఇందుకు సాక్ష్యం లకారం ట్యాంక్ బండ్ అన్నారు. లకారం చెరువు గతంలో ఎలా ఉంది ఇప్పుడెలా ఉందో తెలుస్తుందన్నారు. అనంతరం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కు వెళ్లి, నివాలర్పించి, ఆశీస్సులు తీసుకున్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో మరింత వేగంతో పని చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, జస్వంత్, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఖాదర్ బాబు, కోశాధికారి గడిపూడి జనార్దన్‌రావు, గుత్తా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, జైపాల్, మోరంపూడి ప్రసాద్, గోడ్డేటి మాధవరావు, తాళ్లూరి హరీష్, చీకటి రాంబాబు, కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గోవింద్రాల వాసికి డాక్టరేట్

నవతెలంగాణ-కామేపల్లి

ఉస్మానియా యూనివర్సిటీ విద్యా విభాగ పరిశోధకుడు, గిరిజన గురుకుల సొసైటీ పరిధిలోని మహబూబాబాద్ జిల్లా దామరవంచ గురుకులంలో టీజీటి మాథ్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న హట్కర్ బాలాజీకి ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఎమ్.రాములు విద్యా విభాగంలో శుక్రవారం డాక్టరేట్ ప్రకటించారు. ఏ కంపరేటివ్ స్టడీ అమాంగ్ ట్రైబల్ అండ్ నాన్ ట్రైబల్ హైయర్ సెకండరీ స్టూడెంట్స్ ఇన్ దేయిర్ కెరిర్ అవేర్నెస్ అండ్ అకాడమిక్ మోటివేషన్ అనే అంశం మీద ఉస్మానియా యూనివర్సిటీ విద్యా విభాగ ప్రొఫెసర్ డీ. బలరాములు పర్యవేక్షణలో సిద్ధాంత పరిశోధన పూర్తిచేశారు. ఖమ్మం జిల్లా, కామేపల్లి మండలం గోవిందరాల గ్రామానికి చెందిన హట్కర్ బాలాజీ 2018 వరకు ప్రసిద్ధి గాంచిన భద్రాది కొత్తగూడెం జిల్లాలోని గిరిజన ఉపాధ్యాయ విద్యా కళాశాల బీఈడీ భద్రాచలంలో మాథ్స్ పెడగాజీలో అధ్యాపకుడిగా సేవలందించి మంచి పేరు సంపాదించారు. అనంతరం 2018లో గురుకుల నియామక పరీక్షలో టీజీటి మాథ్స్‌లో ఉద్యోగం రావడంతో వెళ్ళిపోయారు. ఓవైపు ఉద్యోగం చేస్తూనే 2019 సంవత్సరంలో మైసూర్ లోని రీజనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మైసూర్ లో లిగైడెన్స్ అండ్ కౌన్సిలింగ్‌లి అనే అంశం పైన పరిశోధన చేసి పూర్తి చేయడం జరిగింది. విద్యా విభాగంలో పీహెచ్డీ పూర్తి చేసేందుకు సహకరించిన మెంటర్ ప్రొఫెసర్ డీ. బలరాములు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యా విభాగ ఆచార్యులకు, గురువులకు, తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు, దామరవంచ గురుకుల కళాశాల పాఠశాల ఉపాధ్యాయ బృందానికి డా. హట్కర్ బాలాజీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

24 నుండి అంకమ్మ, మహాలక్ష్మమ్మ, ముద్దిరావమ్మ జాతర

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో ఈ నెల 24 నుండి 28 వరకు అంకమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మెన్ దొడ్డ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు రోజులు అమ్మవార్లకు వివిధ రూపాలలో పూజా కార్యక్రమాలు 26, 27, 28, తేదీలలో అన్నదాన కార్యక్రమం, నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి జాతరను విజయవంతం చేయాలని శ్రీనివాసరావు కోరారు.

గురుకుల పాఠశాలలో 15 సీట్లు సాధించిన పమ్మి విద్యార్థులు

- రామ్స్ ట్యూషన్ సెంటర్ మాస్టర్ లక్ష్మణ్ ప్రతిభ
- మాస్టర్ లక్ష్మణ్‌ను అభినందించిన తల్లిదండ్రులు, గ్రామస్తులు

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో పమ్మి గ్రామానికి చెందిన 18 మంది విద్యార్థులు రామ్స్ ట్యూషన్ సెంటర్లో ఐదో తరగతి లో కోచింగ్ పొంది, గురుకుల పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలు రాయగా, ప్రభుత్వం ఈనెల 19న ప్రకటించిన పరీక్ష ఫలితాల్లో 15 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి సీట్లు పొందారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వెల్లబుచ్చారు. ట్యూషన్ సెంటర్ మాస్టర్ లక్ష్మణ్ కృషి, ప్రతిభ ద్వారా 15 మంది విద్యార్థులకు గురుకుల పాఠశాలలో చదువుకు ఎంపికయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందంతో ట్యూషన్ మాస్టర్ లక్ష్మణ్‌ను ప్రశంసించి కృతజ్ఞతలు తెలిపారు. గురుకుల పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి, ఏకంగా 15 మంది విద్యార్థులు అర్హత సాధించి, ట్యూషన్, గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు తెచ్చిన విద్యార్థులతోపాటు, గ్రామస్తులు, ట్యూషన్ మాస్టర్ లక్ష్మణ్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ట్యూషన్ మాస్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో 2024-25 సంవత్సరంలో 15 మంది విద్యార్థులు సీట్లు సాధించి ప్రభంజనం సృష్టించి గురుకుల పాఠశాలకు ఎంపికకావడం ఆనందంగా ఉందని, కోచింగ్ ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు గురుకుల పాఠశాలలో చదువులో రాణిస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని మాస్టర్ లక్ష్మణ్ ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కి మేడేపల్లి విద్యార్థిని కావ్య

నవతెలంగాణ-ముదిగొండ

ఖమ్మం సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో మండల పరిధిలో మేడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బీ.కావ్య (ఎనిమిదో తరగతి) అండర్ 16 బాలికల విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిందని పాఠశాల పీఈటీ బీ.కృష్ణయ్య తెలిపారు. ఈ నెల 28న సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్‌కి ఎంపికై పోటీలో పాల్గొననుందని ఆయన పేర్కొన్నారు. కావ్య గతంలో ఫుట్బాల్ క్రీడ నుంచి రాష్ట్రస్థాయి అండర్ 14 బాలిక విభాగంలో జరిగిన రెండు, రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు అండర్ 17 బాలికల విభాగం నుండి ఫుట్బాల్ లో రాష్ట్రస్థాయి విభాగంలో పాల్గొన్నదన్నారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు పాఠశాల నుంచి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి నాగేశ్వరరావు, పీఈటి కృష్ణయ్య, పాఠశాల సిబ్బందితోపాటు, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, గ్రామ మాజీ సర్పంచ్ సామినేని రమేష్, గ్రామస్తులు కావ్యాను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి

నవతెలంగాణ-కల్లూరు

ఖమ్మంలో మార్బుల్ హమాలీ కార్మికులు కూలి రేట్లు పెంచాలని వారం రోజుల నుండి నిరవధిక సమ్మె చేస్తున్న హమాలీ కార్మికులకు ఖమ్మం జిల్లా హమాలి అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ కల్లూరు బ్రాంచ్ కమిటీ (ఐఎఫ్టియు) మద్దతు తెలిపి వెంటనే సమస్య వ రి ష్ క రి ం చా ల ని డిమాండ్ చేసిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కే.పుల్లారావు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. మార్బుల్ షాపుల యజమానులు తమ మొండి వైఖరి విడనాడి వెంటనే హమాలి ప్రతినిధులు లను చర్చలకు పిలవాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కమిటీ డిమాండ్ చేస్తుందని తెలిపారు.

ఓటుహక్కును నిష్పక్షపాతంగా వినియోగించుకోండి

- మున్సిపల్ కమిషనర్ మంద రవిబాబు

నవతెలంగాణ-సత్తుపల్లి



రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటుహక్కును నిష్పక్షపాతంగా నిర్భయంగా వినియోగించుకోవాలని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ మంద రవిబాబు ఓటర్లను కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సత్తుపల్లిలో ఓటుహక్కు వినియోగంపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని కేపీఆర్ గౌతమ్స్ స్కూలు రోడ్డులోని డాక్టర్స్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కమిషనర్ రవిబాబు మాట్లాడారు. వచ్చే (మే) నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కును నిష్పక్షపాతంగా, నిజాయితీ వినియోగించుకోవాలని కమిషనర్ అక్కడి ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షను జయప్రదం చేయండి

- భవిష్య మెడికల్ అకాడమీ డైరెక్టర్

రామిరెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షను జయప్రదం చేయాలని భవిష్య మెడికల్ అకాడమీ డైరెక్టర్ రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ ఎంసెట్, నీట్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్ నీట్ పరీక్షలు నిర్వహించడం మంచి పరిణామం అని విద్యార్థులకు ముందస్తుగా ఈ టెస్ట్‌ను నిర్వహించడం వలన వారిలో ఉన్న భయాన్ని పోగొట్టి పరీక్షకు సంసిద్ధులు చేసేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్, నీట్ పరీక్ష గత 19 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖ విద్యా వేత్త చుక్క రామయ్య దీనికి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఖమ్మం జిల్లాలో మోడల్ ఎంసెట్ 27, 28, 29 న ఆన్‌లైన్‌లో, మోడల్ నీట్ 26 వ తేదీన ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు పోటీ ఈ పరీక్షలు అంటే బయం పోగొట్టేందుకే, జాతీయ స్థాయి పరీక్ష అయినా నీట్‌లో అవగాహన కల్పించేందుకు ఎస్ఎఫ్ఐ పరీక్ష నిర్వహిస్తుందని తెలిపారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పరీక్షపై అవగాహన కల్పించి ప్రధానంగా పేద విద్యార్థులకు ఈ పరీక్షలు పట్ల స్పష్టమైన అవగాహన కలిగి వుండేలా చేయడం కోసం ఎస్ఎఫ్ఐ ప్రయత్నం చేస్తుందని తెలిపారు. దీనిని ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోగలరని కోరారు. పూర్తి వివరాలకు 8465813109, 9100338254, 7287990728, 9705962537లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్, నాయకులు వినోద్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



జహంగీర్ గెలుపుని కాంక్షిస్తూ చౌటపల్లో ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-ముదిగొండ

వచ్చే నెల13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎండీ.జహంగీర్ గెలుపుని కాంక్షిస్తూ చౌటపల్‌లో ఆదివారం సీపీఐ(ఎం) ముదిగొండ మండల కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటింటి ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించి జహంగీర్‌ను గెలిపించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, కొమ్ము శీను, మురళి, మండల నాయకులు టీఎస్.కళ్యాణ్, వేల్పుల భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యాకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

నవతెలంగాణ-కామేపల్లి

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను, నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రముఖ సీనియర్ అడ్వకేట్ బోడేపూడి విఠల్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని పండితాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు కుటుంబాల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో నూతన దంపతులను ఆశీర్వదించారు. ఇటీవల జరిగిన బీఆర్ఎస్ - కాంగ్రెస్ పార్టీల మధ్య జరిగిన ఘర్షణలో జైలుకు వెళ్లి వచ్చిన పలువురిని కలిసి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించబోతుందని కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ నేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకపోతుల మహేష్, బండి ఉపేందర్, హరిచంద్ర నాయక్, బండి లక్ష్మీనర్స్, బత్తుల వీరబాబు, మొగిలి ముత్తిలింగం, గుగులోత్ రవి, మొగిలి శ్రీను, బత్తుల పెద్దరాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షలపై అవగాహన

నవతెలంగాణ-సత్తుపల్లి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రంలో ఆదివారం పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ పి. శ్రీనివాస్ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. యూనివర్సిటీ కార్యకలాపాలు, సెమిస్టర్ విధానంలో పరీక్షల నిర్వహణ, ప్రాక్టికల్స్, మోడల్ పేపర్స్, అంబేద్కర్ వర్సిటీ యాప్‌ను ఉపయోగించే విధానం, యూట్యూబ్ ద్వారా యూనివర్శిటీ తరగతుల నిర్వహణ తదితరాంశాలతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న సేవల గురించి ప్రిన్సిపాల్ విజయకుమార్ విద్యార్థులకు వివరించారు. మే నెల మాసాంతం లోపు జరుగనున్న పరీక్ష ఫీజును మే 6వ తేదీ లోగా చెల్లించి పరీక్షలు రాసేందుకు సన్నద్ధంగా ఉండాలని అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పానెం రామచంద్రరావు, ఎం రాంబాబు, డాక్టర్ విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



బాధిత మొక్కజొన్న రైతులకు ఆపన్నహస్తం

నవతెలంగాణ-గుండాల

ఇటీవల గుండాల మండల పరిధిలోని పోతిరెడ్డిగూడెం గ్రామంలో ప్రమాదవశాత్తు పది మంది రైతులకు చెందిన సుమారు 25 ఎకరాల మొక్కజొన్న చేలు పూర్తిగా దగ్ధమై, పంట నష్టం తీవ్రంగా జరిగిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో మండల కేంద్రానికి చెందిన వాసవి క్లబ్ గ్రీన్ ఫీల్డ్ అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారస్తులు మానాల వెంకటేశ్వర్లు నష్టం వాటిల్లిన పంటచేలను ఆదివారం స్వయంగా పరిశీలించి, రైతులకు భరోసా కల్పించారు. బాధిత రైతులకు రానున్న ఖరీఫ్ సీజన్‌లో 80 యూరియా కట్టలు సాగు సాయంగా అందజేయడంతో పాటు ఇతోధికంగా పంట విత్తనాలు సైతం అందిస్తానని ప్రకటించారు. సాటి మనిషిగా ఇంతటి ఔదార్యాన్ని చాటిన మానాల వెంకటేశ్వర్లుకు బాధిత రైతులు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు మండల వాసులు మానాల వారి దయాహృదయాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులతో పాటు మానాల ప్రణీత్ పాల్గొన్నారు.



మృదుభాషి స్వర్ణకు ఘనంగా వీడ్కోలు


నవతెలంగాణ-అశ్వాపల్లి

మండల కేంద్రంలోని శాంతి విద్యా నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో హెడ్ మిస్ట్రెస్‌గా గత 6 సంవత్సరాలుగా విధులు విజయవంతంగా నిర్వహించి, బదిలీలపై సారపాక మండలంలోని రెడ్డిపాలెం గ్రామం పాఠశాలకు వెళ్తున్న స్నేహశీలి, మృదుభాషి స్వర్ణ(నన్)కు స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కూరపాటి యాకూబ్, జ్యోతిర్మయి యానిమేటర్ పరమ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల నడుమ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. తదనంతరం ఫాదర్ యాకోబు, యానిమేటర్ ప్రభాకర్ గత అరు సంవత్సరాల కాలంలో ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణ పాఠశాల అభ్యున్నతికి అహర్నిశలు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిస్టర్స్ మేరీ చాంధల్, థామరిస్, సంఘ నాయకులు కరకపల్లి నాగేష్, రాంబాబు, రామ్మూర్తి, కిరణ్, బన్నీ, సచిన్, నవీన్, సులోచన, లక్ష్మీ, జయమ్మ, సుగుణ, రాజీ, మంగ, యేసుమని, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ముద్దు బిడ్డను గెలిపించండి

నవతెలంగాణ-జూలూరుపాడు

ఈ నెల 24వ తారీఖున నామినేషన్ వేస్తున్న జూలూరుపాడు మండలం మాచినేని గ్రామంకు చెందిన గిరిజన ముద్దు బిడ్డ నాగేశ్వరరావును గెలిపించాలని ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన బిడ్డలు, దళితులు, బీసీలు అందరూ హాజరై హాజరైద్దని విజయవంతం చేయగలరని కోరారు.



మండలంలో గాలివాన బీభత్సం

- పిడుగు పాటుకు గేదె మృతి, కూలిన ఇండ్లు

నవతెలంగాణ-పినపాక



పినపాక మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా గాలివాన బీభత్సం సృష్టించింది. బలమైన గాలితో వాన ఒక్కసారిగా తోడవడంతో ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా పలుచోట్ల చెట్లు పడిపోయాయి. విద్యుత్ స్తంభాల సైతం నేలకొరిగాయి. ఎంపీడీవో కార్యాలయం వద్ద చెట్లు విరిగిపడడంతో నాలుగు స్తంభాలు విరిగిపోయాయి. ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో ప్రధాన రహదారిపై డ్రైనేజీ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. ప్రధాన రహదారిపై మోకాళ్ల లోతు వరద నీరు ప్రవహించింది. మండలంలో పలుచోట్ల ఇల్లులు నేలకొరిగాయి. పొట్లపల్లి పంచాయతీ పూలవచిలక గ్రామంలో పూనెం బాలకృష్ణకు చెందిన గేదె మృతి చెందింది. పల ఇండ్లు కూలాయి, ఇంకా ఎంత నష్టం జరిగింది అన్నది పూర్తిస్తాయిలో తెలియవలసి ఉన్నది.

సీపీఐ మండల నూతన కమిటీ ఏకగ్రీవం

నవతెలంగాణ-దమ్మపేట



సీపీఐ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నాట్టు జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ యార్లగడ్డ భాస్కర్ తెలిపారు. సీపీఐ అత్యవసర కౌన్సిల్ సమావేశం పార్టీ సీనియర్ నాయకులు కూకలగుంట సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన యార్లగడ్డ భాస్కర్ రావు గారు మాట్లాడుతూ..... నా ఆరోగ్యం సహకరించకపోవడం వలన మండల పార్టీ పూర్తి బాధ్యతలు, ప్రజా సంఘాల నిర్మాణ బాధ్యతలు, నూతన మండల కమిటీకి అప్పగించినట్టు తెలిపారు. మండల కార్యదర్శిగా సుంకిపాక ధర్మ సహాయ కార్యదర్శిగా బత్తుల సాయి, సహాయ కార్యదర్శిగా యార్లగడ్డ మణికంఠలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీకి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, పాత్రికేయ మిత్రులు, అధికారులు, రాజకీయ ప్రముఖులు, అందరూ సహకరించాలని వారు కోరారు.

మొక్కంపాడు తండాలో బోనాల జాతర

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని మొక్కంపాడు తండాలో ఆదివారం స్థానికులు బొడ్రాయి బోనాలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నట్టు తెలిపారు. బొడ్రాయి బోనాలను పురస్కరించుకొని గ్రామంలోని మహిళలందరూ నియమ నిష్ఠలతో బోనాలు తయారు చేసుకుని తలపై ధరించి పుర వీదుల గుండా ఊరేగింపుగా డబ్బులు బ్యాండ్ మేళాల మధ్య అమ్మవారి సన్నిదికి చేరుకున్నామన్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొక్కంపాడు గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ విజయ, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బస్తర్ జిల్లాలో బస్సు బోల్తా

- పది మంది సీఆర్పీఎఫ్ బెటాలియన్ జవాన్లకు గాయాలు

నవతెలంగాణ-చర్ల



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పది మంది సీఆర్పీఎఫ్ బెటాలియన్ జవాన్లు గాయపడ్డారు. ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో దిమరాపాల్ మెడికల్ కాలేజీకి తరలించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఈ నెల 19న జరిగిన లోక్‌సభ ఎన్నికల విధులు ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో జవాన్లు ప్రయాణిస్తున్న బస్సు జగదల్పూర్ జాతీయ రహదారి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. బస్సు ప్రమాదానికి గురైన సమయంలో బస్సులో 40 మంది జవాన్లు ఉన్నారు. కోడెనార్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ప్రమాదం పై కేసు నమోదు చేశారు.

మట్టికుండలకు ఆదరణ...

- పేదోడి ఫ్రిజ్‌గా ఖ్యాతి
- చల్లని నీటితో తీరుతున్న దాహార్తి
- ఫేమసయిన కుండ బిర్యాని
- ప్లాస్టిక్‌తో అనారోగ్యం, పర్యావరణ ముప్పును గ్రహిస్తున్న ప్రజలు
- తగ్గుతున్న కుమ్మరి వృత్తి దారుల సంఖ్య
- ప్రభుత్వ ఆదరణ కరువు



నవతెలంగాణ-ఇల్లందు

ఎండా కాలం దాహం తీరాలంటే కుండలోని చల్లటి నీరు తాగాల్సిందే. ఇంట్లో ఫ్రిజ్‌లు ఉన్నప్పటికీ వేసవిలో కొత్త కుండలు కొని నీళ్ళు తాగేవారు ఉన్నారు. వేసవితాపాన్ని తట్టుకుంటు ఆరిపోతున్న గొంతు చల్లబరుచుకోడానికి పేదోడికి మట్టి కుండలు ఎంతో దోహద పడుతున్నాయి. వేలాదిరూపాయలు వెచ్చించి మార్కెట్‌లో లభించే వివిధ రకాల బ్రాండ్‌ల ఫ్రిజ్‌లు కొనే స్థితిలో లేని పేద మద్యతరగతి కుటుంబాలు మట్టి కుండలను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ గ్రామాలు, తండాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. చల్లని నీటితో తమ దామార్తిని తీర్చుకునేందుకు నామమాత్రపు ధరలకు లభించే మట్టికుండలపైనే ఆదారపడుతున్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో మట్టికుండలు విక్రయ కేంద్రాలు వెలిశాయి. వేసవికాలం ప్రారంభమైనందున కుండలకు ఆదరణ వుండే అవకాశం వుండడంతో స్థానిక వ్యాపారులతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కేంద్రాలు ఏర్పాటుచేసి మట్టికుండలను విక్రయిస్తున్నారు. ప్రతీ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ప్రాంతాలవారిగా చలివేంద్రాలను ఏర్పాటు చేసేవారు. కుండల ధరలు పెరగడంతో చలివేంద్రాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. వేలాది రూపాయలు ఖర్చుచేసి ఫ్రిజ్ కొనలేని పేద కుటుంబాలు ధర ఎక్కువైనప్పటికి మట్టికు ండలపైనే ఆదారపడి చల్లని నీటితో దాహార్తిని తీర్చుకుంటున్నారు.



ఫేమసయిన కుండ బిర్యాని, ముంత పెరుగు

ప్లాస్టిక్‌తో అనారోగ్యం, పర్యావరణ ముప్పును ప్రజలు గ్రహిస్తున్నారు. ఇటీవల కాలంలో మట్టి గ్లాసులో టీ, కాఫీలు తాగడంవల్ల కమ్మటి రుచి ఉంటుందని పట్టణాలు, నగరాల్లో హాటల్ నిర్వాహకులు అందిస్తున్నారు. ఈ మధ్య చిన్నచితక హాటల్లాలో కుంబ బిర్యాని ప్రత్యేక అంటూ బ్యానర్లు వెలుస్తున్నాయి. ఇక స్టార్ హాటల్లు, పెళ్ళిళ్ళలో శుభకార్యాలలో కుండ బిర్యాని, ముంత పెరుగు ఫేమస్ అయ్యింది. ప్లాస్టిక్ వస్తువులు, క్యారిబాగ్‌లు, పేపర్ టీగ్లాసులతో ప్రజారోగ్యాలకు ముప్పని పర్యావరణ వేత్తలు హెచ్చరికలు చేస్తుండటంతో ఆరోగ్యంపట్ల కొందరిలో శ్రద్ధ పెరిగింది. తీనే ఆహార పదార్థాలతోపాటు వంట పాత్రల మార్పిడిపై శ్రద్ధ కనపరుస్తున్నారు. రాజుల కాలంతోపాటు, ముత్తాతల కాలంలో సైతం మట్టితో తయారు చేసిన పాత్రల లోనే అన్నం, కూరలు, చారు చేసేవారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాలలో ఈ ట్రెండ్ వస్తోంది. కుమ్మరి వృత్తి కనుమరు గౌతున్న తరుణంలో మట్టి పాత్రలకు జీవం వస్తోంది.



తగ్గుతున్న కుమ్మరి వృత్తి దారుల సంఖ్య : ప్రభుత్వ ఆదరణ కరువు

పట్టణంలో ఒకప్పుడు సుమారు 500 కుటుంబాలు కుండలు తయారు చేస్తు బిజీగా ఉండేవారు. రోజులు మారడంతో మట్టికుండలు తయారుచేసే వృత్తిదారుల సంఖ్య కాలక్రమంలో కనుమరుగైంది. ఇల్లందులో రెండు కుటుంబాలు మాత్రమే మామూలు కుండలు తయారు చేస్తున్నారు. మరి కొన్ని కుంటుంబాలు వేరే పనులు చేయలేక భద్రాచలం, ఆదిలాబాద్, రాజమండ్రి, రాజస్థాన్ తదితర ప్రాంతాల నుండి రకరకాల కుండలు తెప్పించి రోడ్డుపై పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. భద్రాచలం నుండి తెచ్చిన కుండలు ఇక్కడ రూ.150, 100, 50లకు రాజస్థాన్ కుండలు రూ.300, రూ.250, 220, రాజమండ్రి, ఆదిలాబాద్ కుండలు 200పైనే అమ్ముతున్నారు. వేసవికాలం ఐపోతే ఆ కొద్దిమంది కులవృత్తిదారులుసైతం ఉపాదికోల్పోతూ వీధులపాలవుతుండడంతో కులవృత్తిని పక్కనపెట్టి ప్రత్యామ్నాయ మార్గాలకోసం అన్వేషించే పరిస్థితి ఏర్పడింది. మారిన కలానికనుగుణంగా అందమైన కుండలను తయారుచేసి మార్కెట్‌లోకి తెస్తేనే జనం కొనుగోలుచేస్తున్నారు. గతంలో పదిరూపాయలనుండి యాభైరూపాయలవరకు రకరకాల మట్టికుండలు లబించగా ధరల పెరుగుదలతో నేడు మట్టికుండను కొనుగోలు చేయాలంటే కనీసం రూ.100 నుండి 150 వరకు ఖర్చుపెట్టాల్సివస్తుంది. పట్టణ కేంద్రాల్లో అందమైన మట్టికుండలను కొనుగోలుచేయాలంటే నాలుగ ువందలవరకు ఖర్చుచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పేదవాడి దాహార్తిని తీర్చేందుకు మార్కెట్‌లోకి వస్తున్న మట్టికుండలకు ఆదరణ పెరిగినప్పటికీ ధరల పెరుగుదల కారణంగా మట్టికుండలు తయారుచేసేందుకు అధికడబ్బును ఖర్చుచేయాల్సివస్తుందని అల్లాదుర్గం సత్యమ్మ రాములు పేర్కొంటున్నారు. కుండలకు వినియోగించే మట్టిని కొనుగోలుచేయాల్సి వుంటుందని తయారుచేసి మార్కెట్‌లో విక్రయించేసరికి ఒక్కోకుండపై తమకు రూ.15నుండి 30 వరకు ఆదాయం వుంటుందన్నారు. ఒక్కో సందర్భంలో తాము ఖర్చుపెట్టిన ధరకే మట్టికుండలను విక్రయించాల్సివస్తుందన్నారు. చేతివృత్తిపై ఆదారపడి జీవిస్తున్న తమ కుటుంబాలకు ప్రభుత్వ పరంగా సహకారం లేనందున ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వివాహ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలోని గొల్ల గూడెం గ్రామంలో ఓర్రె వెంకన్న, ఉపేంద్ర దంపతుల కుమారుడు సాయికుమార్, స్వాతిల వివాహ వేడుకలలో అలాగే గరిడడ్డు గ్రామంలోని పోడియం రాంబాబు, కామమ్మ కుమార్తె శ్రావణి, సాయికుమార్ వివాహ వేడుకలలో ఆదివారం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, భూరెడ్డి వెంకట్ రెడ్డి, కాకా అశోక్, పర్వత నరేష్, భద్రారెడ్డి, బొబ్బల వీరన్న, వర్రె వీరభద్రం జాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైరామ్‌గఢ్ అడవుల్లో ఎన్‌కౌంటర్

లక్ష రివార్డు గల మావోయిస్టు మృతి

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు చత్తీస్‌గడ్ బీజాపూర్ జిల్లా బైరామ్‌గఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేష్‌కుతుల్ అడవుల్లో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురు కాల్పులు ఆదివారం జరిగాయి. బైరామ్‌గఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేష్‌కుతుల్-కేశముండి అడవుల్లో డివిజన్ సప్లై టీమ్ కమాండర్ కవాసి పాండ్రు ఇతర 15-20 మంది మావోయిస్టులు ఉన్నారనే నిఘాపై డిఆర్జి బీజాపూర్ జిల్లా పోలీస్ గాలింపు చర్య చేపట్టింది. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటలకు, కేశ్‌కుతుల్ అడవులలో పోలీసులు



మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో, లక్ష రివార్డుతో ఉన్న గుడ్డి కవాసి అనే మావోయిస్టు మృతి చెందాడు. ఆయుధాలు, పేలుడు పదార్థాలు ఇతర మావోయిస్టు సామగ్రిని సంఘటన స్థలం నుండి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడికక్కడే జరిపిన సోదాల్లో ఒక దేశీయ తుపాకీ, కుక్కర్ బాంబు, కార్డెక్స్ వైర్, ఫ్యూజ్, డిటోనేటర్, జిలెటిన్ స్టిక్, బాణసంచా, మావోయిస్టు యూనిఫాం, బెల్ట్, పిత్తు, నిషేధిత మావోయిస్టు సంస్థకు చెందిన సాహిత్యం రోజువారీ ఉపయోగించే ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో హతమైన మావో యిస్టును జనతా ప్రభుత్వ అధ్యక్షుడు గుడ్డి కవాసి, తండ్రి అయితు, వయస్సు 34 సంవత్సరాలు, జంగ్లా జిల్లా, బీజాపూర్‌లోని కోటిమెటా పోలీస్ స్టేషన్ నివాసి. భయంకరమైన మావోయిస్టు అనేక హత్య మందు పాత్ర పేలుడు కేసులలో పాల్గొన్నాడు. హతమైన మావోయిస్టుపై రూ.లక్షల రివార్డు కలదని జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ ధృవీకరించారు.

అనాధా, వృద్ధాశ్రమంకు వితరణ

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాచలంలోని మానవ సేవ అనాధా, వృద్ధాశ్రమం, మానసిక వికలాంగుల ఆశ్రమంకు కొత్తగూడెం ఏరియాలోని సింగరేణి ఉద్యోగులు వితరణ చేశారు. ఆదివారం భద్రాచలంలోని మానవ సేవ అనాధా, వృద్ధా, మానసిక దివ్యగుల ఆశ్రమంకు రూ.ఒక లక్ష 25 వేల విలువగల ఏసీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, ఇతర ముఖ్యమైన నిత్యవసర వస్తువులను వితరణ వితరణ చేశారు. ఈ వితరణను పివికే-5ఇంక్లైన్‌లో పనిచేయుచున్న సింగరేణి ఉద్యోగుల, అధికారుల అందరి నెలసరి జీతం నుండి ప్రతి నెలకు రూ.50ల చొప్పున సోషల్ వెల్ఫేర్ ఫండ్ కోసం రికవరీ గత కొంతకాలంగా చేస్తున్నారు. ఆ వితరణతో రూ.1 లక్ష 25 వేలతో ఆశ్రమం ఆర్గనైజర్ సరోజాకి అందజేశారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఈ కార్యక్రమమునకు రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఇటువంటి కార్యక్రమంలో ఉద్యోగుల వితరణతో చేయడం హర్షించదగిన విషయము అని పివికే.5 ఇంక్లైన్ గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్‌కు, పివికే.5ఇంక్లైన్ ఉద్యోగులకు, సహకరించిన కార్మిక నేతలను అభినందించారు. ఇటువంటి కార్యక్రమములను సింగరేణి సంస్థ ప్రోత్సాహం అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా పివికే.5ఇంక్లైన్ ఏజెంట్ బి.రవీందర్, గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, సంక్షేమ అధికారి వి.అజయ్, యూనియన్ ప్రతినిధులు సాయి పవన్, ఏఐటీయూసీ, వై.శంకర్, బోరింగ్ శంకర్ ఐఎన్‌టీయూసీ, విజయగిరి శ్రీనివాస్ సీఐటీయూ ఆసిఫ్ హెచ్.ఎం.ఎస్, భూక్య రమేష్, సారయ్య కే.రమేష్, సాంబమూర్తి, కుమార్ కృష్ణ సాయి, పవన్ దేవ్ సింగ్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- జెన్కో ఎస్ఈ కే.జంగయ్య
- కేఎల్ఆర్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-పాల్వంచ

ఉద్యోగుల కోసం అందుబాటులో ఉన్న అవకాశాలను విద్యార్థులు సద్యోగం చేసుకోవాలని జెన్కో ఎస్ఈ కే.జంగయ్య సూచించారు. స్థానిక కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతియేషన్ డేను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాల్గొని ఇంజనీరింగ్ పూర్తి చేసిన 130 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశంస పత్రాన్ని ఆయన అందజేశారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి భవిష్యత్తును ఎంచుకోవాలని అన్నారు. అనంతరం ప్రముఖ విద్యావేత్త ఆచార్యులు డి.హరిత మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సంకేతక ఆవిష్కరణలో కంప్యూటర్ సైన్స్ నందు ప్రోగ్రామింగ్ స్కిల్స్ అవగాహన నైపుణ్యాన్ని పెంచుకోవాలని తెలిపారు. అది ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్పర్సన్ కె.నాగమణి, కళాశాల అభివృద్ధి గల ప్రతి ఒక్క అవకాశాన్ని ఉపయోగించుకుంటూ విద్యార్థులకు మంచి భవిష్యత్తు లక్ష్యాలు అందుకునేలా తీర్చి దిద్దాలనే అంకితభావంతో విద్యారంగానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్యులు ఎం.సురేంద్ర కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్యులు కే.రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు బి.కాశీ విశ్వనాథ్, కే.మురళి ప్రసాద్, విభాగదిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


రేపు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

నవతెలంగాణ-దమ్మపేట

బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంటరి నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం ఉదయం 10:30 నిమిషాలకు దమ్మపేట-అప్పరావుపేట రోడ్‌లో కోర్టుకి ఎదురుగా గల మామిడి తోటలో నిర్వహించనున్నట్టు మండల ప్రధాన కార్యదర్శి దొడ్డాకుల రాజేశ్వరావు, అధ్యక్షులు, దొడ్డా రమేష్ ఆదివారం తెలిపారు. ఆ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి నామా నాగేశ్వరావు, నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త కోనేరు చిన్ని, ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాత మధు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, అశ్వరావుపేట నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, పార్టీ జిల్లా ముఖ్య నాయకులు హాజరౌవుతున్నారని తెలిపారు. కావునా మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరు కాగలరని కోరారు.

మెడికల్ కార్డు రెన్యువల్ చేసుకోవాలి : జీఎం

నవతెలంగాణ-ఇల్లందు/టేకులపల్లి



సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ మెడికల్ కార్డు కలిగి ఉన్న సింగరేణి మాజీ ఉద్యోగులు మెడికల్ కార్డు రెన్యువల్స్ వేసుకోవాలని ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ తెలిపారు. మాజీ ఉద్యోగుల భార్యలు మెడికల్ కార్డు రెన్యువల్ కోసం ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో లైవ్ సర్టిఫికేట్ సమర్పించడం జరుగుతుందని, కానీ దాదాపు 282 మంది మాజీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల భార్యలు గత నవంబర్ నెల నుండి ఇప్పటివరకు వారి మెడికల్ కార్డు రెన్యువల్ కోసం లైవ్ సర్టిఫికెట్ సమర్పించలేదని, దీనివలన వారి మెడికల్ కార్డు సేవలు నిలిపివేయబడ్డాయి అన్నారు. మెడికల్ కార్డు రెన్యువల్ కోసం లైవ్ సర్టిఫికెట్ సమర్పించని మాజీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల భార్యలు ఆన్లైన్ ద్వారా లైవ్ సర్టిఫికెట్ సమర్పించి వారి మెడికల్ కార్డును రెన్యువల్ చేసుకుని అత్యవసర వైద్య సేవలు పొందవలసిందిగా తెలిపారు.

పెద్దమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



నవతెలంగాణ-పాల్వంచ రూరల్

మండల పరిధిలోని జగన్నాథపురం శ్రీ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో విద్యార్థులు, పిల్లలు కుటుంబ సమేతంగా భక్తులు ఆలయానికి బారులు తీరారు. ఉమ్మడి ఖమ్మం పరిసర ప్రాంత ప్రజలే కాకుండా ఇతర జిల్లాల నుండి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకున్నారు. తమను చల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి సుదర్శన్ నేతృత్వంలో సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

రేపు దేవాలయంలో చండీ హెూమం

పౌర్ణమిని పురస్కరించుకొని మంగళవారం దేవాలయంలో చండీ హెూమాన్ని నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. హెూమంలో పాల్గొనే భక్తులు ముందుగా రూ.2516లు చెల్లించి, తమ గోత్ర నామములు నమోదు చేసుకోవాలని సూచించారు. హెూమంలో పాల్గొను భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించాలని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు సెల్ నం:9866923261, 6303408458లను సంప్రదించాలని కోరారు.

మోడీ ప్రభుత్వం కార్మిక, రైతు, విధానాలకు వ్యతిరేకంగా 138వ మేడే జరపాలి

నవతెలంగాణ-ఇల్లందు

కార్మిక వర్గము పోరాడి సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ చట్టాల్లో, 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ మార్చివేసి మిగతా 15 చట్టాలను అడ్రస్ లేకుండా బీజేపి, ప్రధాని మోదీ విధానాలకు వ్యతిరేకంగా 138వ మేడే జరపాలని భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్టియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ కోరింది. స్థానిక చంద్ర కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్ట్ భవనంలో ఆర్.మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కమిటీ ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఎఫ్టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గండమల్ల రామయ్య పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి, గోపాలరావు మల్లెల వెంకటేశ్వర్లు, పాయం వెంకన్న, సుందర్, శ్రీరాముల శేషయ్య, వేముల గురునాథం, మల్సూరు శాంతయ్య పాల్గొన్నారు.



మోకాళ్ళ గెలుపు కోరుతూ ప్రచారం

నవతెలంగాణ-టేకులపల్లి

మహబూబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి కామ్రేడ్ మోకాళ్ళ మురళి కృష్ణను గెలిపించాలని కోరుతూ మండలంలోని తూర్పుగూడెంలో కరపత్రాలతో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించినట్టు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం నూతన అర్థి సంరక్షణ నియమాలను తీసుకువచ్చి ఆదివాసీలను అడవుల నుండి గెంటి వేయడం కోసం ప్రయత్నం చేస్తుందన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టడం కోసం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలని రద్దు చేయాలని ఆందోళన చేసిన రైతులని నిర్దాక్షణంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం కాల్చి చంపిందన్నారు. కార్మిక హక్కులని కాలరాశి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని అన్నారు. నిత్యవసర ధరలు విపరీతంగా పెంచడంతో పేద, మధ్యతరగతి ప్రజలు మూడు పూటలా తినే పరిస్థితి లేదన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నిత్యావసర పంపిణీ వ్యవస్థ కూడా బాగోలేదన్నారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి వరాల జల్లులు కురిపించి ఒక్క హామీని కూడా నెరవేర్చే పరిస్థితి లేదని, సీతారామ ప్రాజెక్టు, రోళ్ళపాడు ప్రాజెక్టు, బయ్యారం ఇనుప కనీస ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టలేదన్నారు. కనీసం శంకుస్థాపన కూడా చేయలేదన్నారు. పీజీలు, డిగ్రీలు, పీహెచ్డీలు చేసి ఉద్యోగాలు లేని యువత చాలామంది ఉన్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే పరిస్థితి లేదన్నారు. బొగ్గు బావలని ఓపెన్ కాస్టల పేరుతో అడవులను నరికి వేస్తూ, పల్లెల్ని నాశనం చేస్తూ, ఉద్యోగాలు లేకుండా యువతని పెడదోవ పెట్టిస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా నాయకులు గుగులోత్ రామచంద్రు, నరసయ్య, మంగయ్య, ప్రసాదు, రాము, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎండిని చెట్టును తొలగించిన అధికారులు

నవతెలంగాణ-చర్ల



మండల పరిధిలోని తేగడ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఇటీవల కాలంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ మండల నాయకత్వం సందర్శించిందని పార్టీ మండల కార్యదర్శి కొండా కౌశిక్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని తెగడ గ్రామం ప్రైమరి స్కూల్లో ఒక పెద్ద వృక్షం పూర్తిస్థాయిలో ఎండిపోయి విద్యార్థులు వాడుతున్న బాత్రూం వైపు పూర్తిగా ఒరిగిపోవడం కారణంగా ఆ చెట్టును తక్షణమే తొలగించాలని స్థానిక అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే గ్రామపంచాయతీ కార్యదర్శి తోకల సురేష్ నిర్లక్ష్యం వహించకుండా స్పందించి విద్యార్థులు, స్కూలు సిబ్బంది పట్ల పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి ఆ ఎండిపోయిన చెట్టును తొలగించారు. చిన్నారుల ప్రాణాలకు రక్షణ కల్పించినటువంటి అధికారులకు మా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ తరపున పేరుపేరునా విప్లవ అభివందనాలు తెలుపుకుంటు న్నామని ఆయన అన్నారు.

24న మహబూబాబాద్ జనరల్ బాడీ సమావేశం

- జడ్పీటీసీ పోషం నరసింహారావు



మణుగూరు : ఏప్రిల్ 24న మహబూబాబాద్ లోక్ సభ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు జడ్పీటీసీ పోశం నరసింహారావు తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోరుతూ ఈ సమావేశం హనుమాన్ ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నమన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశానికి ప్రజ ప్రతిని ధులు, నాయకులు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాల న్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కురి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు ఎడవల్లి వెంకటయ్య, ఆర్.వెంకట్ రెడ్డి, జావిద్, వట్టం రాంబాబు, యాదగిరి గౌడ్, రమేష్, లక్ష్మణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో బీభత్సం

- ఈదురు గాలులు, మెరుపులు ఉరుములు
- విరిగిపడిన చెట్లు, విద్యుత్ అంతరాయం
- అంధకారంలో గూడెం

నవతెలంగాణ- కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షంతో పాటు, ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు వర్షం కురిసింది. గాలి వాన కలిపి రావడంతో బీభత్సం సృష్టించింది. వర్షంతో పాటుగా పెద్ద ఎత్తున గాలులు వీయడంతో భారీ చెట్లు,విద్యుత్ స్తంభాలు విరిగాయి. కొత్తగూడెం అంధకారం గా మారింది. రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులకు సంబంధించిన డబ్బాలు భారీ ఎత్తున వచ్చిన ఈదురు గాలికి కొట్టుకుపోయాయి. గాలి దుమారం బీభత్సం సృష్టించడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో గూడెం అంధకారంగా మారింది. చిమ్మ చీకట్లో వీధులు, ప్రధాన సెంటర్లు దర్శనమిచ్చాయి. ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ఎండాకాలంలో ఇంత పెద్ద గాలి దుమారం రావడంతో పాటు అల్లకోలోలం సృష్టించడం ప్రజలు భయాందోళనకు గురిచేసిందని చెప్పవచ్చు. వేసవి తగినంత అల్లాడుతున్న ప్రజలకు సేదతీరినట్లుంటుంది. రైతులకు భారీ ఎత్తున నష్టం కలిగించే విధంగా ఉంది.

మండలంలో గాలి బీభత్సం

- ఇబ్బందులు పడ్డ రైతులు



నవతెలంగాణ-మణుగూరు

మండలంలో గాలి దుమారం బీభత్సం సృష్టించింది. చెట్లు విరిగి ఇండ్లపైన, రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డాయి. కల్లాలలో ఆరబోసిన వడ్లు, మిర్చి గాలికి కొట్టకపోయాయి. సాంబాయిగూడెం గ్రామంలో పాఠశాల ఆవరణంలో మిర్చి, వడ్లు తడిసిపోయాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడింది. రేకుల ఇండ్లు గాలికి విరిగిపోయాయి. ఎండల కారణంగా వాతావరణం చల్లబడ్డా, రైతులకు, పేదలకు కన్నీళ్లు మిగిల్చింది వడగండ్ల వాన.

మండలంలో చిరుజల్లులు

అశ్వాపురం : మండలంలో ఆదివారం సాయంత్రం మూడున్నర గంటల నుండి చిరుజల్లులు పడ్డాయి. గతన వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు వేసవి తాపానికి అల్లాడిపోయారు. ఒక్కసారిగా వర్షం కురవడంతో జనం ఎండ బారి నుండి తప్పించుకున్నామని ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి మొత్తం ఇలాగే వర్షం నమోదైతే మరి కొంతకాలం వాతావరణం చల్లగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సత్ఫలితాలు ఇస్తున్న 'ఆపరేషన్ చేయూత'

సీపీఐ మావోయిస్టు పార్టీ మిలీషియా, కమిటీ సభ్యుల లొంగుబాటు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఛత్తీసగఢ్ రాష్ట్రం కిష్టారం పీఎస్ పరిధిలోని తెలంగాణ-ఛత్తీసగఢ్ సరిహద్దు గ్రామాలైన డోకుపాడు, పుట్టపాడు గ్రామాల నుండి నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీలో మిలీషియా డెప్యూటీ కమాండర్, కమిటీ సభ్యులుగా పనిచేస్తున్న ఆరుగురు వ్యక్తులు జిల్లా పోలీసులు, 141 బెటాలియన్ సిఆర్పిఎఫ్ అధికారుల సమక్షంలో ఆదివారం లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టు పార్టీ మిలీషియా, కమిటీ సభ్యుల వివరాలు.... 1.రవ్వ సన్న(31) తండ్రి మంగా, మిలిషియా సభ్యుడు, r/o డోకుపాడు
2. ముసికి సన్న ఏ శ్రీను(30) తండ్రి రామ, మిలిషియా సభ్యుడు, r/o డోకుపాడు
3.మడకం జోగా(45) తండ్రి కుమ్మ కమిటీ సభ్యుడు, r/o డోకుపాడు
4. కోవాసి మంగ(28) తండ్రి బుద్ర, మిలీషియా సభ్యుడు, r/o డోకుపాడు
5.రవ్వ లక్క(35) తండ్రి సోమ, కమిటీ సభ్యుడు, r/o డోకుపాడు
6.కర్టం పొజ్జా తండ్రి గంగా, మిలీషియా డెప్యూటి కమాండర్ r/o పుట్టపాడు.

పోలీస్ అధికారుల సమక్షంలో లొంగిపోయిన పై ఆరుగురు గత కొన్ని సంవత్సరాలుగా నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ మిలీషియా, కమిటీ సభ్యులుగా పని చేస్తూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన చర్ల ఏరియా కమిటీ, చత్తీస్గఢ్ రాష్ట్రానికి చెందిన కిష్టారం ఏరియా కమిటీ సాయుధ దళసభ్యులతో కలిసి తెలంగాణ చత్తీస్గఢ్ సరిహద్దు ప్రాంతంలో పలు విధ్వంసకర సంఘటనలు, పోలీసులను హత మార్చడానికి ఐఈడీ బాంబ్‌లు అమర్చిన పలు సంఘటనలలో పాల్గొన్నారు. కాలానుగుణంగా నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ సిద్ధాంతాల పట్ల విముఖత ఏర్పడి, తెలంగాణ-ఛత్తీస్గఢ్ రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధిని గుర్తిస్తూ, తమ ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కోసం గ్రామస్తులతో చర్చించి, నిర్ణయం తీసుకొని పోలీస్ అధికారులు ఎదుట లొంగిపోయారు. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 141 బెటాలియన్ సిఆర్పిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఆపరేషన్ చేయూత" కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 141 బెటాలియన్ సిఆర్పిఎఫ్ తెలంగాణ ఛత్తీస్గఢ్ సరిహద్దు గ్రామాలలో పర్యటిస్తూ నిర్వహించిన అవగాహన కార్యక్రమాల ద్వారా ఆకర్షితులై ఈ ఆరుగురు లొంగిపోయినట్టు పోలీసులు తెలిపారు. గత కొంతకాలంగా నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ ఆదివాసి ప్రజలలో ఆదరణ, నమ్మకం కోల్పోయి ఛత్తీస్గడ్ రాష్ట్రంలో అడవి ప్రాంతానికి మాత్రమే పరిమితమై, కాలం చెల్లిన సిద్ధాంతాలతో పాటుగా కమిటీలను ఏర్పాటు చేసి బలవంతపు వసూలే లక్ష్యంగా పనిచేస్తూ ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి ఉపయోగపడే రోడ్లను ధ్వంసం చేయడం, సెల్ఫోన్ టవర్లను కాల్చి వేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నట్టు పోలీసులు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందితే తమకు మనుగడ ఉండదని భావించి అమాయక ఆదివాసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటూ ఆదివాసి ప్రజల అభివృద్ధికి ఆటంకంగా మారిన నిషేధిత సిపిఐ మావోయిస్టు సభ్యులపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుంది. లొంగిపోయే దళ సభ్యులకు మిలీషియా సభ్యులకు జీవనోపాధి, పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరఫున అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించడానికి భద్రాచలం పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ పరితోష్ పంకజ్, కమాండెంట్ 141 బీఎన్‌సీఆర్‌పీఎఫ్ రితేష్ ఠాకూర్, ఇన్ కమాండెంట్ 141 బీఎన్‌సీఆర్‌పీఎఫ్ కమల్ వీర్ యాదవ్, రేవతి ఆర్జునన్, అసిస్టెంట్ కమాండెంట్ 141 బీఎన్‌సిఆర్‌పిఎఫ్, దుమ్ముగూడెం సీఐ బి.అశోక్, ఎస్సై పి.గణేష్, చర్ల సీఐ ఎ.రాజు వర్మ, తదితరులు పాల్గొన్నారు.

గాలి దుమారం



నవతెలంగాణ-చర్ల

వాతావరణంలో ఆకస్మికంగా జరిగిన మార్పులకు అనుగుణంగా చర్లలో గాలి దుమ్ము బీభత్సం ఏర్పడింది. ఆదివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం నల్లబడి గాలి దుమ్ముతో ఉరుములు, మెరుపులు వాతావరణం అంతా బీభత్సంగా తయారైంది. వర్షం రావడంతో భారీగా పిడుగులు పడ్డాయి. రాహుల్ విజ్ఞాన విద్యాలయం సమీపంలో కొబ్బరి చెట్టు విద్యుత్ వైర్ల మీద పడి సుమారు మూడు గంటల పాటు విద్యుత్ అసౌకర్యాన్ని కలిగించింది. ఒకపక్క రబీ పంటలు చేతికి వస్తున్న క్రమంలో గాలి దుమ్ము, వర్షంతో రైతుల్లో కొంత ఆందోళన కలిగించింది. సుమారు గంటపాటు అతలాకుతలం చేసిన గాలి దుమ్ము ప్రవేపి తగ్గు మొఖం పట్టడంతో రైతులు కొంత సంతోషించారు. విద్యుత్ శాఖ వారు యుద్ధ ప్రాతిపదికన కొబ్బరి చెట్టుని తొలగించి విధి సౌకర్యాన్ని పునరుద్ధించారు.

మంచినీరు లేక ప్రజలు అవస్థలు

- కాళీ బిందెలతో నిరసన



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు మండలం మున్సిపాలిటీ పరిధిలోని భగత్ సింగ్ నగర్ ప్రాంతంలో గత రెండు రోజులుగా మంచినీరు రాకపోవడంతో ఆగ్రహించిన మహిళలు ఖాళీ బిందువులతో నిరసన తెలియ జేశారు. రెండు రోజులుగా నీళ్లు రాకపోవ డంతో ప్రజలు ఆగ్రహించారు. ఆదివారం మహిళలు కాళీ బిందెలతో నిరసన తెలియ జేశారు. ఈ సందర్భంగా సందర్భంగా భగత్ సింగ్ నగర్ వాసులు మాట్లాడుతూ ఒకరోజు మంచినీళ్లు వస్తే రెండు రోజులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని మున్సిపాలిటీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పి నా పట్టించుకోలేదు అన్నారు. అధికారులు స్పందించి మంచి సమస్య తీర్చాలన్నారు. తాగేందుకు నీళ్ల లేక పిల్లలు, పెద్దలు విలవిలలాడుతున్నారని అన్నారు. రెగ్యులర్ కార్యక్రమాలకు కూడా నీళ్ల లేక బాధపడు తున్నామని మహిళల ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక మున్సిపాలిటీ అధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలన్నారు.

అకాల వర్షంతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న

నవతెలంగాణ-పినపాక

మండల వ్యాప్తంగా గాలివాన బీభత్సానికి చాలా ఇండ్లు, పంట చేసులు నేలమట్టం అవ్వడం బాధాకర విషయం అని సీపీఐ(ఎం) మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న అన్నారు. అకాల వర్షాలతో ఇల్లు కూలి, పైకప్పులు పడిపోయి నష్టపోయిన పేదలని, పంట నష్టపోయిన రైతులకు, మామిడి తోటల వారికి , ఇతర పంటను నష్టపోయిన రైతులకు తక్షణమే ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఇల్లులు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. మండల కమిటీ ఆధ్వర్యంలో బాధితులను పరామర్శించారు.



రోడ్డుకు అడ్డంగా పడ్డ వృక్షాలను తొలగించిన అధికారులు

అకాల వర్షంతో మండలంలో రోడ్డుకు అడ్డంగా వృక్షాలు, విద్యుత్ స్తంభాలు పడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎస్సై వెంకటప్పయ్య స్పందించారు. జేసీబీల సహాయంతో రోడ్డు అడ్డంగా పడ్డ వృక్షాలను తొలగించారు. ఎటు చూసినా అకాల వర్షం బీభత్సాన్ని సృష్టించింది. అధికారులు పూర్తిస్థాయిలో రోడ్లపైకి వచ్చి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

పురుగుమందు సేవించి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దమ్మపేట

పురుగుమందు సేవించి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అల్లిపల్లి గ్రామానికి చెందిన కలిదిండి మహేంద్రవర్మకు ఏలూరు జిల్లా భీమవరంకు చెందిన యువతితో 13ఏళ్ళ క్రితం వివాహం జరగ్గా వివాహం అనంతరం అక్కడే ఉంటున్నాడు. కాగా మూడేళ్ళుగా భార్యభర్తల మధ్య కొన్ని గొడవలు జరుగుతుండగా మహేంద్రవర్మ స్వగ్రామం అల్లిపల్లి ఐదు నెలల క్రితం వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఓ పొలం బేరానికి వెళ్ళగా బయట పల్సర్ బైక్ పెట్టి పొలంలోకి వెళ్ళిన మహేంద్రవర్మ విగతజీవిగా పడి ఉన్నాడు. ప్రాథమికంగా పురుగుమందు సేవించి మరణించినట్టు తెలుస్తుండగా, మృతుడి తల్లి, కుటుంబీకులు మాత్రం మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. తల్లి ప్రమీలారాణి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ రంగానికి ఆదర్శవంతుడు శ్రీనివాస్‌రావు

- టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే.జంగయ్య

నవతెలంగాణ - బోనకల్



గంగసాని శ్రీనివాసరావు ఉపాధ్యాయ రంగానికి ఆదర్శవంతంగా నిలిచాడని టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే జంగయ్య అన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో వైరా మండలం పాలడుగు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగసాని శ్రీనివాసరావు సంస్మరణ సభ జిల్లా కార్యదర్శి సుధాకర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. తొలుత శ్రీనివాసరావు చిత్రపటానికి కే.జంగయ్య, కుటుంబ సంక్షేమ నిధి రాష్ట్ర కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు రంజాన్, ఉద్దండు, షరీఫ్, గుగులోతు రామకృష్ణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో జంగయ్య మాట్లాడుతూ శ్రీనివాసరావు మరణం టీఎస్ యుటిఎఫ్‌కు తీరని లోటు అన్నారు. వృత్తి పట్ల అంకిత భావం కలిగిన వ్యక్తులు అరుదుగా ఉంటారని, అటువంటి వారిలో శ్రీనివాసరావు ప్రథమ స్థానంలో ఉంటారని కొనియాడారు. సిరిపురం పాఠశాలలో పనిచేస్తున్న సమయంలో ఒరిస్సా నుంచి వచ్చిన వలస కూలీల పిల్లలు కట్టుబట్టలు లేకుండా కొండల్లో గుట్టల్లో ఆడుకుంటుంటే వారిని పాఠశాలకు తీసుకువచ్చి విద్యాబుద్ధులను నేర్పించి ఆర్థికంగా ఆదుకున్న మంచి ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు అని కొనియాడారు. రాష్ట్రంలో టీఎస్ యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ నిధిని (ఎఫ్‌డబ్ల్యూఎఫ్)ను ఏర్పాటు చేసిందన్నారు. కుటుంబ సంక్షేమ నిధిలో సభ్యుడిగా ఉండి మృతి చెందిన ఉపాధ్యాయుడికి ఆ సంక్షేమ నిధి నుంచి తక్షణం ఆరు లక్షల రూపాయలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ నిధిని ఉపాధ్యాయ కుటుంబాల సంక్షేమం కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికీ ఈ సంక్షేమ నిధి ఏర్పాటు చేసిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది ఉపాధ్యాయులకు, మరో ఇద్దరికి కోటి 20 లక్షల రూపాయలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గంగసాని శ్రీనివాసరావు ఉపాధ్యాయ వృత్తిలో మహోన్నతమైన వ్యక్తి అని అన్నారు. శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మాట్లాడవలసి ఉందని, కానీ ఆయన సంస్మరణ సభలో మాట్లాడే పరిస్థితి రావడం చాలా బాధాకరమన్నారు.

కుటుంబ సభ్యులకు ఆరు లక్షల చెక్కు అందజేత

టీఎస్ యుటిఎఫ్ నూతనంగా ఏర్పాటు చేసిన కుటుంబ సంక్షేమ నిధి (ఎఫ్‌డబ్ల్యూఎఫ్) నుంచి ఆరు లక్షల రూపాయల చెక్కును మృతిని భార్య ప్రమేల, కుమారులు అన్వేష్, రాంకీలకు కే.జంగయ్య, రాజశేఖర్ రెడ్డి, పారుపల్లి నాగేశ్వరరావు, గుగులోతు రామకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ బోనకల్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, వైరా మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా టి.హనుమంతరావు, మధిర మండల నాయకులు టి ఆంజనేయులు, మధిర మండల ప్రధాన కార్యదర్శి ఎస్.వీరయ్య, మండల అధ్యక్షులు వినోద్‌రావు, ఆర్.లక్ష్మణరావు, ముదిగొండ ఎంఈఓ రామాచారి, వైరా ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మధిర, వైరా మండలాల నుంచి పెద్ద సంఖ్యలో సహచర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పలు వేడుకలకు దయాకర్‌రెడ్డి హాజరు



నవతెలంగాణ- ఖమ్మం

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి జిల్లాలో ఆదివారం పర్యటించారు. నగరంలోని మమత ఆస్పత్రి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరా డ్యాన్స్ స్కూల్‌ను ప్రారంభించారు. అనంతరం 59వ డివిజన్ దానవాయిగూడెంలో మద్దెల నారాయణ కుమారుడు, ఖమ్మంరూరల్ మండలం సాయిప్రభాత్ నగర్‌లోని చల్లపల్లి గార్డెన్స్‌లో తుమ్మ నాగచంద్రారెడ్డి కుమారుడు, మద్దులపల్లిలో తూమాటి నారాయణ కుమారుడు, ఖమ్మం నగరంలోని వాసవి గార్డెన్స్‌లో జబ్బారి రమణారెడ్డి కుమారుని పెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు. పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించి నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. అదే విధంగా కారేపల్లిలో ఇమ్మడి తిరుపతిరావు ఇంట్లో జరిగిన ఉప్పలమ్మ వేడుకలో, ఖమ్మం నగరంలోని 60వ డివిజన్ రామన్నపేటలో జరిగిన పంచెకట్టు వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | ఏప్రిల్ 22, 2024 | www.navatelangana.com



రాబోయే తరానికీ 'నెల నెల వెన్నెల' కార్యక్రమాలు అందాలి

• ప్రముఖ వైద్యులు కొలికొండ మహేంద్ర కుమార్

నవతెలంగాణ- ఖమ్మం

రాబోయే తరానికి కూడా నెల నెలా వెన్నెల లాంటి అద్భుతమైన కార్యక్రమాలు అందాలని ప్రముఖ వైద్యులు కొలికొండ మహేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నెల నెలా వెన్నెల 81వ నెల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహేంద్రకుమార్ మాట్లాడుతూ ఏ దేశమైన పురోభివృద్ధి సాధించాలంటే నాలుగు అంశాలు కీలకంగా ఉంటాయని, అవి మాతృభాష, ప్రకృతి, క్రమశిక్షణ, దేశభక్తి అన్నారు. వీటిని నెక్స్ట్ జనరేషన్‌కి వంట బట్టే లాగా మన పిల్లల్ని తర్ఫీదు చేసుకోవాలని, అందుకు ఇలాంటి నెలనెలా వెన్నెల కార్యక్రమం అద్భుతంగా ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్ మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతతో అనేక సంవత్సరాలుగా సాంస్కృతిక రంగంలో అనేక విధాలుగా కృషి చేస్తూ గత 81 నెలలుగా నిర్విఘ్నంగా దీక్షతో కొనసాగిస్తున్న నెలనెలా వెన్నెల నిర్వాహకుల కృషిని అభినందించారు. పోలా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు తమలాంటి వారి అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, నిర్వాహకులు అమరజీవి అన్న బత్తుల రవీంద్రనాథ్, కళా సంస్కృతిక సంస్థ అధ్యక్ష కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నావత్తుల సుబ్రహ్మణ్య కుమార్, కే..దేవేంద్ర, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ నాగబత్తిని రవి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు నామ లక్ష్మీనారాయణ, నందిగామ కృష్ణ, మారుతి కొండలరావు, చెరుకుమల్లి వెంకటేశ్వరరావు, శశిధర్, యాంకర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు .

విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని పెంపొందించేందుకే మోడల్ ఎంసెట్

నవతెలంగాణ-ఖమ్మం

అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్), తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంసెట్, నీట్ పరీక్షను రేపు జిల్లా వ్యాప్తంగా ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని పెంపొందించేందుకే మోడల్ టెస్టులు నిర్వహిస్తున్నట్టు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్లో ముఖ్య కార్యకర్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు బైపాస్ రోడ్ లోని గిరి ప్రసాద్ భవన్ (ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయం)లో, 8106146993, 9666680674, 9398191241, సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు జిల్లా సహాయ కార్యదర్శి శివ, వంశి, రాహుల్, హరికృష్ణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఆలయ నిర్మాణం

నవతెలంగాణ-సత్తుపల్లిరూరల్

సత్తుపల్లి ద్వారకపురి కాలనీ 7 వ వీధిలో నిర్మాణంలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆలయ ముఖ మండపం, గర్భాలయానికి స్లాబ్ పోశారు. త్వరలో ఆలయ నిర్మాణం పూర్తి చేసుకుని యంత్ర ప్రతిష్ఠాపన మహెూత్సవం జరపనున్నట్లు ఆలయ ట్రస్టు చైర్మెన్, కార్యదర్శి సోమిషెట్టి శ్రీధర్, ఉబ్బల వెంకటేశ్వరరావులు తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఆలయానికి వస్తు రూపేణ, నగదు రూపంలో దాతలు విరాళాలు ఇచ్చి సహకరించాలని ఆలయ నిర్మాణ పర్యవేక్షకులు ద్రోణం రాజు మల్లికార్జున శర్మ కోరారు. స్లాబ్ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంకు గాయత్రి మెస్ నిర్వాహకులు ఎం.నారాయణరావు, వల్లభ మిల్క్ సెంటర్ ములకలపాటి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో భోజనాలు వితరణగ అందజేయడం పట్ల ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థల దాత రాగల చంద్రారెడ్డి, ట్రస్ట్ వైస్ చైర్మెన్‌లు తోట కిరణ్, గాదె నాగు, కోశాధికారి రాగల రమేష్ రెడ్డి, విష్ణు రెడ్డి, గంద్ర విజయ సారధి రెడ్డి, వీరిశెట్టి ప్రవీణ్, కేశవ రెడ్డి, సూర్య ప్రకాష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ముత్తారంలో సీతారాముల పుష్పయాగం

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో ముత్తారం సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు బోర్రా వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో11 రకాల పూలతో సీతారాముల పుష్పయాగాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాలు 17న శ్రీరామనవమి పండగ సందర్భంగా సీతరాములోరి కళ్యాణం జరిగిన విషయం విధితమే. ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు బోర్రా వాసుదేవాచార్యులు తెలిపారు.

'బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాని మిత్ర పక్షాలను ఓడించండి'

నవతెలంగాణ-వైరాటౌన్

మళ్లీ మూడోసారి అధికారంలోకి రావాలని పార్లమెంట్ ఎన్నికలలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టాలని కుట్రలు పన్నుతున్నారని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ వైరా డివిజన్ కార్యదర్శి కే.అర్జునరావు విమర్శించారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఆదివారం వైరాలో లూయిహెన్రి మోర్గాన్ రచన "పురాతన సమాజం"పై జరిగిన స్టడీ సర్కిల్‌లో నిర్వహించారు. పార్టీ వైరా మండల కార్యదర్శి ఎలదండి బాబు అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్జున్‌రావు మాట్లాడారు. మోడీ అధికారంలో ఉన్న పది సంవత్సరాల పరిపాలనలో దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టారని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు బ్యాన్ చేశారని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ విధానంలో కూడా ఉద్యోగాలు కల్పించడం లేదని, దేశము తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమిలో అవినీతిపరులు హంతకులు, రేపిస్టులు, ప్రజావ్యతిరేకులు ఉండి పోటీ చేస్తున్నారని, ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. మైనారిటీలు ఆదివాసులు దళితులు పేద ప్రజలు కనీస ప్రజాస్వామ్య హక్కులు లేకుండా భయంకరమైన పరిస్థితులలో అభద్రత భావంలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రత్యామ్నాయం కమ్యూనిస్టు విప్లవకారులని ఆయన అన్నారు.

వల్లభిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో వల్లభి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1980 - 1981వరకు 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి, స్నేహపూర్వకంగా కలిశారు. 43ఏళ్ల విరామం తర్వాత కలిసి, పాఠాలు బోధించిన ఆచార్యులతో, ఒకే చోటకు చేరి ముచ్చట్లలో మునిగిపోయి, ఆనంద క్షణాలు, చదువుకునే రోజుల్లో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆనందాన్ని పంచుకున్నారు. ఆప్యాయతతో కలిసి భోజనాలు చేశారు. అనంతరం తమకు విద్య నేర్పిన గురువులను శాలువలతో ఘనంగా సన్మానించి మెమొంటోళ్ళ అందజేశారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెద్ది శేషగిరి, బీ.వెంకటేశ్వరరావు, అయినాల వీరయ్య, మలిశెట్టి బాబురావు, తిరుపతమ్మ, శైలజ, పద్మావతి, ఉపేందరరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-మధిర

మాటూరు పేట గ్రామంలో గొర్రెముచ్చు విజయరాజు ఆధ్వర్యంలో వేసవి దాటికి దాహం తీర్చేందుకు చలివేంద్రం నిమధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రంగా హనుమంతరావు రంగా అప్పారావు చేతుల మీదుగా ఆధి వారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు, నిడమానూరు వంశీకృష్ణ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దంకి రవికుమార్, నరసింహారావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

• ముమ్మరంగా ఓటర్ అవగాహన కార్యక్రమాలు

నవతెలంగాణ-వైరాటౌన్



ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్. వేణు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఆదివారం వైరా మున్సిపాలిటీలో ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100% ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా స్వీప్ మోడల్ అధికారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటర్ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల ప్రజలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలి

• కలెక్టర్ వీపీ.గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం

ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి.గౌతమ్ తెలిపారు. ఆదివారం నూతన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో సహాయ రిటర్నింగ్ అధికారులతో లోక్‌సభ సాధారణ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎన్నికల పనులు నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలన్నారు. మొదటి ర్యాండమైజేషన్ తదుపరి ఇవిఎం యంత్రాలు సంబంధిత అసెంబ్లీ సెగ్మెంట్ల స్ట్రాంగ్ రూంలకు తరలించినట్లు తెలిపారు . మే, 3, 4 తేదీల్లో ఇవిఎంల రెండో ర్యాండమైజేషన్, కమిషనింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇందుకై కమిషనింగ్ కోసం స్ట్రాంగ్ రూంకు దగ్గర్లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కమిషనింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియపై అభ్యర్థులకు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలో చేపట్టాలన్నారు. ఇవిఎంల రవాణాలో హమాలీలకు అసెంబ్లీ సెగ్మెంట్ తెలిసే విధంగా



టీ షర్టులపై స్టిక్కర్లు వేయించాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీని ఈ నెల 25 నుండి చేపట్టాలన్నారు. ఇంటింటికి పంపిణీ చేయాలని, బల్క్ పంపిణీ చేయరాదని ఆయన తెలిపారు. ఓటర్ స్లిప్పుల పంపిణీలో సెక్టార్ అధికారులు పూర్తిగా భాగస్వామ్యం అయి, పంపిణీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఓటర్ స్లిప్పులతో పాటు ఓటర్ హెల్ప్ లైన్, సి-విజిల్, ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించాలని, సి-విజిల్ డౌన్లోడ్ చేయించాలని ఆయన అన్నారు. పోలింగ్ తేదీ, సమయం తెలియజేస్తూ, పోలింగ్ స్టేషన్‌లకు వచ్చేలా ఓటర్లకు ఆహ్వానం పలకాలన్నారు. సెక్టార్ అధికారులకు వాహనాలు ఏర్పాటు చేసినట్లు, ఈ వాహనాలు సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రారంభించి, సెక్టార్ అధికారులకు అప్పగించాలన్నారు. బూత్ లెవల్ అధికారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. రెండు రోజుల్లో జిల్లాకు ఎపిక్ కార్డులు వస్తాయని, మరో రెండు రోజుల్లో ఎపిక్ కార్డుల బట్వాడా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మే 3 నుండి హెూం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఇందుకై సరిపోను టీముల ఏర్పాటు చేయాలన్నారు. హెూం ఓటింగ్ టీములకు శిక్షణ ఇవ్వాలన్నారు. పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ మే 3న ప్రారంభం అవుతున్నందున, దీనికి ముందు పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. రోజువారి హెూం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ భద్రపర్చుటకు, పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూంను తెరవడం, మూయడం చేసే సందర్భంలో అభ్యర్థులకు నోటీసులు ఇచ్చి వారి సమక్షంలో తెరవడం, మూయడం చేయాలన్నారు. విఎస్టి టీములని క్రియాశీలం చేయాలన్నారు. అనుభవజ్ఞులైన వీడియోగ్రాఫర్‌లను విఎస్టి టీములలో వినియోగించాలన్నారు. మేజర్ సభలు, కార్యక్రమాల్లో సహాయ వ్యయ పరిశీలకులు హాజరయ్యేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి, కనీస మౌళిక ససుపాయాలకల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో మంజూరు పనులు ఈ నెల 23లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మే నెల 1, 2, 6, 7 తేదీల్లో పోలింగ్ శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. క్రియాశీలకంగా ఉంటూ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, డిఆర్డీఓ సన్యాసయ్య, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోడేపూడి వైద్య శిబిరం విజయవంతం

• తీవ్ర ఎండల నేపథ్యంలో

ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-వైరాటౌన్



తీవ్ర ఎండల నేపథ్యంలో వివిధ రకాల అనారోగ్యాలకు గురి అయ్యే అవకాశం ఉన్న ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బోడేపూడి కళానిలయం సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు, ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి అన్నారు. ప్రతి నెల మూడోవ ఆదివారం వైరా సిపిఎం కార్యాలయంలో జరిగే బోడేపూడి కళానిలయం వైద్య శిబిరం వరుసగా 106 నేల ఏప్రిల్ 21 ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు, డాక్టర్ చీకటి భారవి మాట్లాడుతూ ఈ వేసవిలో ఏప్రిల్ ప్రారంభం లోనే 44-45 సెంటిగ్రేడ్ వేడి నమోదు అవుతుందని, మే నెలలో వేడి గాలులు బలంగా ఉండే అవకాశం ఉంటుందని హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో షుగర్, బీపీ ఇతర అనారోగ్య సమస్యలు ఉన్న ప్రజలు తగు జాగ్రత్తలతో ఉండాల్సిన అవసరం ఉందని, ఉదయం 10 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో ఎండలోకి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని సూచించారు. తగినన్ని మంచినీళ్ల రోజువారి తీసుకోవాలని, అనారోగ్య సమస్యలు దీర్ఘకాలం వేధించే దానికంటే ముందు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చీకటి భారవి తోపాటు డాక్టర్ జట్ల రంగారావు, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, బొంతు సమత, మాదినేని రజినీ, గుడిమెట్ల మోహన్ రావు, మల్లెంపాటి ప్రసాదరావు, కోటా ప్రేమ్ కుమార్, పుప్పాల నాగరాజు, కంభంపాటి సత్యనారాయణ, పూనాటి సూరయ్య మాదినేని ఉదయ్, యనమద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి సంత తనిఖీ

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లిలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారాంతపు సంతను ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కారేపల్లి సంతలో కొనుగోలు చేసిన 80 మేకలను ఆంధ్రప్రదేశ్ లోని అనకాపల్లికి బొలెరో వాహనంలో తరలిస్తుండగా ఆ వాహనాన్ని ఆపి సంత రసీదులు(రకం)లను పరిశీలించారు. వాహనంలో 80 మేకలు ఉండగా కేవలం 23 మేకలకు మాత్రమే రకం రసీదులు ఉండటంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా శాల్తీలకు డీసీ జరిమానా విధించారు. మరో ఆటోలో 16 శాల్తీలు తరలిస్తూ, కేవలం 4 శాల్తీలకు మాత్రమే రశీదులు ఉన్నాయి. మిగతా వాటికి సంబంధించి యజమానులకు జరిమానా విధించారు.

సిబ్బంది పై డీసీ ఆగ్రహం

కారేపల్లి సంతలో జరుగుతున్న క్రయవిక్రయాలకు సంబంధించి నామ మాత్రంగా రశీదులు ఉండటం పై డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు సంత నిర్వహణ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరోజు తనిఖీల్లోనే ఇంత పెద్ద మొత్తంలో రశీదులు లేకుండా పశువులు, మేకలు, గొర్రెలు తరలిపోవడం చూస్తుంటే పెద్ద మొత్తంలో సంతకు ఆదాయం గండిపడుతుందన్నారు. సంత చుట్టు ఫెన్సింగ్ లేకపోవటం, అరకొర సిబ్బందితో సంత నిర్వహణ కష్ట సాధ్యంగా మారిందని డీసీ దృష్టికి సిబ్బంది తీసుకువచ్చారు. డిప్యూటీ కమిషనర్ వెంట దేవాదాయ ఇన్‌స్పెక్టర్ సమత, ఈవో నల్లమోతు శేషయ్య ఉన్నారు.

వడదెబ్బ నివారణ మందు పంపిణీ

నవతెలంగాణ-కారేపల్లి



వేసవీ ఎండల తీవ్రతతో వడదెబ్బ నుండి రక్షించుటకు హెూమియోపతి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ సారధ్యంలో కారేపల్లి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు వడదెబ్బ నివారణ ఉచిత హెూమియోపతి మందులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ పరికిపండ్ల మాట్లాడుతూ పత్రిక మిత్రులు వృత్తిరీత్యా ఎండలో తిరుగుతున్నప్పుడు సరైన జాగ్రత్తలు పాటించాలని, అస్వస్థత కలిగితే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లాలని అశ్రద్ధ చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఏపూరి లక్ష్మీనారాయణ, కోశాధికారి పాలిక శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఫ్రీడమ్ పార్కులో నిర్మాణ వ్యర్థాలను తొలగించాలి

• సీపీఐ(ఎంఎల్) మాస్ లైఫ్ జిల్లా

కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని గట్టయ్య సెంటర్‌లో కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో ఫ్రీడం పార్కులో నెల రోజులుగా వాకింగ్ ట్రాక్ పై ఉన్న నిర్మాణ వ్యర్థాలను తొలగించకపోవడం కారణంగా వాకర్స్ క్రీడాకారులు అనేక అసౌకర్యాలు గురవుతున్నారని, తక్షణమే వాకింగ్ టాక్ లో అడ్డంగా కుప్పలుగా పోసిన మట్టి, రాళ్ల కుప్పలను తొలగించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైఫ్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్ కోరారు. ఆదివారం మాస్ లైన్ ప్రతినిధి బృందం ఫ్రీడం పార్కును సందర్శించి అడ్డంగా ఉన్న నిర్మాణ వ్యర్థాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు పక్కనే గల బిల్డింగ్ మూత్రశాల నిర్మాణం కోసం నెల రోజుల క్రితం సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం కోసం తవ్విన మట్టి రాళ్ళను పార్కులో కుప్పగా పోసారని పర్క్ పూర్తయినప్పటికీ దారికి అడ్డంగా ఉన్న రాళ్ల రప్పలు మట్టిని కాంట్రాక్టు తొలగించకపోవడం సరికాదని ఆయన అన్నారు. తక్షణమే అధికారులు కలగజేసుకొని ఫ్రీడమ్ పార్కులో వాకర్ క్రీడాకారులకు అసౌకర్యం కలిగిస్తున్న వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నాయకులు కొల్లేటి నాగేశ్వరరావు, కే. శ్రీను, ఆజాద్, శోభ, భరత్, రాకేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయడం లేదు

• ఖమ్మం పార్లమెంటు అధ్యక్షులు

వాసిరెడ్డి రామనాథం

నవతెలంగాణ-ఖమ్మం



తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయట్లేదని ఖమ్మం పార్లమెంటు అధ్యక్షులు వాసిరెడ్డి రామనాథం తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. తొలుత కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమికి మన సహకారం కాంగ్రెస్‌కు అందించాం ప్రతిఫలంగా ప్రస్తుత కాంగ్రెస్ మంత్రులు కార్యాలయానికి వచ్చి కృతజ్ఞతలు తెలియజేయడం అభినందనీయ మన్నారు. జరగబోయే ఎన్నికల్లో కూడా ఏ పార్టీ అయితే మన స్నేహం కావాలని కార్యాలయానికి వస్తారో వారి విజయానికి సహకరిద్దామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా తెలుగుదేశం పార్టీ పూర్వవైభవాన్ని పుంజుకుంటుందని అన్నారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ఉపాధ్యక్షులు మల్లాది హనుమంతరావు, కొండబాల కర్ణాకర్, మల్లెంపాటి అప్పారావు, చుండూరు రాజేశ్వరి, వాసిరెడ్డి భాస్కర్‌రావు, మేడిపల్లి రాణి, కత్రం స్వామి, బీపీ రాఘవులు, పసలం వెంకటేశ్వర్లు, పోటు సరస్వతి, మందపల్లి రజిని, ఆర్ఎం రామయ్య, తాళ్లూరి అప్పారావు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో వర్ష బీభత్సం

రోడ్లపై పడిన చెట్లు తెగిన కరెంటు వైర్లు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులు, గాలి దుమారంతో వర్షం పడింది. గాలి దుమారానికి రహదారులపై చెట్లు పడ్డాయి. ఇండ్ల పైన రేకులు లేచిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా అంతరాయం కలిగింది. దీంతో కారేపల్లి క్రాస్ రోడ్-ఇల్లందు, కారేపల్లి క్రాస్ రోడ్ -కారేపల్లి ప్రధాన రహదారి మధ్య చెట్లు పడిపోవడంతో రాకపోకలు నిలిచాయి. ఎస్సై రాజారాం ఆధ్వర్యంలో పోలీసులు జేసీబీలతో తొలగించారు.

రాముని పేరుచెప్పి ఓట్లడగటం సిగ్గుచేటు

• సీపీఐ జిల్లా నాయకులు ఆదినారాయణ

నవతెలంగాణ-సత్తుపల్లి

పేదలకు కూడు, గూడు, ఉపాధి చూపించలేని ప్రధాని మోడి మళ్లీ అధికారంలోకి రావడానికి రాముని పేరు చెప్పుకొని ఓట్లడగటం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ విమర్శించారు. సత్తుపల్లి మండలం చెరుకుపల్లిలో ఆదివారం జరిగిన ఆ పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆదినారాయణ మాట్లాడారు. 10యేండ్లుగా అధికారం చెలాయిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలకు కూడు, గూడు, ఉపాధి చూపించడంలో పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో నరేంద్రమోడీ ప్రధాని అయ్యాక పేదలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. కేవలం అంబానీ, అదానీల కోసమే రూ. లక్షల కోట్లు కట్టబెట్టి దేశాన్ని రూ. లక్షల కోట్ల అప్పుల్లో ముంచిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల ద్వారా అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలను ఒనగూర్చలేదన్నారు. మళ్లీ అధికారంలోకి రావడానికి రాముని పేరుని వాడుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కమిటీ సభ్యులు తాటి వీరభద్రం, తాటి కుమారి, తాటి చిన్న వీరభద్రం, మహిళా సమాఖ్య నాయకురాళ్లు ఎస్కే రంజాన్‌బీ , తాటి రాజమ్మ, గడ్డం వెంకటేశ్, తాటి రాధ, తాటి రమేశ్, తాటి నాగేంద్ర, రత్తాలు, గడ్డం నాగలక్ష్మి, దారం రాజమ్మ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు పేదలందరికీ అమలు చేయాలి

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అర్హులైన వారందరికీ తక్షణమే అందించాలని, ఇందులో రేషన్ కార్డులు, గృహ నిర్మాణం వెంటనే మంజూరు చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా నాయకులు కోలేటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం లోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్టడీ సర్కిల్ కన్వీనర్ రాయల రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కోలేటి నాగేశ్వరావు మాట్లాడుతూ రేషన్ కార్డులు కూడా ప్రజలకు అందకపోవటం వలన, రేషన్ కార్డులలో పేరు తొలగిపోయినటువంటి ప్రజలు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నరేంద్ర మోడీ నియంత్రత విధానాలను ఓడించాలంటే ప్రజలందరూ కూడా ఐక్యమై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ స్టడీ సర్కిల్‌లో పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ, జిల్లా నాయకులు కే శ్రీనివాస్, పిడిఎస్యు రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, పార్టీ డివిజన్ నాయకులకు కేలోతు లక్ష్మణ్, పిఓడబ్ల్యు జిల్లా సహాయ కార్యదర్శి శోభ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

నవతెలంగాణ-కల్లూరు

కరీంనగర్‌కు చెందిన లారీ డ్రైవర్ ఖలీల్ అనకాపల్లి నుండి లోడుతో కరీంనగర్ వెళుతూ కల్లూరులోని ఎన్ఎస్పీ క్రాస్ రోడ్ వద్ద ఉన్న భోజనం హెూటల్ దగ్గర లారీ ఆపి దిగుతుండగానే కళ్ళు తిరుగి కింద పడిపోయాడు. అదే సమయంలో ఖాన్‌ఖాన్ పేటకు చెందిన భానోత్ రవికుమార్, కళ్యాణ్ సింగ్ రాథోడ్, బోస్ వెంటనే వెళ్లి లారీ డ్రైవర్‌ని పట్టుకున్నారు. అప్పటికే స్పృహ తప్పడంతో ప్రాథమికంగా గుండెలపై ఒత్తి శ్వాస తిరిగి వచ్చే విధంగా చేశారు. ఈలోగా అక్కడ ఉన్న పదిమంది అంబులెన్స్ కోసం ప్రయత్నించినప్పటికీ కనీస స్పందన లేదు. దీంతో అక్కడున్న వారే ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడికి వెళ్లేసరికి అక్కడ డాక్టర్ లేకపోగా అక్కడున్న నర్సు ఆదివారం ఎవరూ ఉండరు.. ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చారు...ప్రైవేట్ హాస్పిటల్ తీసుకెళ్లండి అంటూ సమాధానం చెప్పారు. ఈలోగానే ఆయన మృతి చెందాడు. అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం... సకాలంలో ఆసుపత్రికి వచ్చినప్పటికీ వైద్యుడు లేక సరైన వైద్యం అందక లారీ డ్రైవర్ మృతి చెందడంతో స్థానికులు వైద్యుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ 24 గంటపాటు వైద్య సేవలు అందించే ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ లేకపోవడం ప్రభుత్వం ప్రజలకు అందించే వైద్యం తీరుకు నిదర్శమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాధారణ రైల్వే బోగీల పెంపుకు కోటి ఉత్తరాల కార్యక్రమం

నవతెలంగాణ-కారేపల్లి

ప్రతి రైలులో సాధారణ భోగీ ల సంఖ్యను ఐదుకు పెంచాలని సాధారణ భోగీల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త కోటి ఉత్తరాల కార్యక్రమం ఆదివారం కారేపల్లిలో నిర్వహించారు. ఐదు సాధారణ భోగీల సాధన కోసం ప్రధానమంత్రికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాల ఉద్యమాన్ని గాంధీ మార్గంలో ప్రారంభించినట్లు సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు.జనరల్ బోగీల్లో ప్రయాణం దయనీయంగా మారిందన్నారు. ఈ అంశాన్ని భారతదేశంలోని ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా - టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్, 152 సౌత్ బ్లాక్, రైసినా హిల్స్ ,న్యూఢిల్లీ-110011. చిరునామాకు ఉత్తరం రాసి పంపాలని కోరారు. వివరాలకు 9989310141 లలో సంప్రదించాలని తెలిపారు.



మతోన్మాద బీజేపీని ఓడించాలి

- ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు

నవతెలంగాణ-నిర్మల్

ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం మతోన్మాద బీజేపీని ఓడించి, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు అన్నారు. ఆదివారం సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హీరా ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పార్లమెంటు ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాటాడారు. 10 ఏండ్ల బీజేపీ పాలనలో కార్పొరేట్, మతోన్మాద విధానాలు బలపడ్డాయని, వాటికి వ్యతిరేకంగా దేశంలో పోరాడింది వామపక్షాలేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం గుజరా త్‌లో 15 శాతం పైగా పేదరికం పెరిగగా, కేరళలో 0.7శాతం లోపలే ఉందని వెల్లడించారు. ఈ కేరళ మోడల్ నేడు దేశానికి అవసరం అని అన్నారు. శ్రమజీవులైన వ్యవసాయ కార్మికులు, రైతాంగం, కార్మికులు, కౌలు రైతులకు మేలు జరగాలంటే తిరిగి వామపక్ష అభ్యర్థులను గెలిపిం చుకోవడం వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. పార్లమెంట్‌లో వామపక్ష పార్టీలు లేకపోవడంతో.. రైతుల నల్లచట్టాలు, నూతన జాతీయ విద్యావి ధానం, లేబర్ కోడ్లు, సీఏఏ లాంటి ప్రజా వ్యతిరేక చట్టాలను బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిందని అరన్నారు. యూపీఏ ప్రభుత్వంలో కమ్యూనిస్టులు భాగస్వామ్యమయినప్పుడు పార్లమెంట్‌లో ప్రజా అనుకూల చట్టాలు చేయించి, ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పని చేశాయని తెలిపారు. అందుకే దేశ ప్రయోజనాల కోసం ఇండియా కూటమి అభ్యర్థులను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిం చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మెన సురేష్, సుజాత, జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, తొడసం శంభు, ఇప్ప లక్షణ్, నిర్మల్ పట్టణ కార్యదర్శి ఫసియుద్దిన్, నాయకులు నాగెల్లి నర్సయ్య, పోశెట్టి, వెస్లీ, నవీన్, ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణంతో సమస్యలన్నీ పోయాయా?



- మార్కెట్ చేసుకుని మోడీ లీడరయ్యారు
- రాహుల్‌గాంధీ ఓ ఫైటర్ :విలేకర్ల ఇష్టాగోష్టిలో జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అయోధ్య రామాలయ నిర్మాణంతో దేశంలోని సమస్యలన్నీ పోయాయా? అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి బీజేపీ నేతలను ప్రశ్నించారు. గుళ్లు కడితే ఉద్యోగాలు వస్తాయా?అని నిలదీశారు. సోషల్ మీడియాను మార్కెటింగ్ చేసుకుని మోడీ లీడర య్యారని ఎద్దేవా చేశారు. మోడీ ఎక్కడా పోరాటం చేయలేదనీ, ఆయన సీల్డ్ కవర్‌లో గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యారని విమర్శిం చారు. రాహుల్‌గాంధీ ఫైటర్ అనీ, ఆయనకు మోడీకి పోలికే లేదన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాముడి ఆదర్శాలను నిలబెట్టే వ్యక్తి రాహుల్ గాంధీ మాత్రమేనని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. పేదల కోసం రాముడు పాలన చేశారని గుర్తు చేశారు. అయోధ్య గుడి నిర్మిస్తే తాను సంతోషిస్తానంటూ రాముడు అన్నారా? అని బీజేపీ నేత లను ప్రశ్నించారు. ఆ పార్టీ నేతలు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, బండి సంజయ్‌లు రాజకీయంగా బతకాలంటే, జై శ్రీరామ్ అనకతప్పదని ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ చరిత్ర తెలియని బీజేపీ నేతలు ఆయన రాజకీయ జీవితం మీద వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజకీయాలు రాహుల్ గాంధీ, ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చుట్టే తిరుగుతున్నాయని తెలిపారు. బీజేపీ సీని యర్ నేత ఎల్‌కే అద్వానీ రథయాత్రకు ముందు దేశానికి, గుజరా త్‌కు మోడీ ఎవరో కూడా తెలియదన్నారు. ఆ యాత్ర పూర్తి అయ్యాక.. గుజరాత్ ఎన్నికల్లో మోడీ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అద్వానీ సీల్డ్ కవర్‌లో ఆయన్ను సీఎంగా ప్రకటించారని గుర్తు చేశారు. ఇది నిజం కాదని బీజేపీ నేతలు చెప్పగలరా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కూడా చాలా రాష్ట్రాల సీఎంలను సీల్డ్ కవర్‌లో డిసైడ్ చేశార న్నారు. కానీ సీఎంలను డిసైడ్ చేసే రాహుల్ గాంధీకి, సీల్డ్ కవర్ సీఎం మోడీకి చాలా తేడా ఉందని చెప్పారు. మోడీ ప్రధాని కాకముందు ఏ పోరాటం చేశారో బీజేపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన అధికారం కోసం మాత్రమే రాజకీయాల్లోకి వచ్చిన నాయకుడు కానీ ప్రజల నుంచి వచ్చిన లీడర్ రాహుల్ గాంధీ అని ఈ సందర్భంగా జగ్గారెడ్డి వివరించారు.

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం



నవతెలంగాణ-గణపురం

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలం కర్కపెల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా పరకాల పరిధికి చెందిన వివాహిత పల్లెబోయిన శ్రావణి గణపురం మండలం కర్కపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా నాలుగేండ్లుగా విధులు నిర్వహిస్తోంది. మండలంలోని గాంధీనగర్‌లో కిరాయి ఇంట్లో తన భర్త, పాప, బాబుతో కలిసి జీవనం సాగిస్తోంది. కాగా శ్రావణి భర్త ములుగు జిల్లా పరిధిలో ఓ ప్రయివేట్ కంపెనీలో పని చేస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే కిరాయికి ఉంటున్న ఇంట్లోనే శ్రావణి ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన కుటుం బీకులు ఆమెను వరంగల్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. కాగా కర్కపల్లి గ్రామంలో శ్రావణికి మంచి పేరుంది. నిరుపేద కుటుం బానికి చెందిన శ్రావణి ఆత్మహత్యాయత్నానికి ఆర్థిక ఇబ్బందులా..? లేక పని ఒత్తిడా..? తెలియాల్సి ఉంది.

యథేచ్ఛగా 'బైరెటిస్' అక్రమ దందా !

రాత్రి పూట తరలింపు.. అధికారుల నిర్లక్ష్యం
ప్రభుత్వ ఆదాయానికి గండి



నవతెలంగాణ-గార్ల

మహబూబాబాద్ జిల్లాలోనే ప్రాధాన్యత సంతరించుకున్న తెల్లరాయి (బైరెటిస్) ఖనిజం నిల్వ ఉన్న ప్రాంతం గార్ల మండలం. మండల కేంద్రానికి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో బాలాజీ తండా, కోట్యానాయక్ తండా పంచాయతీల సమీపంలో సుమారు 1000 ఎకరాల్లో తెల్ల రాయి ఖనిజం నిల్వ ఉన్న అటవీ ప్రాంతం. కొన్ని దశాబ్దాల కాలం పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన కొందరు పెత్తందార్లు.. కొంతమంది గిరిజనులను బినామీలుగా చూపి నాటి ప్రభుత్వం అండదండలతో బైరెటిస్ తవ్వకాలు ముమ్మరంగా జరిపి కోట్ల రూపాయలు దండు కున్నారు. ఈ ఖనిజాలు నిల్వ ఉన్న ప్రాంతం అటవీ శాఖ పరిధిలో ఉందని, తవ్వకాలకు అటవీశాఖ అనుమతులు లేవని 12 ఏండ్ల కిందటే అనుమతులు నిలిపివేశారు. ఈ క్రమంలో గతంలో తవ్వకాలు జరిపి నిల్వ ఉన్న బైరెటిస్ రాళ్లను తరలించకుండా, అక్రమ రవాణాకు వీలు లేకుండా అటవీశాఖ అధికారులు ట్రెంచ్ కొట్టించడం వంటి నియంత్రణా చర్యలు చేపట్టారు. కానీ, బైరెటిస్ రాళ్లను గతంలో లీజుకు తీసుకున్న సమయంలో సబ్ కాంట్రాక్టర్‌గా పని చేసిన ఓ కీలక వ్యక్తి.. రాజకీయ పార్టీ నాయకులు, సంబంధిత శాఖ అధికారుల అండదండలతో రాత్రి సమయంలో గుట్ట రాళ్లను ఖమ్మంలోని ఓ ప్రాంతానికి ట్రాక్టర్లు, లారీల ద్వారా మూడో కంటికి కనిపించకుండా అక్రమంగా రవాణా చేస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం. బైరెటిస్ రాళ్లను తరలించడానికి వీలులేదని అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెప్పు తున్నారు. కానీ 40-50 కిలోమీటర్ల దూరం నుండి ట్రాక్టర్లు, లారీలు అర్ధరాత్రులు బైరెటిస్ గుట్ట ప్రాంతానికి వచ్చి పట్టు పడుతుండటంతో ప్రభుత్వ అధికారుల పాత్రపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని ఘటనలు...

గతేడాది లారీలో అక్రమంగా బైరెటిస్ రాళ్లను తరలిస్తున్న లారీని స్థానిక పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి భూగర్భ గనుల శాఖ అధికారులకు అప్పగించారు. సంబంధిత అధికారులు జరిమానా విధించగా సదరు అక్రమదారులు చెల్లించడం గమనార్హం. ఇటీవల రాత్రి సమయంలో బైరెటిస్ గుట్ట నుంచి తెల్ల రాయిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరు మధ్యలోనే మరమ్మతులకు గురి కాగా మార్గమధ్యలోనే తెల్ల రాయిని దిగుమతి చేసిన ఘటన ఉంది. కొన్ని నెలల క్రితం బైరెటిస్ రాళ్లను అక్రమంగా తరలించేందుకు అర్ధరాత్రి బైరెటిస్ గుట్ట వైపు వెళ్తున్న ఓ ట్రాక్టర్.. పినిరెడ్డిగూడెం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా ఖమ్మంకు చెందిన ట్రాక్టరని తేలింది. అసలు అర్ధరాత్రి వేళ ఖమ్మం నుంచి ట్రాక్టరు ఎందుకు వచ్చిందని సమీప ప్రాంతాల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బైరెటిస్ రాళ్లను తరలించేందుకు వచ్చిన ఖమ్మం, మరిపెడకు చెందిన రెండు ట్రాక్టర్లను పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు. బైరెటిస్ రాళ్ల అక్రమ రవాణా జరుగుతుందనడానికి ఈ ఘటనలన్నీ నిదర్శనంగా నిలుస్తున్నాయి. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులతో సహ కొందరు నాయకులు క్షేత్ర స్థాయిలో బైరెటిస్ రాళ్ల నిల్వను పరిశీలించి అక్రమదార్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫారెస్ట్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలి



బైరెటిస్ రాళ్లను అక్రమంగా తరలించకుండా అటవీశాఖ అధ్వర్యంలో ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసి, రెగ్యులర్ వాచర్‌ను ఏర్పాటు చేసి తెల్లరాళ్ల అక్రమ రవాణాను నియంత్రించాలి. అక్రమదారులపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి. ఇదే విషయం మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-మాళోత్ వెంకట్‌లాల్, మాజీ ఎంపీపీ

పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలి



కొన్నేండ్లుగా అక్రమార్కులు సంబంధిత శాఖల అధికారుల అండదండలతో రాత్రి వేళల్లో తెల్లరాయి ఖనిజాన్ని యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తూ లక్షలు గడిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. రాయి తరలిస్తున్న వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నా.. పోలీసు శాఖకు అటవీ, రెవెన్యూ శాఖలు పూర్తిగా సహకరించి పూర్తి స్థాయిలో బైరెటిస్ అక్రమ రవాణాను నియంత్రించాలి.

-కందునూరి శ్రీనివాస్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి

హెచ్‌సీయూలో అకడమిక్ వాతావరణాన్ని ఏబీవీపీ విచ్ఛిన్నం

- మద్యం మత్తులో విద్యార్థులపై దాడి.. ఎస్ఎఫ్ఐ దాడిచేసినట్టు చిత్రీకరణ
- పోలీసులు నిష్పక్షపాత విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి
- తక్షణమే అడ్మినిస్ట్రేషన్ స్పందించి దోషులను రస్టికేట్ చేయాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి.నాగరాజు



నవతెలంగాణ-ముషీరాబాద్

ఏబీవీపీ నాయకులు హెచ్‌సీయూలో అకడమిక్ వాతావరణాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని, మద్యం మత్తులో విద్యార్థులపై దాడి చేసి, గాయాలు చేసుకొని ఎస్ఎఫ్ఐ దాడిచేసినట్టు చిత్రీకరిస్తున్నారని, పోలీసులు నిష్పక్షపాత విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి.నాగరాజు డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏబీవీపీ దాడిలో గాయపడిన విద్యార్థులు మెహిత్, ఆషిక, ఖాయినీ, ఫైజల్‌తో వారు పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ 13న ఎకనామిక్స్ డిపార్టుమెంట్స్ ఫేర్వెల్ పార్టీ జరుగుతున్న సందర్భంలో ఏబీవీపీకి చెందిన కొందరు మద్యం మత్తులో అల్లరి చేస్తూ పాటల విషయంలో గొడవ చేస్తుంటే విద్యార్థులు అడ్డుకున్నారు. ఈ ఘటనలో వికలాంగుడైన స్కాలర్‌పై అకారణంగా దాడి చేశారు. ఈ దాడిని అడ్డుకునే ప్రయత్నం చేశారనే అక్కసుతో తిరిగి 17వ తేదీన తన రూమ్‌లోకి వెళ్తున్న ఫైజల్ అనే విద్యార్థిపై విచక్షణా రహితంగా దాడి చేసి, గొంతు నులిమి బెదిరింపు లకు పాల్పడ్డారని తెలిపారు. జేఎన్‌యూలో నజీబ్ అనే విద్యార్థి అదృశ్యమైన ఘటనను గుర్తుచేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏబీవీపీ నాయకులు విద్యార్థులను బెదిరింపులకు గురి చేయటం, జే హాస్టల్స్ దగ్గర దాడి చేస్తుంటే అడ్డుకున్న ఇతర విద్యార్థులపై కూడా మద్యం సేవించి హాకీ స్టిక్స్‌తో దాడి చేయటం, అమ్మాయిలు దాడులను అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిని లైంగిక వేధింపులకు గురిచేయడం లాంటి ఘటనలు యూనివర్సిటీలో చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ దాడిలో 10 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఈ అంశాలను పోలీసుల దృష్టికి తీసుకెళ్ళినా.. వారు సరిగ్గా విచారణ చేయకుండా రెండు గ్రూపుల మధ్య ఘర్షణగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరిపై కేసులు అంటూ బైండోవర్స్ చేస్తున్నారని, పోలీసులు ఈ ఘటనలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కొన్నేండ్లుగా యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐని ఎన్నికల్లో విద్యార్థులు గెలిపిస్తూ ఆదరిస్తున్నారనే అక్కసుతో సాధారణ విద్యార్థులపై ఏబీవీపీ వాళ్లు దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఏబీవీపీ వాళ్లను యూనివర్సిటీ అధికారులు హెచ్చరించి వారిని యూనివర్సిటీ నుంచి రస్టికేట్ చేయాలని, అప్పటివరకు పోరాడుతూనే ఉంటామని స్పష్టంచేశారు. ఏబీవీపీ చేస్తున్న ఈ చర్యలకు వ్యతిరేకంగా క్యాంపస్‌ను కాపాడుకునేందుకు విద్యార్థులు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు శివదుర్గారావు, హెచ్‌సీయూ విద్యార్థి అధ్యక్షులు అతీక్, కార్యదర్శి కృపాజార్జ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జూనుగరి రమేష్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ఏబీవీపీ మూకదాడులు ఆపాలి

- దోషులను శిక్షించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిట (హెచ్‌సీయూ)లో గత వారం రోజులుగా ఏబీవీపీ నాయకత్వంలో మూకదాడులు చేస్తున్నారనీ, విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏడుగురు విద్యార్థినులతో సహా, 20 మంది విద్యార్థులు వీరి దాడిలో గాయపడ్డారని తెలిపారు. ఇద్దరు విద్యార్థినులతో సహా ఆరుగురు ఆస్పత్రుల్లో చేరాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎన్నికల వాతావరణంలో సున్నితమైన అంశాలను ముందుకుతెచ్చి, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే ప్రయత్నంలో ఒక పథకం ప్రకారమే దాడులు చేస్తున్నారని తెలిపారు. ఈ దాడులను సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు తక్షణం విచారణ జరిపి దోషులను శిక్షించాలనీ, విద్యార్థులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈనెల 13న జరిగిన వీడ్కోలు వేడుకల్లో ఏబీవీపీ కార్యకర్తలు వికలాంగుడైన హర్షరాజ్‌పై దాడి చేయటంతో, ఎస్ఎఫ్ఐ ఇతర సంఘాల నాయకులు సర్దుబాటుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. అనంతరం 17న ఒక పథకం ప్రకారం ఎస్ఎఫ్ఐ కార్యకర్త ఫైజల్‌పై దాడి చేసి విద్యార్థులను గాయపరిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా, దాన్ని కూడా ఈ మూక అడ్డుకున్నదని తెలిపారు.

అమ్మాయిలను లైంగికంగా వేధించారనే విషయం వీడియోల్లో స్పష్టంగా కనబడుతోందని పేర్కొన్నారు. సమస్యను లోతుగా విచారణ జరపకుండా పోలీసు అధికారులు దీన్ని రెండు విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణగా చూడటమేంటని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం యూనివర్సిటీ లో ఘటనను వాడుకునేందుకే ఏబీవీపీ ఒక పథకం ప్రకారం చిచ్చుపెడుతున్నదని తెలిపారు. గాయపడినవారినీ, దాడి జరగకుండా నివారించే ప్రయత్నం చేసిన వారిని కూడా కేసుల్లో ఇరికించి వేధిస్తున్నారని పేర్కొన్నారు. దాడికి గురైన బాధితులను బైండోవర్ చేస్తున్నారనీ, పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారని తెలిపారు. పోలీసు అధికారులు వాస్తవాలు గమనించి, బాధితులను వేధించటాన్ని ఆపాలనీ, దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులపై బైండోవర్ కేసులు ఎత్తి వేయాలనీ, వేధింపులు ఆపాలనీ విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి

- కాకా ఆశయాలతో వస్తున్న అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను ఆశీర్వదించండి : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



నవతెలంగాణ-గోదావరిఖని:

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ మహాసభ, కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ సన్నాహక సభ ఆదివారం గోదావరిఖనిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కోల్ బెల్ట్ వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో కార్మిక లోకం బీఆర్ఎస్‌కి బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారని తెలిపారు. అదే విధంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను మరింత భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్థానికంగా ఉన్న పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ వెంకటస్వామి కాక ఆశయాలతో వస్తున్నారని, వారిని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సింగరేణికి కొత్త బొగ్గు గనుల ఏర్పాటు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొంతలరాజేష్‌తోపాటు కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరని మంటలు

- రష్యా ఆస్తుల స్వాధీనంపై పశ్చిమ దేశాలలో 'ఏకాభిప్రాయం లేదు' :వాషింగ్టన్ పోస్టు



యూరోపియన్ యూనియన్ అధికారులు అమెరికా ఒత్తిడికి తలొగ్గి స్తంభింపజేసిన రష్యన్ ఆస్తులను ఉక్రెయిన్‌కు బదిలీ చేయడానికి ఇష్టపడటం లేదు. అందుకు ప్రతీకారంగా రష్యా ప్రధానంగా అమెరికా కంటే యూరోపియన్ యూనియన్‌ని లక్ష్యంగా చేసుకుంటుందనే భయం వారికి ఉందని శనివారం వాషింగ్టన్ పోస్ట్ రాసింది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యాపై విధించిన అత్యంత కఠినమైన ఆంక్షలలో భాగంగా స్తంభింపజేసిన దాదాపు 300 బిలియన్ల రష్యన్ ఆస్తులను ఉక్రెయిన్‌కు సహాయం చేయడానికి ఉపయోగించవచ్చని చాలా మంది పాశ్చాత్య అధికారులు సూచించారు. ఈ మొత్తంలో ఎక్కువ భాగం ఐరోపా దేశాలలో ఉంది. అయితే అమెరికా వద్ద కేవలం బిలియన్లు మాత్రమే ఉన్నాయి. దీనిని "దొంగతనం" అని రష్యా అభివర్ణించింది.

ఈ డబ్బును ఎలా ఉపయోగించాలనే దానిపై అనేక ప్రతిపాదనలు ఉన్నాయి. నిధులను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని అమెరికా ముందుకు వచ్చినప్పుడు, యూరోపియన్ యూనియన్ ఆస్తుల ద్వారా వచ్చే లాభాలను ఉక్రెయిన్‌కు సహాయం చేయడానికి ఉపయోగిం చాలని ప్రతిపాదించింది. ఈ చర్య అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించగలదు, పెట్టుబడి దారులను యూరోను విశ్వసించకుండా నిరుత్సాహపరుస్తుంది, రష్యా ప్రతీకార చర్యలను ఆహ్వానిస్తుంది అనే ఆందోళనల కారణంగా యూరోపియన్ యూనియన్ అధికారులు రష్యన్ ఆస్తులను జప్తు చేయడానికి ఇష్టపడటంలేదని వాషింగ్టన్ పోస్టు పేర్కొంది.

స్తంభింపజేసిన ఆస్తులలో ఎక్కువ భాగం యూరప్‌లో ఉన్నందున నిధులను స్వాధీనం చేసుకోవాలనే అమెరికా ప్రతిపాదనను వారు వెనక్కి నెట్టారు. ఏదైనా రష్యా ప్రతీకారం బహుశా ఐరోపాపై పడవచ్చు, అమెరికాపై కాదు. యూరోపియన్ యూనియన్, అమెరికా రెండూ ఉక్రెయిన్ కోసం మరింత చేయవలసి ఉంది. కానీ ఏమి చేయాలనే విషయంపై ఏకాభిప్రాయం లేదు. 'మేము ఈ నిధుల సమస్యకు స్థిరమైన మధ్యస్థ-దీర్ఘకాలిక పరిష్కారంగా రష్యన్ సార్వభౌమ ఆస్తుల గురించి ఆలోచిస్తున్నాము' అని పేరు చెప్పటానికి ఇష్టపడని అమెరికా ట్రెజరీ అధికారి అన్నారు. అమెరికా ప్రతినిధుల సభ శనివారం "ఉక్రెయిన్ పునర్నిర్మాణ ఆర్థిక శ్రేయస్సు, అవకాశం చట్టం"ను ఆమోదించింది.

ఇది అమెరికా బ్యాంకులలో రష్యన్ ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి, వాటిని పునర్నిర్మాణం కోసం ఉక్రెయిన్‌కు బదిలీ చేయడానికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను అనుమతిస్తుంది. రష్యా ఆస్తులను స్వాధీనం చేసుకుంటే అందుకు ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని, అది ప్రయివేట్, ప్రభుత్వ ఆస్తుల అనుల్లంఘన సూత్రానికి వ్యతిరేకమని, అలాగే అమెరికా ప్రతిష్టకు కోలుకోలేని నష్టం కలిగిస్తుందని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ హెచ్చరించాడు.

అమెరికన్ ట్యాంకులపై రష్యన్ డ్రోన్ల వేట

- కోటి డాలర్ల ట్యాంకులను నాశనం చేస్తున్న రష్యన్ వైమానిక దళం : న్యూయార్క్ టైమ్స్



ఉక్రెయిన్‌కు సరఫరా చేసిన ఖరీదైన అమెరికన్ ఎమ్1 అబ్రమ్స్ ట్యాంకులు నామమాత్రపు విలువ చేసే రష్యన్ డ్రోన్‌ల బారిన పడుతున్నాయని, అమెరికన్ సైన్యానికి సంబంధించిన అత్యంత శక్తివంతమైన చిహ్నాలలో ఒకటైన అబ్రమ్స్ ట్యాంకులు కూడా దాడులకు అభేద్యమైనవి కావని న్యూయార్క్ టైమ్స్ శనివారం రిపోర్ట్ చేసింది. అమెరికా అందించిన 31 అబ్రమ్స్ ట్యాంకులలో కనీసం ఐదు ట్యాంకులను ఇప్పటికే రష్యా ధ్వంసం చేసింది. మరో మూడు కొంతవరకు దెబ్బతిన్నాయి అని న్యూయార్క్ టైమ్స్ రాసింది. చాలా సందర్భాలలో, ట్యాంక్‌లు "ఫస్ట్-పర్సన్-వ్యూ(ఎఫ్‌పీవీ) కమికేజ్ డ్రోన్‌ల ద్వారా ధ్వంసమయ్యాయి. వీటిని లాయిటరింగ్ మందుగుండు సామగ్రి అని కూడా పిలుస్తారు. ఈ డ్రోన్‌లు తమ లక్ష్యాలను ఛేదించే ముందు యుక్తిని ప్రదర్శించగలవు. కనీసం ఒక సందర్భంలో రష్యా టి-72బి3 ప్రధాన యుద్ధ ట్యాంక్‌తో జరిగిన ద్వంద్వ పోరాటంలో అబ్రమ్స్ ట్యాంక్‌ను ఉపసంహరించటం జరిగింది. అమెరికా సరఫరా చేసిన ఆయుధాలను నాశనం చేసినట్లు చూపే డ్రోన్ల ద్వారా తీసిన అనేక వీడియోలను రష్యన్ సైన్యం ప్రసారం చేసింది. 'కొందరు అధికారులు, నిపుణులు మొదట్లో ఊహించిన దానికంటే భిన్నంగా డ్రోన్‌లను పేల్చడం ద్వారా ట్యాంకులను మరింత సులభంగా నాశనం చేయవచ్చని తేలింది' అని న్యూయార్క్ టైమ్స్ రాసింది. ఈ పరిస్థితిని నమ్మలేనిదిగా ఆస్ట్రియన్ చరిత్రకారుడు, సైనిక నిపుణుడు కల్నల్ మార్కస్ రీస్నర్ అభివర్ణించినట్లు టైమ్స్ పేర్కొంది. రష్యన్ డ్రోన్లు 'అత్యంత చౌకగా లభించే కచ్చితమైన ట్యాంక్ కిల్లర్స్' అని ఆ పత్రిక రాసింది. రష్యన్ డ్రోన్ల కచ్చితత్వం 90 శాతం మించిపోయిందని, అవి ట్యాంకుల బలహీనమైన ప్రదేశాలను ఛేదించగలవని న్యూయార్క్ టైమ్స్ పొగిడింది.

500 డాలర్ల కంటే తక్కువ వ్యయంతో లభించే రష్యా డ్రోన్ కోటిడాలర్ల విలువ చేసే అబ్రమ్స్ ట్యాంక్‌ను ధ్వంసం చేస్తుందని, అలా జరగకుండా తప్పించుకోవటం సాధ్యపడదని కూడా టైమ్స్ రాసింది. డాన్‌బాస్ ప్రాంతంలోగల అవదీవ్కా నగరాన్ని స్వాధీనం చేసుకోవటాన్ని గానీ, రష్యా దళాల పురోగమనాన్ని గానీ ఉక్రెయిన్‌కు అమెరికా సరఫరా చేసిన 31 అబ్రమ్స్ ట్యాంకులు ఆపలేకపోయాయి.

వ్యర్థాల్లో అర్థాలను వెతుకుతూ..





పాత సీడీలు ఆమె చేతిలో వాల్ హ్యాంగింగ్‌లుగా మారిపోతాయి. టీ-షర్టులు బ్యాగులుగా రూపొందించబడతాయి. పాత సీసాలు పూల కుండీల కోసం తయారు చేయబడతాయి. ఉద్యోగ విరమణ తర్వాత చాలా మంది జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని కోరుకుంటారు. కొందరు మాత్రమే తమ మిగతా జీవితం సమాజానికి ఉపయోగపడాలని భావిస్తారు. అలాంటి వారిలో రషీదా ఆదిల్ ఒకరు. ఈ రిటైర్డ్ టీచర్ వ్యర్థాలను పరిశీలనాత్మక కళాఖండాలుగా మారుస్తుంది. అంతేకాదు 20 ఏండ్లుగా కళ ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేస్తుంది. భావి పరిరక్షకులు, కళాకారుల తరాన్ని నిర్మించడానికి అప్‌సైక్లింగ్‌ను మార్గంగా ఎంచుకున్న ఆమె పరిచయం...

రషీదా అందరూ పనికి రావని పడేసే వస్తువులకు కొత్త జీవితాన్ని ఇవ్వగలమని బలంగా నమ్ముతుంది. 2021లో తన స్వస్థలమైన నాసిక్‌కు తిరిగి వెళ్లడానికి ముందు UAEలోని షార్జా ఇండియన్ స్కూల్‌లో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విభాగానికి నేతృత్వం వహించారు. ప్రస్తుతం దావూదీ బోహ్రా కమ్యూనిటీకి చెందిన దాతృత్వ విభాగం ప్రాజెక్ట్ రైజ్‌లో పాల్గొంటున్నారు.

ప్రాజెక్ట్ రైజ్

విద్య, ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, నీరు, పారిశుధ్యం, అలాగే పర్యావరణ పరిరక్షణ ద్వారా ప్రపంచవ్యాప్తంగా బలహీన జనాభాకు మద్దతు ఇవ్వడానికి ప్రాజెక్ట్ రైజ్ అంకిత భావంతో పని చేస్తుంది. దావూదీ బోహ్రాలు ప్రపంచవ్యాప్తంగా 40 దేశాలలో నివసిస్తున్న సుమారు పదిలక్షల మంది సభ్యులతో కూడిన ముస్లిం సంఘం. ప్రాజెక్ట్ రైజ్‌లో భాగంగా రషీదా దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుండి ప్రత్యేక అవసరాలు గల దాదాపు 150 మంది విద్యార్థులతో చేతులు కలిపి, ఉపయోగించిన 1,000 సీడీలను సేకరించారు. వాటి నుండి కోస్టర్‌లు, క్యాండిల్ హోల్డర్‌లను రూపొందించారు. ఇటీవల జరుపుకున్న రంజాన్ పండుగలో దావూదీ బోహ్రా కమ్యూనిటీ సభ్యులకు వీటిని బహుమతిగా ఇచ్చారు.



పర్యావరణ సుస్థిరతకై...

'మేము నాసిక్‌లో మా 'ప్రాజెక్ట్ రైజ్' బ్యానర్‌లో 'ప్రాజెక్ట్ రైజ్' పేరుతో మా 'బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్' కార్యక్రమాన్ని ప్రారంభించాము. పేద ప్రజలకు సేవ చేస్తూ పర్యావరణ సుస్థిరతను పెంపొందించగలుగుతున్నాం. ఈ ప్రాజెక్ట్ చిన్న అడుగులు ఎలా గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయనే విషయాన్ని ఈ ప్రాజెక్ట్ నిరూపిస్తుంది. నాసిక్‌లోని ప్రాజెక్ట్ రైజ్ 30 ఏండ్లకు పైగా ఉన్న పర్యావరణ సంస్థ బుర్హానీ ఫౌండేషన్‌లో భాగంగా, రీసైక్లింగ్, అప్‌సైక్లింగ్, జీరో-వేస్ట్, స్థిరమైన జీవనశైలిని నడిపించడంలో సభ్యులకు శిక్షణ ఇవ్వడానికి అనేక విద్యా కార్యక్రమాలు, సెమినార్‌లు నిర్వహిస్తుంది. రషీదా బెన్(రషీదా చెల్లె) ఈ విజన్‌లో ముఖ్యమైన నాయకురాలు' అని ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అమ్మర్ మియాజీ చెప్పారు.

విభిన్న కార్యక్రమాలు...

పర్యావరణ పరిరక్షణ ప్రాజెక్టులతో పాటు, ప్రాజెక్ట్ రైజ్ యావత్మాల్‌లో ఐదు గ్రామాలకు మద్దతుగా నిలబడింది. వారికి అవసరమైన స్థిరమైన నీటి భద్రత ప్రాజెక్టును కూడా చేపట్టింది. నందుర్‌బార్, గోవండి, రోహా, స్థానిక కమ్యూనిటీలతో కూడా కలిసి పని చేస్తుంది. వారి కనీస అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తుంది. మహారాష్ట్రలోని కర్జాత్, పన్వెల్, పిల్లలకు అలాగే కుటుంబాలకు పోషణ, విద్య, ఆరోగ్య సంరక్షణ, తాగునీటిలో నిరంతర సహాయాన్ని అందిస్తోంది. ఇలా విభిన్నమైన కార్యక్రమాలు చేస్తూ ఈ ప్రాజెక్ట్ మంచి గుర్తింపు తెచ్చుకుంటుంది. పేద ముస్లింలకు అండగా నిలబడుతుంది.



వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు...

ఎన్నో ఏండ్లుగా తాను చేస్తున్న ఈ అప్‌సైక్లింగ్‌ను 2009 నుండి తన విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాలలో ఆవిష్కరణ, కళను కనుగొనడంలో శిక్షణ ఇవ్వాలని రషీదా నిర్ణయించుకున్నారు. 'మా తొలి ప్రాజెక్ట్‌లలో ఖాజు జెండా ఉంది. విద్యార్థులు, నేనూ కలిసి 65,000 బటన్‌లను రూపొందించాము. పాఠశాల పాఠ్యాంశాల్లో భాగంగా వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన అంశాలను పొందుపరచడానికి మా పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ఒప్పించగలిగాం' అని రషీదా చెప్పారు. ఖాళీ సోడా సీసాలు, వాటి క్యాప్‌లు, సీడీలు, పేపర్ ప్లేట్లు, స్పాంజ్‌లు, డిస్పోజబుల్ స్పూన్లు, బయోడిగ్రేడబుల్ కాని ఉత్పత్తులను క్రాఫ్ట్ ముక్కలుగా ఎలా తయారు చేయాలో ఆమె తన విద్యార్థులకు నేర్పారు.

విశేషమైన స్పందన

విస్మరించిన వస్తువులలో నేను ఎప్పుడూ కొత్త జీవితాన్ని చూశాను. నాకు ఊహతెలిసినప్పటి నుండి ఐస్‌క్రీమ్ స్పూన్ల మొదలు గాజుసామాను వరకు అన్నింటినీ సృజనాత్మకంగా లేదా ప్రయోజనం కోసం ఉపయోగిస్తున్నాను. నేను ఈ ప్రాజెక్ట్‌లలో విద్యార్థులను చేర్చడం ప్రారంభించినప్పుడు వారి శక్తి, ఉత్సాహం, వారు ఈ ఉత్పత్తులతో వెళ్లిన ప్రతిచోటా విశేషమైన స్పందన రావడాన్ని నేను చూశాను. వృద్ధాశ్రమాలతో పాటు కమ్యూనిటీ సభ్యుల్లో కూడా వీటిని ఎంతో ఇష్టపడుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే ఓ అంటువ్యాధిలా ఈ కళ అందరినీ తాకుతుంది. పర్యావరణానికి మేలు చేసే నా వ్యాధి ఎంతో మంది వద్దకు విస్తరించడం చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉంది' అంటూ రషీదా బిగ్గరగా నవ్వేశారు.

సృష్టించే ఉత్సాహం

శిక్షణలో భాగంగా విద్యార్థులు వారి ఇళ్లు, పరిసరాల నుండి 5,000 గాజు సీసాలను సేకరించారు. వాటితో ప్లాంటర్లగా తయారు చేసి పెయింట్ చేసి ప్రజలకు, పోలీసు అధికారులకు మొక్కలతో పంపిణీ చేశారు. 'ఈ ప్రాజెక్ట్‌లకు తరచుగా నెలల సమయం పడుతుంది. వ్యర్థ పదార్థాలను సేకరించడం నుండి ఆలోచించి కొత్త వస్తులను సృష్టించేందుకు సమయం కావాలి. విద్యార్థులను ముందుకు నడిపించేది ఏమిటంటే ఇప్పటివరకు వారి క్రియాత్మక విలువ కోసం మాత్రమే వీక్షించిన వాటి నుండి కొత్త, ఊహించలేని వాటిని సృష్టించే ఉత్సాహం. ఈ ఉత్సాహం వారిలోని సృజనాత్మ ప్రయోగాలకు దారి తీస్తుంది' అని రషీదా చెప్పారు.

ప్రముఖులకు బహుమతిగా...

ఆమె ఇతర ప్రాజెక్ట్‌లలో కూడా పని చేస్తున్నారు. దేశ 74వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 5,000 రీసైకిల్ బటన్‌లను ఉపయోగించి మహాత్మా గాంధీ చిత్రపటాన్ని రూపొందించారు. దీనిని అప్పటి భారత కాన్సుల్ జనరల్ అమన్ పూరికి బహుమతిగా అందించారు. పోర్ట్రెయిట్‌లో ఉపయోగించిన బటన్‌లను ఆమె విద్యార్థులు అందించారు. 10,000 బాటిళ్లను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వ్యవస్థాపకుడు షేక్ జాయెద్ బిన్ సుల్తాన్ అల్ నహ్యాన్ చిత్రంగా ఆమె రూపొందించారు. ■



వేసవిలో ఆరోగ్యంగా...

ఎండల వేడి పెరిగిపోతోంది. ఆరోగ్యం కోసం కొన్ని రకాల ఆహారాలను తినాలి. అలాగే కొన్ని రకాలా పదార్థాలకు దూరంగా ఉండాలి. వేసవిలో ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి ఆహారాలను తినకూడదో తెలుసుకుందాం.

వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా హైడ్రేటెడ్‌గా ఉండటం చాలా ముఖ్యం. కొన్ని ఆహారాలు శరీరంలో హైడ్రేషన్ స్థాయిలను క్షీణించేలా చేస్తాయి. దీనివల్ల మీరు డీహైడ్రేషన్ సమస్యకు గురవుతారు. డీహైడ్రేషన్ సమస్య వల్ల అనేక అనారోగ్యాలు వచ్చే అవకాశముంది. వేసవిలో ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండాలి. వాటి గురించి తెలుసుకుందాం.

ఉప్పగా ఉండే స్నాక్స్

స్నాక్స్ చాలా వరకు ఉప్పగానే ఉంటాయి. ఉప్పును అధికంగా వేయడం వల్ల అవి ఎక్కువ కాలం పాటు నిల్వ ఉంటాయి. చిప్స్, క్రాకర్స్, జంతికలు వంటి వాటిలో ఉప్పను అధికంగా వేస్తారు. అధిక సోడియం కలిగిన వీటిని వేసవిలో తినకపోవడం మంచిది. అధిక సోడియం వినియోగం శరీరంలో నీరు నిలిచిపోయాలా చేస్తుంది.

ప్రాసెస్ చేసిన ఆహారాలు

పిజ్జా, బర్గర్ వంటి వంటి ప్రాసెస్ చేసిన ఆహారాలు, మాంసాలను ఎక్కువగా తింటున్నారు. ప్రాసెస్ చేసిన మాంసాల్లోనూ సోడియం కంటెంట్ ఎక్కువ. వీటిని తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. డీహైడ్రేషన్ ప్రమాదం కూడా పెరిగిపోతుంది.

చక్కెర : పంచదారతో చేసిన ఆహారాలు తినేవారి సంఖ్య ఎక్కువే. ఐస్ క్రీములు, స్వీట్లు తగ్గించుకోవాలి. అవి తింటుంటే.. కాస్త ఉపశమనంగా అనిపించవచ్చు. కానీ ఇది డీహైడ్రేషన్ ప్రభావాలను పెంచుతుంది. అధిక చక్కెరను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. శరీరంలో అదనపు నీటిని తొలగించడానికి మూత్రపిండాలు అధికంగా కష్టపడాల్సి వస్తాయి. అప్పుడు పదే పదే మూత్ర విసర్జనకు వెళ్తారు. అలాగే దాహం పెరుగుతుంది. డీహైడ్రేషన్ సమస్య బారిన కూడా పడతారు.

మద్యం : ఆల్కహాల్ ప్రతిరోజు తాగేవారు ఉన్నారు. ఇలాంటి తాగడం వల్ల మూత్ర ఉత్పత్తి పెరుగుతుంది శరీరంలో నుంచి ద్రవాన్ని ఎక్కువగా కోల్పోతారు దీనివల్ల డిహైడ్రేషన్ బారిన పడతారు. అలాగే ఆల్కహాల్ పానీయాలు అధిక స్థాయిలో చక్కెర లేదా ఉప్పును కలిగి ఉంటాయి ఇవి కూడా ఆరోగ్యానికి కీడే చేస్తాయి

స్పైసీ ఫుడ్స్ : కారం నిండిన పదార్థాలను తినడం తగ్గించుకోవాలి. స్పైసీ ఫుడ్స్ చెమట అధికంగా పట్టేలా చేస్తాయి. అధిక చెమట వల్ల శరీరం నుంచి ద్రవాలను కోల్పోతారు. ఇది డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. మసాలా ఆహారాలు, సోడియం అధికంగా ఉండే ఆహారాలు, ఉప్పు నిండిన ఆహారాలు, మసాలా మిశ్రమాలు వంటివి దాహాన్ని పెంచుతాయి. ఎక్కువ నీటి వినియోగాన్ని పెంచుతాయి. డిహైడ్రేషన్ బారిన పడేలా చేస్తాయి.

ఈసీ పరిమితులు జాన్తానై..

(మొదటిపేజీ తరువాయి)

ట్యాంక్ సీఎంఎస్ ప్రకారం.. భారత్‌లో 2019 సార్వత్రిక ఎన్నికలు ప్రపంచవ్యాప్తంగా నమోదైన అత్యంత ఖరీదైనవి. మొత్తం ఖర్చు దాదాపు రూ. 55,000-60,000 కోట్లు అని అంచనా. ఆ ఎన్నికల ప్రక్రియ దాదాపు 75 రోజులు కొనసాగింది. ఏడు దశల్లో పోలింగ్ జరిగింది. అయితే, ఆ రికార్డును ప్రస్తుత ఎన్నికలు అధిగమిస్తుందనటంలో సందేహం లేదని విశ్లేషకులు అంటున్నారు. పోటీ తీవ్రత ఆధారంగా ఎన్నికల చివరి రోజుల్లో ఖర్చులు పెరుగుతాయని కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు అన్నారు.

కేరళలోని ఒక్కో లోక్‌సభ నియోజకవర్గంలో 1,200 నుంచి 1,300 బూత్‌లు ఉన్నాయని ఆయన చెప్పారు. పార్టీల జిల్లా యూనిట్లు ప్రచార సామగ్రిని అందజేస్తాయి. లాజిస్టిక్స్, మానవశక్తి, రిఫ్రెష్‌మెంట్లు మొదలైన వాటిపై ఖర్చులను భరిస్తాయి. "మేము ప్రతి అభ్యర్థికి ఒక లోక్‌సభ స్థానంలో ఒకే రౌండ్ కోసం 70,000 నుంచి 1,35,000 పోస్టర్‌లను అందించాలి. అది ఆరు లేదా ఏడు రౌండ్‌ల వరకు ఉండవచ్చు" అని ఆయన చెప్పారు. "అదనంగా కుటుంబ సమావేశాలు ఉన్నాయి. మూడు, నాలుగు పార్టీ సభ్యుల బృందాలు ఓటర్ల ఇండ్లను సందర్శిస్తాయి. ఈ సభ్యులకు రోజువారీ భత్యం ఇవ్వాలి. ఈ రోజుల్లో డిజిటల్ ప్రచారాల కోసం భారీ మొత్తం ఖర్చు అవుతున్నది" అని సదరు నాయకుడు చెప్పాడు. ఇది ఎక్కువగా కేంద్ర నాయకత్వం, దానిని భరించగలిగే అభ్యర్థులతోనే ఉంటుందని తెలిపారు.

ఒక నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి ఖర్చు చేసే మొత్తం, సగటున ఎన్నికల కమిషన్(ఈసీ) సూచించిన రూ. 95 లక్షల కంటే 7-12 రెట్లు ఎక్కువగా ఉంటున్నదని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. కొంతమంది అభ్యర్థులు రూ. 50 కోట్ల వరకు కూడా ఖర్చు చేస్తున్నారని తెలిపారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ చేసిన అధ్యయనం ప్రకారం.. రాజకీయ పార్టీలు తమ ఖర్చులను ప్రకటించే ప్రధాన వర్గాలు ప్రచారం, ప్రయాణం, ఇతరాలు, అభ్యర్థులపై చేసే ఖర్చు. 2004, 2009, 2014 లోక్‌సభ ఎన్నికల్లో (కలిసి) జాతీయ పార్టీలు తమ మొత్తం ఖర్చులో 50.58 శాతం ప్రచారానికి, 19.68 శాతం ప్రయాణ ఖర్చులకు, 15.43 శాతం అభ్యర్థులకు, 14.31 శాతం ఇతరాలకు ఖర్చు చేశాయి. పదేండ్ల కాలంలో.. ప్రచార వ్యయం 641 శాతం, ప్రయాణం 802 శాతం, అభ్యర్థులపై ఖర్చు 416 శాతం పెరిగిందని అంచనా. సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రధాన స్రవంతి పార్టీల అభ్యర్థులు ఒక్కొక్కరు కనీసం రూ. 20 కోట్లు ఖర్చు చేస్తారనీ, ఈ మొత్తం పెరుగుతున్నట్టు కనిపిస్తున్నదని రాజకీయ పరిశీలకుడు ఎస్.ఎం పియర్సన్ చెప్పారు. "రాజకీయంగా అవగాహన ఉన్న సమాజం డబ్బు శక్తి ప్రభావాన్ని అసహ్యించుకుంటున్నదని ఆయన చెప్పారు. అభ్యర్థుల రాజకీయ అభిప్రాయాల ఆధారంగా ఓటు వేస్తారని తెలిపారు. కాగా, పెరిగిపోతున్న ఎన్నికల వ్యయం ప్రజాస్వామ్య దేశానికి ఏ మాత్రమూ మంచిది కాదని విశ్లేషకులు అంటున్నారు. దీనిపై కేవలం ఎన్నికల అధికారులే కాకుండా.. మీడియాతో పాటు ప్రతి ఓటరూ ఒక కన్నేసి ఉంచి బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.

టీఎస్ఆర్‌జేసీ సెట్‌కు 61,442 విద్యార్థులు హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ (టీఎస్ఆర్‌జేసీ) జూనియర్ కాలేజీల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్షకు 84 శాతం మంది విద్యార్థులు హాజరయినట్టు ఆ సంస్థ కార్యదర్శి రమణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఏడాదికి గాను 35 గురుకుల కాలేజీల్లో ప్రవేశానికి రాష్ట్ర వ్యాప్తంగా 309 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్టు తెలిపారు. మొత్తం 73,528 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 61,442 మంది విద్యార్థులు హాజరయినట్టు వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు తెలిపారు.

టెట్ కు 2,86,386 మంది దరఖాస్తు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ స్టేట్ టీచర్స్ ఎల్జిబిలిటి టెస్ట్-2024కు మొత్తం 2,86,386 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పేపర్ 1 కోసం 99,958, పేపర్ 2 కోసం 1,86,428 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఓటమి అంచుల్లో కాషాయపార్టీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు కాషాయకూటమికి బుద్ధి చెప్పాలి" అని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రశాంత్ భూషణ్ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని మదీనా ఎడ్యుకేషన్ సెంటర్లో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, భారత్ జోడో అభియాన్ ఆధ్వర్యంలో " 2024 ఎన్నికలు... ప్రమాదంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం" అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు.



గత పదేండ్లుగా బీజేపీ దేశాన్ని విధ్వంసం వైపు నడిపించింది. తనకు అనుకూలంగా లేని వ్యక్తులు, పార్టీలు, సంస్థలపై దాడులు చేయిస్తూ భయ భ్రాంతులకు గురి చేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలంలో దర్యాప్తు సంస్థలు తమ ఉనికిని కోల్పోయాయని పేర్కొన్నారు. మనీ లాండరింగ్ కేసుల్లో ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ఎవరినైనా అరెస్ట్ చేసే అధికారం ఉన్న నేపథ్యంలో దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకొని బీజేపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. గత పదేండ్లలో విపక్షపార్టీలకు చెందిన 25 మంది నాయకులపై ఈ తరహా కేసులు నమోదయ్యాయి. అయితే వారందరూ తర్వాత బీజేపీలో చేరగా, అందులో 23 మందిపై కేసులు వీగి పోయాయని గుర్తు చేశారు. అప్రూవర్లు అనే పదాన్ని ఉపయోగించుకుని రాజకీయ అనుబంధాలకు అనుగుణంగా కేసులను మార్చుతూ దర్యాప్తు సంస్థల ఉనికిని మోడీ సర్కార్ ప్రశ్నార్థకంగా మార్చిందని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి పెను ప్రమాదమని హెచ్చరించారు.

ఎన్నికలకు ముందే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్, ఎమ్మెల్సీ కవిత లాంటి వారిని ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. ప్రత్యర్థి పార్టీలు లేకుండా చేయడం ద్వారా ఆయా రాష్ట్రాల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ ఈ సంస్థలను వాడుకుంటోందని విమర్శించారు. నల్లధనాన్ని రూపు మాపేందుకే తీసుకొచ్చామని చెప్పిన ఎన్నికల బాండ్లు ప్రపంచంలోనే అతి పెద్ద కుంభకోణమని ఆరోపించారు. అధికారికంగా రూ.16 వేల కోట్లు వసూలు చేసినా..దీని మాటున లక్షల కోట్ల అవినీతి జరిగిందని విమర్శించారు. మెఘా ఇంజినీరింగ్ కంపెనీ, భారతీ ఎయిర్‌టెల్‌తో పాటు దేశంలోని అనేక ఫార్మా కంపెనీలు తమ కాంట్రాక్టులు, అక్రమాలను కప్పిపుచ్చు కునేందుకు బాండ్లను కొనుగోలు చేశాయని చెప్పారు. బీజేపీ ధాటికి తట్టుకోలేక మీడియా, ఎన్నికల కమిషన్, దర్యాప్తు సంస్థలు అచేతనంగా మారిపోయాయని చెప్పారు. న్యాయ వ్యవస్థ కొన్ని కేసుల్లో మెరుగ్గా స్పందిస్తున్నా ఏండ్ల తరబడి న్యాయం కోసం వేచి చూసే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

" పైసాపే సత్తా, సత్తాపే పైసా అనే సైకిల్ సిస్టమ్ దేశంలో నడుస్తోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు అమ్ముడు పోతున్నారు. డబ్బులతో ప్రభుత్వాలు పడిపోతున్నాయి. పార్లమెంట్‌లో విపక్షాలను సస్పెన్స్ చేసి ఎలాంటి చర్చ లేకుండా చట్టాలు తెస్తున్నారు. ఇది దేశానికి ప్రమాదకరం." అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక కార్యకర్త నిర్మల భరద్వాజ్ మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం ప్రశ్నించడాన్నీ నిషేధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులు ప్రశ్నించకుండా ఉండేందుకు రెండు సార్లు ఆర్టీఐ చట్టంలో మార్పులు తెచ్చిందని గుర్తు చేశారు. ఎక్కడైతే పాలకుల తప్పులను అడిగే వారు లేకుండా పోతారో అక్కడ ప్రజాస్వామ్యం బతకదని హెచ్చరించారు. ప్రొఫెసర్ హరగోపాల్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సెమినార్‌లో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కన్నెగంటి రవి, విస్సా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాలు గెలిస్తేనే పార్లమెంటులో ప్రజావాణి

(మొదటిపేజీ తరువాయి)

ఇది 30 శాతానికి పైగా ఉంటుందని అన్నారు. కానీ, కేరళలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 0.7 శాతం లోపలే పేదరికం ఉందని పేర్కొనడం, ఉపాధి, ఉద్యోగ కల్పన, మానవ అభివృద్ధి, అందరికీ నివాసం కల్పించిందని ప్రభుత్వ నివేదికలే చెబుతున్నాయని అన్నారు. వ్యవసాయ కార్మికులు, రైతాంగం, కార్మికులు, కౌలు రైతులకు మేలు జరగాలంటే తిరిగి వామపక్ష అభ్యర్థులను గెలిపించుకోవడమే మార్గమని చెప్పారు. దేశంలో బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్ముతుంటే వాటిని కేరళ ప్రభుత్వం తీసుకుని ప్రభుత్వ రంగంలో నడుపుతున్నదని తెలిపారు. దేశంలో రైతుల నల్లచట్టాలు, నిరుద్యోగ సమస్య, నూతన జాతీయ విద్యావిధానం, కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్లను, సీఏఏ లాంటి ప్రజా వ్యతిరేక చట్టాలు కార్పొరేట్ శక్తులకు ఉపయోగం కలిగేలా తీసుకొస్తే, వాటికి వ్యతిరేకంగా సీపీఐ(ఎం) పోరాడుతోందని తెలిపారు. పార్లమెంట్‌లో వామపక్ష పార్టీలు లేకపోవడం వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం జరిగిందో ప్రజలు ఆలోచిస్తున్నారని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం మొదటి ఐదేండ్లలో ఉన్నప్పుడు కమ్యూనిస్టులు పార్లమెంట్‌లో ఉండటం వల్ల ప్రజా అనుకూల చట్టాలు చేయించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేశారని తెలిపారు. దేశాన్ని కార్పొరేట్, మతోన్మాద విధానాలతో నష్టం చేస్తున్న బీజేపీని రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు పుప్పాల శ్రీకాంత్, జనగామ జిల్లా కమిటీ సభ్యులు జోగు ప్రకాశ్, గ్రామశాఖ కార్యదర్శి గురిజాల లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు పుప్పాల అయిలయ్య, విప్లవ రెడ్డి, నర్సయ్య, దుబ్బాక సంపత్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జహంగీర్‌ను గెలిపించండి.. సీపీఐ(ఎం), ఆవాజ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-చౌటుప్పల్

సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణకేంద్రంలో జహంగీర్ సతీమణి ఎండీ ఖమరున్నీసా బేగం, ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు ఎండీ రేష్మాబేగం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 35 ఏండ్లుగా జహంగీర్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషిచేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని సమస్యల పరిష్కారం కోసం 30 రోజులు పాదయాత్ర నిర్వహించారన్నారు. భువనగిరిలో ధనబలం, ప్రజాబలం మధ్య పోటీ జరుగుతుందని చెప్పారు. భువనగిరి గడ్డపై సీపీఐ(ఎం)ను గెలిపిస్తే ప్రజల పక్షాన పార్లమెంట్‌లో జహంగీర్ ప్రశ్నిస్తారని తెలిపారు. పదేండ్ల బీజేపీ పాలనలో ప్రజాసమస్యలు పరిష్కరించడంలో ప్రధాని మోడీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎమ్‌డీ సల్మాబేగం, రజియాబేగం, అర్షియా, రహీమా తదితరులు పాల్గొన్నారు.



దాతృత్వ అవయవాలకు గుర్తింపు సంఖ్య

న్యూఢిల్లీ : అవయవ మార్పిడికి సంబంధించిన అన్ని కేసుల్లో దాత (బతికి ఉన్నా, మరణించినా), గ్రహీత ఇద్దరికీ కూడా ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (నొట్టో) ద్వారా ఈ గుర్తింపు కేటాయించబడుతుంది. నొట్టో వెబ్‌సైట్ ద్వారా ఆస్పత్రులకు ఈ గుర్తింపు జారీ చేయబడుతుందని కేంద్రం తెలిపింది. అవయవాల అమ్మకం ముఖ్యంగా విదేశీయులకు అమ్మకాలను నిరోధించడానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈ ఉత్తర్వులు జారీ చేశారు. దేశంలో విదేశీయులకు అవయవ దానాలు సంఖ్య పెరుగుతున్నట్లు, విదేశీయులకు అవయవదానాల్లో అక్రమాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నట్లు ఇటీవల నివేదికలు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. విదేశీయులకు అవయవ దాన మార్పిడిలను కఠినంగా పర్యవేక్షించాలని కూడా స్థానిక అధికారులను ఈ ఉత్తర్వుల్లో కేంద్రం ఆదేశించింది. 'మరణించిన దాత నుంచి అవయవదానాన్ని పరిగణనలోకి తీసుకోవడానికి నొట్టో ఐడి గుర్తింపు తప్పనిసరి. జీవించి ఉన్న దాత నుంచి అవయవదానం విషయంలో అవయవ మార్పిడి శస్త్రచికిత్స జరిగిన 48 గంటల్లోపు ఈ నొట్టో గుర్తింపు జారీ చేయాలి' అని కేంద్రం పేర్కొంది. అవయవమార్పిడిలు చేసే ఆస్పత్రులను క్రమం తప్పకుండా తనిఖీ చేసే వ్యవస్థలను రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపింది. మార్పిడి ఆపరేషన్ల నాణ్యతను, ఆపరేషన్ తరువాత దాత, గ్రహీతల ఆరోగ్య పరిస్థితులను విచారిస్తుండాలని తెలిపింది. నిబంధలన ఉల్లంగనలు జరిగినట్లు వెల్లడయితే ఆస్పత్రుల నమోదును రద్దు చేయడంతో తగిన చర్యలు కూడా తీసుకోవాలని పేర్కొంది. అవయవదానాలు, మార్పిడులకు సంబంధించిన పూర్తి డేటాను నొట్టోతో పంచుకోవాలని అనేక సార్లు రాష్ట్రాలను అభ్యర్థించామని, కానీ ఇంకా సమాచారం అందలేదని కేంద్రం ఈ సందర్భంగా తెలిపింది. ఈ సమాచారం కోసం మరోసారి అభ్యర్థిస్తున్నట్లు చెప్పింది. కాగా, మానవ అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం (తోట) 1994 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకున్న అథారిటీలు ఆయా రాష్ట్రాల్లో విదేశీయలకు జరిగిన అవయవ దానాలపై దర్యాప్తు నిర్వహించాలని ఈ నెల ప్రారంభంలోనే కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ చట్టంలోని నిబంధనలు ఉల్లంగించినట్లు ఫిర్యాదులు లేదా ఉల్లంఘనలు జరిగినట్టు వెలుగులోకి వచ్చినా తగిన చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించింది.

పదవిని కాపాడుకునేందుకు సీఎం రేవంత్ తంటాలు

- **తిట్ల పురాణం ఆపి హామీలపై దృష్టి పెట్టు : బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పదివిని కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ స్థానాలు గెలవకపోతే సీఎం కుర్చీ పోతుందని రేవంత్ భయపడుతున్నారని విమర్శించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టిన సీఎం నాలుగు నెలలకే ప్రజల విశ్వాసం కోల్పోయారని విమర్శించారు. తన అసహనాన్ని ఇతర పార్టీల నేతలపై తిట్ల రూపంలో చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆగస్టులో రైతు రుణమాఫీ చేస్తామంటూ మహబూబాబాద్, మెదక్ సభల్లో రేవంత్ రెడ్డి దేవుడిపై ప్రమాణం చేసి చెప్పారనీ, ఆ రకంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డ ఆయనపై ఈసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలు సాగు, తాగునీరు, విద్యుత్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, సీఎంతో పాటు మంత్రులు రాజకీయాలు చేస్తూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. పవర్ మినిస్టర్ భట్టి సీపీఐ ఆఫీస్‌కు వెళ్తే అక్కడ అరగంటపాటు కరెంటు పోయిందని గుర్తు చేశారు. విద్యుత్ శాఖ మంత్రికే ఈ పరిస్థితి ఎదురైతే సామాన్యుల పరిస్థితేంటని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పేరుతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పిలిపించుకుని కాంగ్రెస్ కండువా కప్పేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తమ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, గడ్డం రంజిత్ రెడ్డిపై ఆ పార్టీ క్యాడర్ తిరుగుబాటు చేస్తోందని గుర్తు చేశారు.





గుకేశ్ అదరహో..

అలిరెజాపై మెరుపు విజయం
అగ్రస్థానం మరింత సుస్థిరం
ఫిడె క్యాండిడేట్స్ చెస్ 2024

టొరంటో (యుఎస్ఏ) : 17 ఏండ్ల యువ గ్రాండ్‌మాస్టర్, భారత నయా చదరంగ మేధావి డి. గుకేశ్ అదరగొట్టాడు. ప్రతిష్టాత్మక ఫిడె క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో కీలక సమయంలో అద్భుత విజయం సాధించాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీపడే అర్హత సాధించేందుకు అడుగు దూరంలోనే నిలిచాడు. ఆదివారం టొరంటోలో జరిగిన 13వ రౌండ్ మ్యాచ్‌లో డి.గుకేశ్ మెరుపు విజయం సాధించాడు. అలిరెజా ఫిరౌజ్జాపై గెలుపొంది అగ్రస్థానంలో నిలిచాడు. రుయ్ లోపేజ్ బెర్లిన్‌లో 63 ఎత్తుల్లో గుకేశ్ పైచేయి సాధించాడు. తెలివిగా ఎత్తులు వేసిన గుకేశ్.. కచ్చితమైన ఎత్తులతో అలిరెజాను బోల్తా కొట్టించాడు. దీంతో 8.5 పాయింట్లతో డి. గుకేశ్ అగ్రస్థానంలో నిలిచాడు. ఐయాన్ నెపోమ్నియాచి (రష్యా) 13వ రౌండ్ మ్యాచ్‌ను డ్రా చేసుకున్నాడు. హికారు నకమురు (యుఎస్ఏ)తో రుయ్ లోపేజ్‌లో 27 ఎత్తుల్లోనే డ్రాకు అంగీకరించాడు. ప్రజ్ఞానందపై విజయంతో ఫాబినాయో (యుఎస్ఏ) సైతం ఉమ్మడిగా రెండో స్థానానికి ఎగబాకాడు. ఈ టోర్నీలో తొలిసారి నెపోమ్నియాచి అగ్రస్థానం కోల్పోయాడు.

ఒక్క అడుగు : ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్స్‌లో చైనా దిగ్గజం డింగ్ లైరెన్‌ను ఢీకొట్టే చాలెంజర్‌గా నిలిచేందుకు గుకేశ్ అడుగు దూరంలో నిలిచాడు. సోమవారం జరిగే ఆఖరు రౌండ్లో హికారు నకమురతో గుకేశ్ ఆడనున్నాడు. నకమురపై విజయం సాధిస్తే ఎటువంటి సమీకరణాలతో సంబంధం లేకుండా గుకేశ్ క్యాండిడేట్స్ విజేతగా అవతరిస్తాడు. ఒకవేళ నకమురతో మ్యాచ్‌ను గుకేశ్ డ్రా చేసుకున్నా..భారత గ్రాండ్‌మాస్టర్‌కు చాలెంజర్‌గా నిలిచే అవకాశాలు మెండుగానే ఉన్నాయి. ఫాబియానో, నెపోమ్నియాచి మ్యాచ్ డ్రా ముగిస్తే గుకేశ్‌కు తిరుగులేదు. కానీ నెపోమ్నియాచి నెగ్గినా.. గుకేశ్‌కు టైబ్రేక్ గేమ్‌ల రూపంలో మరో అవకాశం లభించనుంది. సోమవారం చివరి రౌండ్‌లో నకమురతో గుకేశ్ నల్ల పావులతో ఎత్తులు వేయనున్నాడు.

ఈడెన్‌లో థ్రిల్లర్!

- ఒక్క పరుగుతో కోల్‌కత గెలుపు
- ఛేదనలో బెంగళూర్‌కు తప్పని నిరాశ

కోల్‌కత 222/6, బెంగళూర్ 221/10

ఈడెన్‌గార్డెన్స్‌లో భారీ స్కోర్ల థ్రిల్లర్. ధనాధన్ మోత మోగిన మ్యాచ్‌లో ఆతిథ్య కోల్‌కత నైట్‌రైడర్స్ పైచేయి సాధించింది. 223 పరుగుల ఛేదనలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ఆఖరు బంతి వరకు పోరాడినా.. ఒక్క పరుగు తేడాతో పరాజయం పాలైంది. విల్ జాక్స్ (55), రజత్ పాటిదార్ (52), కరన్ శర్మ (20) పోరాడినా గెలుపు గీతకు బెంగళూర్ పరుగు దూరంలో నిలిచింది. ఫిల్ సాల్ట్ (48), శ్రేయస్ అయ్యర్ (50), రమణ్‌దీప్ సింగ్ (24 నాటౌట్) రాణించటంతో తొలుత కోల్‌కత నైట్‌రైడర్స్ 222/6 పరుగులు చేసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన అండ్రీ రసెల్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

నవతెలంగాణ-కోల్‌కత



రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ కథ ముగిసే!. ఐపీఎల్ 17 ప్లేఆఫ్స్ రేసులో నిలిచేందుకు తాడోపేడో తేల్చుకోవాల్సిన తరుణంలో కోల్‌కత నైట్‌రైడర్స్ చేతిలో బెంగళూర్‌కు భంగపాటు తప్పలేదు. సీజన్లో ఏడో పరాజయం చవిచూసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ దాదాపుగా ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది!. 223 పరుగుల రికార్డు ఛేదనలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ఆఖరు బంతి వరకు పోరాడింది. విల్ జాక్స్ (55, 32 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సులు), రజత్ పాటిదార్ (52, 23 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సులు) అర్థ సెంచరీలతో మెరువగా.. కరన్ శర్మ (20, 7 బంతుల్లో 3 సిక్సులు) ఆఖర్లో ఆశలు రేపినా ప్రయోజనం దక్కలేదు. 20 ఓవర్లలో పది వికెట్లకు 221 పరుగులే చేసిన బెంగళూర్.. ఏడో ఓటమి మూటగట్టుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కత నైట్‌రైడర్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 222 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (48, 14 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సులు), శ్రేయస్ అయ్యర్ (50, 36 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. రింకూ సింగ్ (24), అండ్రీ రసెల్ (27), రమణ్‌దీప్ సింగ్ (24 నాటౌట్) ఆకట్టుకున్నారు. కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఏడు మ్యాచుల్లో ఇది ఐదో విజయం కాగా.. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు ఎనిమిది మ్యాచుల్లో ఇది ఏడో పరాజయం.

ఆఖరు వరకు పోరాడినా.. : 223 పరుగుల ఛేదనలో బెంగళూర్‌కు ఆరంభం దక్కలేదు. విరాట్ కోహ్లి (18) రెండు సిక్సర్లు, ఓ ఫోర్‌తో ధనాధన్‌తో చెలరేగాడు. కానీ హర్షిత్ రానా ఓవర్లో రిటర్న్ క్యాచౌట్ అయ్యాడు. నో బాల్ కోసం టీవీ అంపైర్ సమీక్ష కోరినా.. కోహ్లి క్రీజు బయట ఉండటంతో డగౌట్‌కు చేరుకోక తప్పలేదు. కెప్టెన్ డుప్లెసిస్ (7) సైతం నిరాశపరిచాడు. ఈ సమయంలో విల్ జాక్స్ (55), రజత్ పాటిదార్ (52) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. ఛేదనలో బెంగళూర్ ఆశలను సజీవంగా నిలిపారు. అర్ధ సెంచరీల అనంతరం జాక్స్, పాటిదార్ నిష్క్రమించగా.. కోల్‌కత మ్యాచ్‌పై పట్టు బిగించింది. కామెరూన్ గ్రీన్ (6), సుయాశ్ ప్రభుదేశాయ్ (24) సహా మహిపాల్ (4) నిరాశపరిచారు. దినేశ్ కార్తీక్ (25) క్రీజులో నిలిచినా.. తనదైన జోరు చూపించలేకపోయాడు. ఆఖరు ఓవర్లో మిచెల్ స్టార్క్‌పై కరన్ శర్మ మూడు సిక్సర్లు సంధించి మ్యాచ్‌ను ఉత్కంఠభరితంగా మార్చాడు. చివరి బంతికి మూడు పరుగులు అవసరమైన దశలో బెంగళూర్ ఒక్క పరుగే చేసింది. నైట్‌రైడర్స్ బౌలర్లలో ఆండ్రీ రసెల్ (3/25), సునీల్ నరైన్ (2/34), హర్షిత్ రానా (2/33) రాణించారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో పది వికెట్లకు 221 పరుగులు చేసింది.



చెలరేగిన సాల్ట్ : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఓపెనర్ ఫిల్ సాల్ట్ (48) విధ్వంసక ఆరంభాన్ని అందించాడు. పించ్‌హిట్టర్ సునీల్ నరైన్ (10, 15 బంతుల్లో 2 ఫోర్లు) నిరాశపరిచినా.. సాల్ట్ మెరుపులతో కోల్‌కత స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. యశ్ దయాళ్ మెరవటంతో నైట్‌రైడర్స్ వరుసగా సునీల్ నరైన్, రఘువంశీ వికెట్లను పడగొట్టినా ఫిల్ సాల్ట్ జోరుతో పవర్‌ప్లేలో ఆ జట్టు 75 పరుగులు చేసింది. మూడు సిక్సర్లు, ఏడు ఫోర్లతో చెలరేగిన ఫిల్ సాల్ట్ పవర్‌ప్లేను శాసించాడు. రఘువంశీ (3), వెంకటేశ్ అయ్యర్ (16) నిరాశపరిచినా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (50) అర్థ సెంచరీతో కదం తొక్కాడు. లోయర్ ఆర్డర్‌లో రింకూ సింగ్ (24), అండ్రీ రసెల్ (27 నాటౌట్), రమణ్‌దీప్ సింగ్ (24 నాటౌట్) రాణించారు. 20 ఓవర్లలో కోల్‌కత నైట్‌రైడర్స్ 6 వికెట్లకు 222 పరుగులు చేసింది. బెంగళూర్ బౌలర్లలో కామెరూన్ గ్రీన్ (35), యశ్ దయాల్ (2/56) రాణించారు.

స్కోరు వివరాలు :

కోల్‌కత నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్ : ఫిల్ సాల్ట్ (సి) పాటిదార్ (బి) సిరాజ్ 48, సునీల్ నరైన్ (సి) కోహ్లి (బి) యశ్ 10, రఘువంశీ (సి) గ్రీన్ (బి) యశ్ 3, వెంకటేశ్ అయ్యర్ (సి) మహిపాల్ (బి) గ్రీన్ 16, శ్రేయస్ అయ్యర్ (సి) డుప్లెసిస్ (బి) గ్రీన్ 50, రింకూ సింగ్ (సి) యశ్ (బి) ఫెర్గుసన్ 24, రసెల్ నాటౌట్ 27, రమణ్‌దీప్ సింగ్ నాటౌట్ 24, ఎక్స్‌ట్రాలు : **20, మొత్తం : (20 ఓవర్లలో 6 వికెట్లకు) 222.**

వికెట్ల పతనం : 1-56, 2-66, 3-75, 4-97, 5-137, 6-179.

బౌలింగ్ : మహ్మద్ సిరాజ్ 4-0-40-1, యశ్ దయాళ్ 4-0-56-2, ఫెర్గుసన్ 4-0-47-1, కరన్ శర్మ 4-0-33-0, కామెరూన్ గ్రీన్ 4-0-35-2.


రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ఇన్నింగ్స్ : విరాట్ కోహ్లి (సి,బి) హర్షిత్ రానా 18, డుప్లెసిస్ (సి) వెంకటేశ్ (బి) వరుణ్ 7, విల్ జాక్స్ (సి) రఘువంశీ (బి) రసెల్ 55, రజత్ పాటిదార్ (సి) హర్షిత్ రానా (బి) రసెల్ 52, కామెరూన్ గ్రీన్ (సి) రమణ్‌దీప్ (బి) నరైన్ 6, సుయాశ్ ప్రభుదేశాయ్ (సి) రఘువంశీ (బి) హర్షిత్ రానా 4, మహిపాల్ (సి,బి) నరైన్ 4, దినేశ్ కార్తీక్ (సి) సాల్ట్ (బి) రసెల్ 25, కరన్ శర్మ (సి,బి) స్టార్క్ 20, సిరాజ్ నాటౌట్ 0, ఫెర్గుసన్ (రనౌట్) 1, ఎక్స్‌ట్రాలు : 9, **మొత్తం : (20 ఓవర్లలో ఆలౌట్) 221.**

వికెట్ల పతనం : 1-27, 2-35, 3-137, 4-138, 5-151, 6-155, 7-187, 8-202, 9-220, 10-221.

బౌలింగ్ : హర్షిత్ రానా 4-0-33-2, మిచెల్ స్టార్క్ 3-0-55-1, వరుణ్ చక్రవర్తి 4-0-36-1, సునీల్ నరైన్ 4-0-34-2, సుయాశ్ శర్మ 2-0-33-0, అండ్రీ రసెల్ 3-0-25-3.

చాంప్ వెర్‌స్టాపెన్

చైనీస్ గ్రాండ్ ప్రీ టైటిల్ వశం



షాంఘై (చైనా) : 2024 ఏడాదిలో ట్రిపుల్ వరల్డ్ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ జోరుకు బ్రేక్‌లు లేవు!. ఈ ఏడాది జరిగిన ఐదు రేసుల్లో ఏకంగా నాలుగింట విజేతగా నిలిచిన రెడ్‌బుల్ డ్రైవర్ వెర్‌స్టాపెన్ ఫార్ములా 1 సర్క్యూట్‌పై దూసుకెళ్తున్నాడు. 2019 తర్వాత చైనాలోని షాంఘై ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో జరిగిన తొలి గ్రాండ్ ప్రీ రేసును వెర్‌స్టాపెన్ సొంతం చేసుకునానడు. 56 ల్యాప్స్‌ను 1.40.52.554 సెకండ్లలో పూర్తి చేసిన మాక్స్ వెర్‌స్టాపెన్ 25 పాయింట్లను ఖాతాలో వేసుకున్నాడు. మెక్‌లారెన్ డ్రైవర్ నోరిస్, రెడ్‌బుల్ డ్రైవర్ పెరెజ్‌లు టాప్-3లో నిలిచారు.

28 మందితో హాకీ ప్రాబబుల్స్!

మే 13 వరకు నేషనల్ క్యాంప్



బెంగళూర్ : టోక్యో ఒలింపిక్స్ మెడలిస్ట్ హాకీ ఇండియా.. పారిస్‌లోనూ పతకం సాధించేందుకు పట్టుదలగా చెమటోడ్చుతుంది. పారిస్ ఒలింపిక్స్ జట్టును ఎంపిక చేసేందుకు హాకీ ఇండియా 28 మందితో ప్రాబబుల్స్ జాబితాను విడుదల చేసింది. బెంగళూర్‌లోని సాయ్ సెంటర్‌లో ఆదివారం మొదలైన నేషనల్ క్యాంప్ మే 13 వరకు కొనసాగుతుంది. పారిస్ ఒలింపిక్స్ ముంగిట భారత జట్టు సరిదిద్దుకోవాల్సిన లోపాలపై ప్రధానంగా శిక్షణ శిబిరంలో దృష్టి పెట్టనున్నారు. క్యాంప్ అనంతరం భారత జట్టు నేరుగా బెల్జియం, ఇంగ్లాండ్‌కు బయల్దేరనుంది. అక్కడ ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో రెండు అంచెల్లో అర్జెంటీనా, బెల్జియం, జర్మనీ, గ్రేట్ బ్రిటన్‌తో తలపడనుంది.

హాకీ ప్రాబబుల్స్ : క్రిషన్ బహదూర్, పిఆర్ శ్రీజేశ్, సూరజ్ (గోల్ కీపర్లు). హర్మన్‌ప్రీత్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్, అమిత్, జుగ్‌రాజ్ సింగ్, సంజయ్, సుమిత్, అమీర్ అలీ (డిఫెండర్లు). మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, రవిచంద్ర సింగ్, శంషర్ సింగ్, నీలకంఠ శర్మ రాజ్‌కుమార్ పాల్, విష్ణుకాంత్ సింగ్ (మిడ్ ఫీల్డర్లు). ఆకాశ్‌దీప్ సింగ్, మన్‌దీప్ సింగ్, లలిత్‌క ఉమార్, అభిషేక్, దిల్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జిత్ సింగ్, గుర్జంత్ సింగ్, మహ్మద్ రహీల్, బాబీ సింగ్, అరాజీత్ సింగ్ (ఫార్వర్డ్స్).

నవచిత్రం

హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్


సుధీర్‌బాబు

సుధీర్ బాబు తాజాగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'హరోం హర'. 'సెహరి' ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఎస్‌-ఎస్‌సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ మొత్తం పూర్తయ్యింది. ఈ సందర్భంగా సెట్‌లో కేక్ కట్ చేసి చిత్రబృందం సెలబ్రేట్ చేసుకుంది. వీడియోలో టీమ్ సంతృప్తిగా, కాన్ఫిడెంట్‌గా కనిపిస్తోంది. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించనున్నారు.

చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో సాగే హరోం హర కథలో సుధీర్ బాబు కుప్పం యాసలో డైలాగులు చెప్పనున్నారు. ది రివోల్ట్ అనేది ట్యాగ్‌లైన్. ఇందులో సుధీర్ బాబుకు జోడిగా మాళవిక శర్మ నటిస్తోంది. సునీల్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం - జ్ఞానసాగర్ ద్వారక, నిర్మాత - సుమంత్ జి నాయుడు, సంగీతం - చైతన్ భరద్వాజ్, డీవోపీ - అరవింద్ విశ్వనాథన్, ఎడిటర్ - రవితేజ గిరిజాల.



కాండ్రకోట మిస్టరీతో నింద

ఓ సరికొత్త కాన్సెప్ట్‌తో వరుణ్ సందేశ్ హీరోగా రాబోతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా 'నింద' అనే చిత్రాన్ని రాజేష్ జగన్నాథం నిర్మించడమే కాకుండా కథ, కథనాన్ని రాసి దర్శకత్వం వహించారు.

ది ఫర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మించిన ఈ మూవీకి సంబంధించిన అప్డేట్‌ను టీం విడుదల చేసింది. కాండ్రకోట మిస్టరీ అనే క్యాప్షన్‌తో రాబోతోన్న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌ను గమనిస్తుంటే ఎన్నో హింట్స్ ఇచ్చినట్టుగా కనిపిస్తోంది. ఊరి వాతావరణం, చీకటి, గుడిసె, కత్తి పట్టుకున్న ఓ వ్యక్తి.. కత్తి పట్టుకుని దుర్మార్గులను అంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నటువంటి న్యాయదేవత విగ్రహం కూడా కనిపిస్తోంది.

ఇలా పోస్టర్‌తోనే ఎంతో ఆసక్తికిని రేకెత్తించారు. ఇక ఈ మూవీని ఆల్రెడీ ఇండస్ట్రీలోని ప్రముఖులకు చూపించారు. వారంతా కూడా సినిమాను మెచ్చుకున్నారు. మంచి కాన్సెప్ట్‌తో చిత్రాన్ని తెరకెక్కించారని దర్శక, నిర్మాతను ప్రశంసించారు. ఇక ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ చాలా మంచి కంటెంట్‌తో సినిమా చేశారంటూ అందరూ అభినందిస్తుంటే, సినిమా కచ్చితంగా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని మేకర్స్ తెలిపారు.

ఆనీ, తనికెళ్ల భరణి, భద్రం, సూర్య కుమార్, చత్రపతి శేఖర్, మైమ్ మధు, సిద్ధార్థ్ గొల్లపూడి, అరుణ్ దల్లై, శ్రేయా రాణి రెడ్డి, క్యూ మధు, శ్రీరామ్ సిద్ధార్థ్ కృష్ణ, రాజ్ కుమార్ కుర్రా, దుర్గా అభిషేక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : సంతు ఓంకార్, కెమెరామెన్ : రమీజ్ నవీత్, ఎడిటింగ్ : అనిల్ కుమార్.

మంచి కంటెంట్ ఉన్న సినిమా



అజయ్ ఘోష్, చాందినీ చౌదరిలు ప్రముఖ పాత్రలు పోషించిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. ఈ సినిమాను ఫ్లై హై సినిమాస్ బ్యానర్ మీద హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మించారు. శివ పాలడుగు ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించారు. ఈ చిత్ర టీజర్‌ను శనివారం రిలీజ్ చేశారు. ఈ ఈవెంట్‌లో అజయ్ భూపతి ముఖ్య అతిథిగా విచ్చేసి చిత్రయూనిట్‌ను అభినందించారు.

భాను చందర్ మాట్లాడుతూ,'ఇదొక కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా. ఇందులో నేను హీరోయిన్ ఫాదర్‌గా నటించాను. ప్రస్తుతం పిల్లలకు, తల్లిదండ్రులకు బాగా గ్యాప్ ఉంది. ఈ మూవీలో అది చక్కగా చూపించారు' అని తెలిపారు. 'ఇందులో ఒక జీవితం కనిపిస్తుంది. మన జీవితాల్లో మనం ఏమేం కోల్పోయి ఏ స్థితిలో ఉన్నామో చెబుతుంది. ఇందులో నేను హీరో కాదు. కథే హీరో. మా దర్శకుడు శివ చాలా మంచి కథను రాసుకున్నాడు. ఇది చాలా మంచి చిత్రం అవుతుంది' అని అజయ్ ఘోష్ అన్నారు.

చాందినీ చౌదరి మాట్లాడుతూ, 'ఈ సినిమా మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతుంది. ఇందులో భిన్న మనస్తత్వాలున్న రెండు పాత్రల ప్రయాణం అందరినీ ఆకట్టుకుంటుంది. విజువల్స్, మ్యూజిక్ బాగుంటాయి' అని చెప్పారు. 'బడ్జెట్ పెరిగినా ఓ మంచి సినిమాను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతోనే పూర్తి చేశాం. ఈ సినిమా ప్రేక్షకులందరికీ కనెక్ట్ అవుతుంది' అని నిర్మాత హర్ష గారపాటి తెలిపారు. దర్శకుడు శివ పాలడుగు మాట్లాడుతూ,'నన్ను నమ్మి ఈ కథను ఒప్పుకున్న అజయ్ ఘోష్‌కి, సినిమాను నిర్మించిన నిర్మాతలకు థ్యాంక్స్' అని అన్నారు.

వాట్ ఈజ్ దిస్?

ప్రచారంలో మోడీ కీలక అంశాల దాటవేత

- ప్రతిపక్షాలపై ఎదురు దాడికే ప్రాధాన్యత
- ఓటర్లను బురిడీ కొట్టించే ప్రయత్నం



న్యూఢిల్లీ : నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ సర్వే చెబుతోంది. 'గత ఐదు సంవత్సరాలతో పోలిస్తే ఇవాళ ఉద్యోగం దొరకడం సులభమా లేక కష్టమా' అని ప్రశ్నిస్తే కష్టంగానే ఉన్నదని 62 శాతం మంది కుండబద్దలు కొట్టారు. 'ధరల పెరుగుదల మాటేమిటి? ఐదేండ్లలో పెరిగాయా తగ్గాయా' అని అడిగితే ఏకంగా 71 శాతం మంది పెరిగాయనే చెప్పారు. ముచ్చటగా మూడోసారి అధికారాన్ని దక్కించుకోవాలని ఆశిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ ఉద్యోగాలు, ధరల పెరుగుదల, పొదుపు రేట్లు, ప్రజల జీవితాలు వంటి కీలక అంశాలను తన ఎన్నికల ప్రచారంలో తప్పనిసరిగా ప్రస్తావించాల్సి ఉంటుంది. కానీ ఆయన ఈ సమస్యలపై పెదవి విప్పరు. తన పాలనలో దేశం సుభిక్షంగా ఉన్నదని, ప్రగతి పథంలో పయనిస్తోందని చెబుతుంటారు. ప్రతిపక్షాలు అనవసరంగా బురద చల్లుతున్నాయని ఆరోపిస్తారు. ఆయన ప్రసంగాల్లో ప్రతిపక్షాలపై విసుర్లే తప్ప ఎక్కడా ప్రజా సమస్యల ప్రస్తావన ఉండదు. ఆకట్టుకునే ప్రసంగాలతో ఓటర్లను బురిడీ కొట్టించేందుకు ప్రయత్నిస్తుంటారు. ఈ నేపథ్యంలో కీలక అంశాల్లో మోడీ ప్రభుత్వ రికార్డును పరిశీలిస్తే పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి.

పెరుగుతున్న నిరుద్యోగం

ముందుగా నిరుద్యోగాన్ని తీసుకుందాం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 15 సంవత్సరాలు, ఆపై వయసున్న వారిలో నిరుద్యోగ రేటు 8 శాతానికి పెరిగింది. అంతకుముందు రెండు సంవత్సరాల్లో ఈ రేటు 7.5 శాతం-7.7 శాతం మధ్య ఉందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) సంస్థ తెలిపింది. ఈ సంస్థ అందించిన సమాచారం ప్రకారం దేశంలో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగుల సంఖ్య సుమారు 3.7 కోట్లకు చేరుకుంది. గత ఏడు సంవత్సరాల్లో నిరుద్యోగ రేటు ఒకే ఒకసారి...2020-21 కోవిడ్ సమయంలో...8 శాతం (8.8 శాతం) దాటింది. 2016-17లో 7.4 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు 2023-24 నాటికి 8 శాతానికి చేరుకుంది. ఇక కార్మిక భాగస్వామ్య రేటు (ఎల్‌పీఆర్) కోవిడ్‌కు ముందున్న స్థాయికి చేరుకోవడానికి తంటాలు పడుతోంది. 2016-17లో మన దేశంలో ఎల్‌పీఆర్ 46.2 శాతంగా ఉంది. అది ఆ తర్వాతి మూడు సంవత్సరాల్లో 42 శాతం-44 శాతానికి పడిపోయింది. 2020-21లో 40 శాతానికి తగ్గింది. అప్పటి నుంచి అలాగే ఉండిపోతోంది. 2023-24లో ఎల్‌పీఆర్ 2016-17లో కంటే 5.8 పర్సంటేజ్ పాయింట్లు తగ్గింది. కార్మిక మంత్రిత్వ శాఖ చెబుతున్న దాని ప్రకారం నిరుద్యోగం 45 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరుకుంది. అయితే ఈ సమాచారాన్ని మోడీ ప్రభుత్వం ప్రచురించలేదు.


ద్రవ్యోల్బణమూ అంతే

దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. స్థిర ఆదాయాలు, పెరుగుతున్న ఖర్చులు తదితర కారణాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. 2023-24తో పోలిస్తే 2012-13లోనే ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంది. అయితే నిరుద్యోగ రేటు ఇప్పుడు ఉన్నంత అధికంగా లేదు. ద్రవ్యోల్బణం పెరగడానికి బహుశా ఇది ఓ కారణం కావచ్చు. ధరల పెరుగుదల గ్రామీణ ప్రాంతాల్లో అశాంతికి కారణమవుతోంది. ఫలితంగా గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోంది.

పొదుపు తగ్గిపోతోంది

2022-23లో కుటుంబ పొదుపు ఐదు సంవత్సరాల కనిష్ట స్థాయికి పడిపోయింది. అదే సమయంలో రుణభారం పెరిగింది. వ్యక్తిగత రుణాలు అధికమయ్యాయి. గత రెండు సంవత్సరాల కాలంలో భద్రత లేని రుణాల సంఖ్య 23 శాతం పెరిగిందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్‌ను ఉటంకిస్తూ తమల్ బందోపాధ్యాయ అనే పాత్రికేయుడు తెలియజేశారు. కార్పొరేషన్లు, చిన్న, మధ్య తరహా సంస్థలకు ఇస్తున్న రుణాలు కూడా 12 శాతం-14 శాతం పెరుగుతున్నాయి.





నియంతృత్వం వైపు అడుగులు

2013-14 నుంచి పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం పెరుగుతోంది. గత రెండేండ్లుగా మాత్రం ఈ సుంకం తగ్గుతోంది. అయినప్పటికీ 2014 నవంబరుతో పోలిస్తే ఎక్సైజ్ సుంకం అధికంగానే ఉంది. ఇక మన దేశంలో ప్రజాస్వామ్యం గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. అనేక అధ్యయనాలు ఈ విషయాన్ని తగిన ఆధారాలతో రుజువు చేస్తున్నాయి. మన దేశం అత్యంత వేగవంతంగా నియంతృత్వం వైపు నడుస్తోందని ఫ్రీడమ్ హౌస్, వి-డెమ్, ఐడియా, ఆర్థికవేత్తల సూచికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సంస్థలు భారత్‌ను ప్రజాస్వామ్య దేశంగా పరిగణించడం లేదు. 'ఎన్నికల నిరంకుశత్వం'గా వర్గీకరించాయి.

విస్తరిస్తున్న బిలియనీర్ల రాజ్యం

దేశంలో అసమానతలు వేగంగా పెరిగిపోతున్నాయి. బ్రిటీష్ వలసవాదుల పాలనతో పోలిస్తే ఇప్పుడు అవి మరింతగా పెరిగాయి. దేశంలో అత్యంత సంపన్నులైన 1 శాతం మంది చేతిలో 22 శాతం వనరులు ఉన్నాయని వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ తెలిపింది. దేశంలో బిలియనీర్ల రాజ్యం వ్యాప్తి చెందుతోందని వ్యాఖ్యానించింది.

డబ్ల్యూహెచ్ఓ అంచనాలూ తప్పేనట

భారత్‌లో 47 లక్షల మంది ప్రజలు కోవిడ్ కారణంగా ప్రాణాలు కోల్పోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అంచనా వేసింది. 2020, 2021 సంవత్సరాలకు సంబంధించి ప్రభుత్వ అధికారిక లెక్కలతో పోలిస్తే ఇది సుమారు పది రెట్లు ఎక్కువ. అయితే డబ్ల్యూహెచ్ఓ సమాచారంతో మోడీ ప్రభుత్వం విభేదించింది. డబ్ల్యూహెచ్ఓ గణాంకాలను తప్పు పట్టిన ఏకైక దేశం భారతే.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886